epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

7-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 246 పేజీలు: 10+4 వెల: 6.50




ఫ్రెడ్ రామ్స్ డెల్ మేరీ ఇ.బ్రుంకోవ్ షిమోన్ సకాగుచి

## మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

2లో

**రోగనిరోధక శక్తిపై పరిశోధనలకు అత్యున్నత పురస్కారం**

**ఇద్దరు అమెరికన్లు, ఒకరు జపాన్ శాస్త్రవేత్త**

## మోగిన బీహార్ నగారా

# రెండు దశల్లో ఎన్నికలు



సిఇసి జ్ఞానేష్ కుమార్

### నవంబరు 6, 11న పోలింగ్, 14న కౌంటింగ్

### షెడ్యూలు విడుదల చేసిన ఇసి

**తెలంగాణలోని జూబ్లీహిల్స్ సహా 7 రాష్ట్రాల్లో 8 సీట్లకు ఉప ఎన్నికలు**

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబరు 10న తొలి దశ నోటిఫికేషన్ విడుదల కానుండగా, అక్టోబర్ 13న రెండో దశకు నోటిషికేషన్ జారీ కానుంది. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. బీహార్‌తో ఏడు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ ఉప ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13న నోటిఫికేషన్ జారీ కానుండగా, నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. షెడ్యూల్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఇసి వెల్లడించింది. సోమవారంనాడిక్కడ కేంద్ర ఎన్నికల కమిషన్

>>2

## పావలా వడ్డీకే

# విదేశీ విద్యా రుణాలు

**విద్యార్థులకు ప్రభుత్వం హామీ**

**అన్ని హాస్టళ్లు రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్పు**

**అన్ని వర్గాలు బలోపేతం కావాలి**

**సంక్షేమ శాఖల సమీక్షలో సిఎం చంద్రబాబు**



సోమవారం బిసి సంక్షేమ హస్టళ్లు, త్రిపుల్‌ఐటి విద్యార్థులతో సిఎం చంద్రబాబునాయుడు భేటీ అయిన దృశ్యం

**విజయవాడ, అక్టోబరు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని విద్యార్థులకు సిఎం నారా చంద్రబాబు నాయుడు మరోవరం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతీ విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిమితి లేకుండా, ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండాలని చెప్పారు. అలాగే దేశంలో ఐఐటి, ఐఐఎం నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం వర్తింప చేయాలని సూచించారు. ఇందులో 4 శాతం వడ్డీకే బ్యాంకురుణాలు ఇవ్వడంతోపాటు, దానికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని సిఎం చెప్పారు. 14 ఏళ్లలో రుణాన్ని చెల్లించుకునే వెసులుబాటు ఇస్తామని అన్నారు. మరోవైపు బిసి విద్యార్థులు ఐఐటి, నీట్‌లో కోచింగ్ కోసం రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ సంక్షేమంపై మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, ఫరూఖ్, సవిత, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రతీ పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని సిఎం చెప్పారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టళ్లలో మౌలికవసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థి

>>2

## సుప్రీం సిజెపై దాడికి యత్నం

**కోర్టు హాలులోనే షూ విసిరిన లాయర్**



లాయర్ కిషోర్ రాకేశ్ సిజెఐ బిఆర్ గవాయ్

**అతడిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది**

**నన్ను ప్రభావితం చేయలేరు: చీఫ్ జస్టిస్ గవాయ్**

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** సుప్రీంకోర్టులో ఇవాళ సిజెఐ బిఆర్ గవాయ్‌పై ఓ లాయర్ తన షూ విసిరేందుకు ప్రయత్నించారు. సిజెఐ కూర్చున్న డయాస్ వద్దకు ఓ లాయర్ వెళ్లి తన కాలుకున్న షూను తీసి, జడ్జి మీదకు విసిరే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఓ కేసు వాదనల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే అక్కడే ఉన్న సెక్యూరిటి సిబ్బంది వెంటనే కలగజేసుకుని ఆ లాయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని బయటకు తీసుకెళ్లారు. ఆ లాయర్‌ను కిషోర్ రాకేశ్‌గా గుర్తించారు. కోర్టు రూమ్ నుంచి బయటకు తీసుకెళ్తున్న సమయంలో ఆ లాయర్ సనాతన ధర్మంపై నినాదాలు చేసినట్లు తెలుస్తోంది. సనాతన్ కా అప్మాన్ నహీ సహింగే సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదని ఆ లాయర్ అన్నారు. సిజెఐ గవాయ్

>>2

## పెట్టుబడులు పెంచండి

**టాటాగ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేష్ భేటీ**

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబయిలో భేటీ అయ్యారు. ఈ భేటీలో టాటా పవర్ రెన్యూవబుల్స్ సిఇఒ సంజయ్ కుమార్ బంగా, ఇండియా హోటల్స్ ఎండీ పునీత్ ఛత్వాల్, టాటా ఎలక్సి సిఇఒ మనోజ్ రాఘవన్, టాటా ఆటో కాంప్ సిఇఒ మనోజ్ కోల్హాత్కర్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సిఇఒ

>>2

## కల్తీ దగ్గుమందు రాష్ట్రానికి రాలేదు..



**ఔషధాల నాణ్యతపై నిరంతర నిఘా**

**- ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 12 మంది చిన్నారుల మరణాలకు దారితీసిన కల్తీ దగ్గు మందు సదరు కంపెనీ నుంచి రాష్ట్రానికి సరఫరా కాలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఔషధ దుకాణాలకు,ప్రభుత్వాసుత్రులకు సదరు కంపెనీ దగ్గు మందు పంపిణీ జరగలేదని వెల్లడించారు. తాజా పరిణామాలపై మంత్రి సత్యకుమార్‌కు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, రాష్ట్ర ఔషధ

>>2







సోమవారం 'స్వచ్ఛతా అవార్డుల ప్రదానం' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

## త్వరలో 100 స్వచ్ఛ రథాలు అందుబాటులోకి

### స్వచ్ఛత అవార్డుల కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

### జై స్వచ్ఛ సేవక్ అంటూ జై కొట్టించిన ముఖ్యమంత్రి

### పారిశుధ్య కార్మికులు వీరులే: సిఎం

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛత కోరుకునే ప్రతీఒక్కరూ సేవకులని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పరిశుభ్రతకు నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులే నిజమైన దేశభక్తులని ఆయన తెలిపారు. స్వచ్ఛతను గాంధీజీ దైవంతో పోల్చారని గుర్తు చేశారు. పారిశుద్ధ్య కార్మికుల్ని ఎప్పుడూ చిన్నచూపు చూడొద్దని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే స్వచ్ఛ ఉద్యమం లేదు, స్వచ్ఛ ఆరోగ్యం లేదని చంద్రబాబు నొక్కిచెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛతా అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు స్వచ్ఛతను పాటించడంలో అగ్రస్థానంలో ఉన్న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేశారు చంద్రబాబు. 69 రాష్ట్రస్థాయి, 1,257 జిల్లాస్థాయి విజేతలకు అవార్డులను అందించారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, పరిశ్రమలు, స్కూళ్లు, ఆస్పత్రులు, స్వచ్ఛాంధ్ర సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు అవార్డులు ఇచ్చారు. మొత్తంగా 21 కేటగిరీల్లో స్వచ్ఛతా అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు..

అపరిశుభ్రంగా ఉంటే మనం ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండదని చంద్రబాబు పేర్కొన్నారు. కానీ కార్మికులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటారని చెప్పారు. అందుకే వారంటే తనకు చాలా గౌరవమని స్పష్టం చేశారు. అనంతరం చంద్రబాబు వారికి చేతులెత్తి నమస్కారం చేశారు. మొదటిసారి తాను ముఖ్యమంత్రి అయినప్పుడు పచ్చదనం పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని గుర్తు చేశారు. స్వచ్ఛభారత్ ఏ విధంగా ఉండాలని దానిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కమిటీ ఏర్పాటు చేశారని చంద్రబాబు అన్నారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణను సిఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. కంగ్రాట్స్ నారాయణ అంటూ సభాముఖంగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పేరుకుపోయిన 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఏడాదిలోనే మొత్తం క్లీన్ చేసినందుకు మంత్రి నారాయణను, మున్సిపల్ శాఖకు అభినందనలంటూ వ్యాఖ్యానించారు. గతేడాది అక్టోబర్ 2కు రాష్ట్రంలో 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ పేరుకుపోయి ఉందని గుర్తుచేశారు. ఏం చేస్తారో తెలియదు.. కానీ వచ్చే అక్టోబర్ 2కు మాత్రం చెత్త పూర్తిగా ఎత్తేయాల్సిందే.. ఎలా ఉంటుందో అదే చెప్పాలని చెప్పినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. దృఢ సంకల్పంతో పనిచేసిన నారాయణకు అభినందనలు అంటూ.. ప్రశంసలు కురిపించారు. ఈ అక్టోబరు 2 కంటే 15 రోజులు ముందుగానే మంత్రి నారాయణ ఆధ్వర్యంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ చెత్తను విజయవంతంగా తొలగించారని సిఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మన ఇల్లు, మన ఊరు, మన వీధులను నిరంతరం శుభ్రంగా ఉంచుతోన్న పారిశుద్ధ్య కార్మికులకు వందనం అన్నారు.అపరిశుభ్రతను తరిమేసే వాళ్లు నిజమైన వీరులు అని అభినందించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనికులు టెర్రరిస్టులను ఏరి వేశారన్నారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేసే పారిశుధ్య కార్మికులు కూడా వీరులే అన్నారు.

**రాత్రిపూట క్లీనింగ్ విధానం కూడా అమలు చేశాం**

గ్రీన్ పాస్ పోర్టు ద్వారా విద్యార్థులలో చెట్లు పెంచే అలవాటును పెంచుతున్నాం యూజ్ అండ్ త్రో పాలసీ కాదు... యూజ్‌రికవరీ యూజ్ పాలసీ అమలు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, కొలుసు పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య, పలువురు ఉన్నతాధికారులు, తదితరులు హాజరయ్యారు.

## విదేశీ విద్యా రుణాలు

>> తులు ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. నసనకోట, ఆత్మకూరు బిసి బాలికల పాఠశాలను రూ.2.65 కోట్లతో జూనియర్ కాలేజీగా ఉన్నతీకరించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. అలాగే తల్లికి వందనం పథకం నుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు నిధులు ఇస్తామని వెల్లడించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.1,700 కోట్లు కాలేజీలకు చెల్లించకపోవడంతో విద్యార్థులే రూ.900 కోట్లు చెల్లించారని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఇంకా యాజమాన్యాలకు సుమారు రూ.800 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చెల్లించాల్సి ఉందని వివరించారు. సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యత తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్‌లు, పాస్టర్లకు బకాయిలు ఏమైనా ఉంటే వెంటనే విడుదల చేయాలన్నారు. హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వక్ఫ్ ప్రాపర్టీ ఆడిట్ జరిగింది. ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెసుకునేందుకు మదింపు జరగాలన్నారు. ఆదరణ కింద ఇచ్చే పనిముట్లు ఆధునికంగా, ఆయా కుల వృత్తులకు ఉపయోగకరంగా ఉండాలని సిఎం అన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సిఎం అన్నారు. మత్స్యకార వర్గాలు సీవీడ్ లాంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఈ వర్గాలపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణతోనే ఆయా వర్గాలు ఎక్కువ ఆదాయాన్ని పొందగలవని చెప్పారు. అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా. అందరికీ సంక్షేమ ఫలాలు దక్కేలాఅధికార యంత్రాంగం చూడాలని, సంతృప్తి పరచాలని సీఎం సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి న్యాయ పరమైన ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలు బిసి భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 64 కులాల కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని అధ్యయనం చేసేందుకు అన్ని వర్క్ షాపు నిర్వహించాలని సూచించారు. బిసి రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్థుల్లో ఈ ఏడాది ట్రిపుల్ ఐటికి ఎంపికైన వారిలో కొందరు విద్యార్థులు సమీక్షా సమావేశానికి ముందు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## రెండు దశల్లో ఎన్నికలు

>> ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి మీడియాతో మాట్లాడుతూ... బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇవిఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. 250 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అశ్వికదళాలతో గస్తీ నిర్వహించనున్నట్లు ఇసి పేర్కొంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వివరించారు. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణ కోసం 4.53 లక్షల మందిని వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)తో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగిందని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సమాధానమిచ్చారు.

బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. అందులో ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు 38, ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు 2 ఉన్నాయి. బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు 3.92 కోట్లు, మహిళా ఓటర్లు 3.50 కోట్లు ఉన్నారు. 1,725 మంది ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లున్నారు. 14 లక్షల మంది తొలి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వందేళ్లు పైబడి వయస్సున్న ఓటర్లు 14 వేల మందికి పైగా ఉన్నారని ఇసి పేర్కొంది. తొలి దశలో 121 స్థానాలకు, రెండో దశలో 122 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరుగనుంది. బీహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22లోపు ముగియనుంది. ఆ లోపే ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతోనే నవంబర్ 16కు ప్రక్రియ ముగించేలా కార్యాచరణ రూపొందించినట్లు ఇసి ప్రకటించింది.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 11న బీహార్ అసెంబ్లీ పోలింగ్ రెండవ దశతో పాటు ఈ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సిఇసి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. నవంబర్ 14న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు ఉప ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, తెలంగాణ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, జార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల్లో ఖాళీ అయిన 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తర్వాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలకు బైఎలక్షన్స్ జరుగనున్నాయి.

మరోవైపు రాజస్థాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పటడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, దీంతో ఈ 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల కోసం ఇసి షెడ్యూల్ జారీ చేసింది.

## మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** వైద్య రంగంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం లభించింది. రోగనిరోధక వ్యవస్థ (పెరిఫిరల్ ఇమ్యూన్ టోలరెన్స్)పై పరిశోధనలకు గాను మేరీ ఇ.బ్రుంకోవ్, ఫ్రెడ్ రామ్స్ డెల్, షిమోన్ సకాగుచిలు అత్యున్నత అవార్డుకు ఎంపికయ్యారు. వారు చేసిన పరిశోధనలు క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ రోగాలకు నూతన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడతున్నాయి. నోబెల్‌కు ఎంపికైన వారికి డిప్లొమా, బంగారం పతకంతో సహా 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్‌లు (సుమారు రూ.10.38 కోట్లు) అందిస్తారు. ఈ మేరకు నోబెల్ కమిటీ చైర్మన్ ఓల్లీ కాంపె ఒక ప్రకటనలో వెల్లడించారు. నోబెల్ పురస్కారం అందుకున్న వారిలో ఇద్దరు అమెరికన్లు, ఒక జపాన్ శాస్త్రవేత్త ఉన్నారు. మేరీ ఇ బ్రుంకోవ్ అమెరికాలోని సియాటెల్‌లో ఉన్న ఇన్సిటిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయోలజీలో, ఫ్రెడ్ రామ్స్‌డెల్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న సోనోమా బయోథెరపాటిక్స్‌లో పనిచేస్తున్నారు. షిమోన్ సకాగుచి జపాన్‌లోని ఓసాకా యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంలో ముగ్గురు పరిశోధకులు కీలక విషయాలను గుర్తించారు. శరీరంలోని అత్యంత శక్తివంతమైన రోగనిరోధక వ్యవస్థను నియంత్రించాల్సి ఉంటుందని, లేదంటే ఆ వ్యవస్థ మన శరీర అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. రోగనిరోధక వ్యవస్థ శరీరాన్ని దెబ్బతీయకుండా ఉండే పెరిఫరల్ ఇమ్యూన్ టాలరెన్స్ గురించి ముగ్గురు శాస్త్రవేత్తలు స్టడీ చేసినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. రోగనిరోధక వ్యవస్థలో సెక్యూర్టీ గార్డుల్లా పనిచేస్తున్న రెగ్యులేటరీ టీ కణాల గురించి శాస్త్రవేత్తలు ఆవిష్కరణ చేశారు. ఈ టీ కణాలు మన శరీరంపై ఇమ్యూన్ కణాలు దాడి చేయకుండా నివారిస్తాయని గుర్తించారు. టీ కణాల అధ్యయనంవల్ల మన రోగనిరోధక వ్యవస్థ పనితీరు విధానంఅర్థమవుతుందని, దీనివల్ల ఆటోఇమ్యూన్ వ్యాధులు ఎందుకు డెవలప్ కావడంలేదన్న విషయం తెలుస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## సుప్రీం సిజెపై దాడికి యత్నం

>> మాత్రం ఆ ఘటన పట్ల ఎటువంటి అధైర్యానికి లోనుకాలేదు. కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని కోరారు. ఇలాంటి వాటి వల్ల ఎవరూ విచలితులు కావొద్దు అని, తామేమీ చలించడం లేదని, ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని సిజెఐ గవాయ్ పేర్కొన్నారు. అయితే కొన్ని రోజుల క్రితం సిజెఐ గవాయ్ ఓ కేసులో చేసిన వ్యాఖ్యల వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఖజురహోలోని ఏడు అడుగల విష్ణు విగ్రహాన్ని పునర్ ప్రతిష్ఠించాలని దాఖలు చేసిన కేసులో సిజెఐ గవాయ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ కేసును ఆయన డిస్మిస్ చేస్తూ వెళ్లి ఆ దేవుడినే అడుక్కోవాలని కామెంట్ చేశారు. విష్ణువుకు వీరభక్తుడిని అని చెప్పుకుంటున్నావు కాదా, వెళ్లి ఆ దేవుడినే ప్రార్థించుకో, అదో ఆర్కియాలజీ సైట్ అని, దానికి ఎఎస్ఐ పర్మిషన్ అవసరం ఉంటుందని ఆ కేసులో సిజెఐ వ్యాఖ్యానించారు. ఖజురహో కేసులో సిజెఐ గవాయ్ చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో తీవ్ర దుమారం చెలరేగింది. మతపరమైన భావాలను కించపరిచినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ వివాదానికి ఆయన తనదైన స్టయిల్‌లో తెరదించారు. రెండు రోజుల తర్వాత ఓ కేసులో స్పందిస్తూ తానేమీ ఏ మతాన్ని అమర్యాదపరచలేదన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని, కేవలం సోషల్ మీడియాలోనే తన వ్యాఖ్యలు ప్రచారం అయినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సిజెఐకి అండగా నిలిచారు. సోషల్ మీడియాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతిచర్యలు భిన్నంగా ఉంటాయన్నారు.

## మీపై దాడి భారతీయులను ఆగ్రహానికి గురిచేసింది

### చీఫ్‌జస్టిస్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై షూ దాడిని ప్రధాని నరేంద్ర మోడీ ఖండించారు. భారత సిజెఐపై దాడికి యత్నించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన సిజెఐతో మాట్లాడారు. మన సమాజంలో ఇలాంటి అనైతికమైన చర్యలకు తావు లేదని మోడీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌తో మాట్లాడాను. ఈరోజు ఉదయం సుప్రీంకోర్టు ఆవరణలో ఆయనపై జరిగిన దాడి భారతీయులను ఆగ్రహానికి గురి చేసింది. ఇలాంటి అనైతికమైన ఆమోదయోగ్యంకాని చర్యలకు మన సమాజంలో చోటు లేదు. సీజేఐపై దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని మోడీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

## స్వచ్ఛతలో దేశాన్ని అగ్రగామిగా నిలపడమే

## ప్రధాని మోడీ సంకల్పం

### రూ.96 వేల కోట్లతో పారిశుధ్య పనులు: మంత్రి సత్య కుమార్ యాదవ్

**శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు 06, ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంను పారిశుద్ధంలో అగ్రగామిగా ఉంచాలన్నదే ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పించుకున్నారని, అందుకోసం దేశ వ్యాప్తంగా 96 వేల కోట్ల రూపాయలతో పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి పట్టణంలో శిల్పారామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ఇప్పటివరకు 96 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందంటే కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కు ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. దేశవ్యాప్తంగా 17 విభాగాల్లో సర్వేచేయగా అందులో రాష్ట్రానికి రెండు అవార్డులు దక్కడం విశేషమన్నారు. జిల్లాస్థాయిలో అవార్డులకు ఎంపికైన 47 మందిని అభినందించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రిఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ తాము నివసించే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే పరిశుభ్రతను పాటించడం ఒక బాధ్యతగా అలవాటుచేసుకోవాలన్నారు. తద్వారా పిల్లలకు డయేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. పిల్లలు డయేరియా బారిన పడితే ఎదుగుదలతో పాటు ఆరోగ్యం క్షీణించి మృత్యువాత పడే అవకాశం ఉంటుందన్నారు.

గత 10 సంవత్సరాలలో డయే రియా, దోమకాటు వల్ల దాదాపు 60 వేల మందిని రక్షించినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. గతంలో బహిర్భూమికి వెళ్లాలంటే అక్క చెల్లెమ్మలు సూర్యోదయం మునుపు, సూర్యా అస్తమయం తర్వాత వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉండేదన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో 12కోట్ల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిం చడం జరిగిందని, తద్వారా అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని నిలపడానికి ఈ కార్యక్రమం ఎంత గానో దోహద పడిందన్నారు.

### వారం - వర్జ్యం

07-10-2025, మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం

శరదృతువు, కృష్ణపక్షం

○పౌర్ణమి ఉ.9.16, కృ.పాడ్యమి తె.5.54

రేవతి రా.1.26

వర్జ్యం : రా.7.11-8.27

దు.ఉ.8.22-9.10

ఉ.6.30-7.15

రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** ఆరోగ్యం, వాహనాల విషయంలో కాస్త మెలుకువలోన వ్యవహరించండి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** మాట పట్టింపులో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు

**సింహం:** సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** నూతన పెట్టుబడుల విషయంలో మెలుకువతో వ్యవహరించండి.

**తుల :** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులకు పదోన్నత పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో పెద్దల సలహాలు పాటించండి.

**ధనుస్సు:** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు.

**మకరం:** క్రమశిక్షణను పాటించడం వలన లాభపడుతారు.

**కుంభం:** మీలోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం సాగిస్తారు.

**మీనం :** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు

### పైడిమాంబను దర్శించుకున్న

## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**విజయనగరం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గజపతుల ఆడపడుచు శ్రీపైడితల్లి అమ్మవారిని మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. సంప్రదాయానుసారం అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా కోట నుంచి బయలుదేరి, మేళ తాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాన్ని చేరుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు. పైడిమాంబకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయఅధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అశోక్ గజపతిరాజు దంపతులకు ఆలయ పూజారులు ఆశీర్వచనం పలికి, అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు కుమార్తె, విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**యేడాదిలోగా ఆలయ అభివృద్ధి పనులు:**

ఏడాదిలోగా పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని అశోక్ గజపతిరాజు అన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే అభివృద్ధి పనులను మొదలు పెట్టామని, వచ్చే ఏడాది అమ్మవారి పండగ లోపల అవన్నీ పూర్తవుతాయని చెప్పారు. పైడితల్లి అమ్మవారు ప్రజలందరిని చల్లగా చూడాలని ఆయన ఆకాంక్షించారు.

## కల్తీ దగ్గుమందు రాష్ట్రానికి రాలేదు..

>> నియంత్రణ పరిపాలనా ఇంచార్జి డైరెక్టర్ జనరల్, రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరీషా నివేదికలు అందచేశారు. కల్తీ దగ్గు మందు జాడ రాష్ట్రంలో లేనందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సూచనలు అనుసరించి, రెండేళ్లలోపు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి ద్రవరూపంలో వైద్యులు మందులు సూచించొద్దని ఆదేశాలు పంపాలని అధికారులకు తెలిపారు. 'ఔషధ దుకాణాల వారికి సదరు కంపెనీ దగ్గు మందు సరఫరా జరిగినట్లు ఆనవాళ్లు డ్రగ్ ఇన్స్పెక్టర్ల తనిఖీల్లో కనిపించలేదు. సదరు కంపెనీ నుంచి దగ్గు మందు పంపిణీ జరిగినట్లు దుకాణాల వారి వద్ద ఇన్వాయిస్‌లు కనిపించలేదు. దగ్గు మందు బాక్సులు దుకాణాల్లో కనిపించలేదు. డ్రగ్ ఇన్స్పెక్టర్ల ద్వారా తనిఖీల పరంపర ఇంకా జరుగుతూనే ఉంది. ఔషధ నియంత్రణ పరిపాలనా డైరెక్టర్ జనరల్ ప్రధాన కార్యాలయంలోని అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షిస్తోంది" అని ఇంచార్జి డైరెక్టర్ జనరల్ గిరీషా ఆ నివేదికలో పేర్కొన్నారు. "ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసేందుకు కొనుగోలుచేసే మందుల్లో సదరు కంపెనీ కల్తీ మందు లేదు. రాష్ట్రంలో 4 రకాల కంపెనీల దగ్గుమందులు వాడుతున్నాం. కాంబినేషన్ ఫార్ములేషన్ కాకుండా సింగిల్ మాలిక్యుల్ సిరప్ మా సంస్థ ప్రభుత్వాసుపత్రులకు పంపిణీ చేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలలో కాంచీపురంకి చెందిన కంపెనీ శ్రీశాన్ ఫార్మస్యూటికల్స్ నుంచి కోల్డ్రిఫ్ దగ్గు మందు కాంబినేషన్ రూపంలో సరఫరా జరిగింది. ఈ క్రమంలో డైఇథిలిన్ గ్లైకాల్ నిర్దిష్ట ప్రమాణాల కంటే అధిక మోతాదులో వాడిన కల్తీమందు ఆ రాష్ట్రాల్లో సరఫరా జరిగింది"అని రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరీషా నివేదికలో వివరించారు.

## పెట్టుబడులు పెంచండి



సోమవారం టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

>> సుకరన్ సింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ ఎండీ రణధీర్ ఠాకూర్, టాటా కెమికల్స్ ఎండీ ఆర్.ముకుందన్, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సిఇఒ వినాయక్ పాయ్, ఎస్ టి టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ సిఇఒ బిమల్ ఖండేల్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో రాష్ట్ర అగ్రనేతల సమక్షాన ఈ నెలలో నిర్వహించనున్న టిసిఎస్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా ఆహ్వానించారు. టాటా పవర్ రెన్యూవబుల్స్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా రూఫ్‌టాప్ సోలార్ అభివృద్ధి చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసే మార్గాన్ని అన్వేషించాలని, రాష్ట్రంలో సెల్, మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ స్థాపనకు గల అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో టాటా ఎల్క్సి రీజనల్ ఆఫీస్/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, తూర్పుతీరంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించండి. ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్ వేర్ డిఫైండ్ వెహికిల్స్, అటానమస్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీస్, ఆధారిత మొబిలిటీ, మెడ్‌టెక్ ఇన్నోవేషన్‌ల వంటి రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించండి. టాటా ఆటోకాంప్ ఆధ్వర్యాన శ్రీసిటీలో ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన కంపోజిట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు స్థాపించే అవకాశాలను అన్వేషించండి. ఇందుకు అవసరమైన భూమి, ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రభుత్వం అందిస్తుంది. పెట్టుబడి పరిమాణాన్ని ఆధారంగా తీసుకుని ఇవి, ఎలక్ట్రానిక్ భాగాల తయారీ విధానంలో ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది. శ్రీసిటీలో ఇంజనీరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అవకాశాలను పరిశీలించండి. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ నేతృత్వాన ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తి యూనిట్‌ను స్థాపించడానికి అవకాశాలను అన్వేషించండి. రక్షణ, భద్రతా వ్యవస్థల రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటులో ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించండి. టాటా ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్‌లో ఓసాట్ సదుపాయం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించండి. ఇందుకోసం అవసరమైన భూమిని కోరుకున్న ప్రదేశంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ కింద అందించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## 'అమరావతి పోలవరం - స్వర్ణాంధ్ర 2047కు మూల స్తంభాలుగా నిలుస్తాయి'

**సచివాలయం,అక్టోబరు 6,ప్రభాతవార్త :** ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టితో అమరావతి మరియు పోలవరం అభివృద్ది రాష్ట్రం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని సాధించడంలో ప్రధాన స్థంభాలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర 20సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ దిశగా భారత ప్రధానమంత్రి వికసిత్ భారత్ 2047 సంకల్పంతో సయోధ్యగా రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. సోమవారం సచివాలయంలో రాజస్థాన్ ప్రణాళిక శాఖ అధికారులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రాజధాని అవసరం ఏర్పడిందని అందుకనుగుణంగా ఏపి పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అమరాతిని రాజధాని నగరంగా ఎంపిక చేశారని తెలిపారు.ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ పోస్టర్ అండ్ పార్ట్నర్స్ రూపొందించిన 217 చకిమీవిస్తీర్ణంలో మాస్ట ర్‌ప్లాన్ ద్వారా అమరా వతి ఒక ఆధునిక, సుస్థిర,ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దబ డుతోందని చెప్పారు. రాజస్థాన్ రాష్ట్ర ప్రణాళిక సంయుక్త కార్యదర్శి చేతన్ ప్రకాష్ మాండరియా మాట్లాడుతూ రెండు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా ఏపికి రావడం జరిగిందన్నారు.వికసిత్ భారత్‌లో భాగంగా రాజస్థాన్ రాష్ట్రం 4.3ట్రిలియన్ యుఎస్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా చేయాలనే లక్ష ంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏపిలో అమలుచేస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి రాజస్థాన్ రాష్ట్రంలో అమలు చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఏపిలో పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పి-4కార్యక్రమం అద్భుతంగా ఉందని ఆయన కితాబిచ్చారు.

# కొండచరియలు జారకుండా

## తిరుమల ఘాట్‌రోడ్డులో 'రాక్‌బోల్టింగ్, రాక్ ఫెన్సింగ్'



**ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల:** భారీ వర్షాలు కురిసినా...ప్రకృతి వైపరీత్యాలతో వరదలొచ్చినా శేషాచలంకొండల్లోంచి బండరాళ్ళు ఘాట్‌రోడ్డుపై జారిపడకుండా తిరుమల తిరుపతి దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఐఐటి చెన్నై,ముంబై నిపుణుల సూచనలతో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించిన టిటిడి ఇంజనీరింగ్ విభాగం అక్కడ తగిన రాక్‌బోల్టింగ్ విధానాన్ని అమలుచేసింది. ఇంకా అక్కడ రాళ్ళస్థితి, మట్టిరకం, రహదారి ఎత్తు వంటి పరిస్థితులను అంచనా వేసి తగిన బోల్టింగ్ డిజైన్ అమలుచేస్తున్నారు. ఈ తిరుమల రెండోఘాట్‌లో దాదాపు రాక్‌బోల్టింగ్ పనులు, రాక్ ఫెన్సింగ్ పూర్తికావస్తోంది. ఈ విధానంలో కొండగోడలలో ఉక్కుబోల్టులు బిగించి వాటిని కాంక్రీటులతో బలంగా ఉండేలా చూస్తున్నారు. ఆపై వాటిచుట్టూ ఇనుప వలలు బిగిస్తున్నారు. దీనివల్ల కొండల్లోని రాళ్ళు వానలొచ్చినా కదలకుండా ఉంటాయి. ఈ సాంకేతిక పనులతో భవిష్యత్తులో బలమైన వర్షాలు కురిసినా,వరదలు వచ్చినా కొండల్లోంచి మట్టి,బండరాళ్ళు జారడానికి అవకాశం లేకుండా టిటిడి ఇంజనీరింగ్ గట్టి చర్యలు చేపడుతోంది. గత మూడునాలుగునెలలుగా తిరుపతి నుండి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో రక్షణగోడలు మరమ్మతులు చేయడం, బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని తెలిసిన చోట్ల ఐఐటి నిపుణుల సూచనలతో బలమైన ఇనుపకంచెలా వేసి పూర్తిగా ఆ ప్రాంతాన్ని కప్పేస్తున్నారు. వర్షాలకు బండరాళ్ళు జారినా ఈ వలలోపలే చిక్కుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో ఎడతెరపి లేకుండా వరుసగా రెండుమూడురోజులు జోరువానొస్తే కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందనే భయం అటు టిటిడి అధికారుల్లో ఇటు భక్తుల్లో ఉండేది. తిరుమలకు చేరుకునే రెండోఘాట్ ప్రమాదకరమని, ఈ మార్గంలో కొన్నిచోట్ల మట్టిజారిపడి బండరాళ్ళు పడేప్రమాదం లేకపోలేదని దశాబ్ధకాలంక్రిందటే ఐఐటి నిపుణులు, ఇంజనీరింగ్ నిపుణులు హెచ్చరించారు. రెండోఘాట్‌లో దాదాపు కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని గుర్తించిన ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అధికారులు గోడలను ఎత్తు పెంచడం, ఇనుప కంచెగ్రిల్స్ వేయడం చేశారు. ఇప్పుడు కొండల్లో ఎక్కడ బండరాళ్ళు జారుతాయనేది గుర్తించిన నిపుణుల సూచనలతో రెండోఘాట్‌లో అలిపిరి వినాయకస్వామి గుడి దాటిన తరువాత లింకురోడ్డు మధ్య వరకు కొండచరియలు విరిగి పడే ప్రాంతాలను సూచాయప్రాయంగా గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు అందుకు తగ్గట్లు పనులు సాగిస్తున్నారు. శేషాచలం కొండల్లో దట్టమైన అటవీప్రాంతాన్ని విడదీసి నాలుగుదశాబ్ధాల క్రిందట రోడ్డుమార్గం నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం ,ప్రస్తుత పరిస్థితుల్లో ఘాట్‌లో భక్తుల భద్రతపై మరింత దృష్టి సారించింది.తిరుమలకు రెండవ ఘాట్‌రోడ్డు 18 కిలోమీటర్లు అటవీప్రాంతంలోనే ఉంది. ఇందులో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో చాలావరకు ప్రమాదకర మలుపులు, పూర్తిగా కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు గుర్తించారు. 2014వ సంవత్సరంలో, ఆ తరువాత 2021 నవంబర్-డిసెంబర్‌నెలల్లో భారీ వరదలు రావడంతో వరదనీటి ఉధృతికి తిరుమలకొండలపై నుంచి వరదనీరు ప్రవాహానికి మట్టికొట్టుకువచ్చి రెండోఘాట్ పూర్తిగా దెబ్బతింది.

## సిఎం పర్యటనకు ముందే వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు

### - అప్రమత్తమైన పోలీసులు

**తిరుపతి,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు తిరుపతిజిల్లా స్వగ్రామం నారావారిపల్లి పర్యటనకు 24 గంటలు ముందుగానే హెలిప్యాడ్ ఎస్వీ వ్యవసాయకళాశాలలో బాంబులు పెట్టామనే నకిలీ మెయిల్ పోలీసులును పరుగులు తీయించింది. అప్పటికే హెలిప్యాడ్ ప్రాంగ ణంలో పోలీసులు భద్రతపరంగా మొహరించినా అనుమానాస్పదంగా వచ్చిన మెయిల్‌తో పోలీసులు,వ్యవసాయకళాశాల యాజమాన్యం ఆందోళన చెందింది. సోమవారం ఉదయం నకిలీ మెయిల్‌తో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మరింత అప్రమత్తమయ్యారు. వెంటనే బాంబ్‌డిస్పోజల్ టీమ్, పోలీసు జాగిలాలను రంగంలోకి దించి అణువణువూ తనిఖీ చేశారు. అయితే ఎక్కడా ఎలాంటి బాంబులుగానీ, ఆర్డీఎక్స్ ప్రేలుడుపదార్థాలుగానీ లేవని తేల్చారు. దీంతో సిఎం పర్యటనలో మంగళవారం ఉదయానికి హెలిప్యాడ్ స్థలాన్ని కూడా ముందుజాగ్రత్తగా నారావారిపల్లి సమీపం లోని ఎ.రంగంపేటకు పోలీసు యంత్రాంగం మార్పుచేసింది. మొత్తంమీద తిరుపతి జిల్లాలో, కేంద్రంలో వరుసగా నకిలీ మెయిల్స్ మాత్రం పోలీసులకు కునుకులేకుండా చేస్తోంది.

# తిరుమల సమాచారం

## నేడు పౌర్ణమి గరుడసేవ



**తిరుమల,అక్టోబర్ 6 ప్రభాతవార్తప్రతినిధి:** ఆశ్వయుజమాసం పౌర్ణమిగరుడసేవ మంగళవారం సాయంత్రం తిరుమలలో జరగనుంది. ప్రతినెలా పౌర్ణమికి మలయప్పస్వామికి గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీ, మంగళవారం సాయంత్రం 7గంటలకు మలయప్పస్వామిని గరుడునిపై కొలువుదీర్చి ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. కాగా పదిరోజుల వ్యవధిలో మళ్ళీ గరుడవాహనసేవ తిరుమలలో జరగనుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసి మాసంలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్ ఎవి రవీంద్రబాబు తెలిపారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## షిర్డీ యాత్రికుల కోసం తిరుపతి నుండి రెగ్యులర్ రైలు

### - అన్ని వర్గాలకు ప్రయోజనకరంగా ప్రయాణం



**తిరుమల,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతి నగరం నుండి మరో పుణ్యక్షేత్రం షిర్డీకి రైల్వేశాఖ రెగ్యులర్‌గారైలును నడుపుతోంది. ఈ రైలును ఇటీవల పూర్తిస్థాయిలో యాత్రికుల సౌలభ్యంకోసం మార్పుచేస్తూ రైల్వే అధికారులు షెడ్యూల్ ఖరారుచేశారు. సిఎం చంద్రబాబు కోరికతో రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుని తిరుపతి-షిర్డీ మధ్య రెగ్యులర్‌రైలును నడిపేలా చూసింది. భక్తుల నుండి వస్తున్న డిమాండ్‌తో ,విజ్ఞప్తి మేరకు 07637/07638 నంబర్లతో నడుస్తున్న రైలును రెగ్యులర్ సర్వీస్‌గా మార్చింది. రెండు పుణ్యక్షేత్రాల మధ్య యాత్రికులు సులభంగా దేవుళ్ళ దర్శనం చేసుకునేలా చూస్తోంది. తిరుపతి నుండి బయలుదేరే ఈ రైలు రేణిగుంట, ధర్మవరం, రాయచూర్, షోలాపూర్, దౌండ్ వంటి ప్రధాన స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ రైలు రెగ్యులర్‌గా చేయడంతో షిర్డీకి వెళ్ళే యాత్రికులకు మరింత సులభప్రయాణం కానుంది. అంతేగాక ఈ రైలు తిరుపతినుండి బయలుదేరిన తరువాత రేణిగుంట, గూడూరు, నెల్లూరు,ఒంగోలు, చీరాల,తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నడికుడిలో ఆగుతుంది.తెలంగాణరాష్ట్రంలో మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్‌ల రైల్వేస్టేషన్‌లలోనూ ఆగుతుంది. రెగ్యులర్‌గా నడవడం వల్ల షిర్డీ-తిరుపతి మధ్య ప్రయాణీకులకు ముందుగానే తమ యాత్ర ప్రణాళిక సిద్ధంచేసుకునే వీలుకలిగింది. సాధారణ బోగీలతో బాటు ఏసి కోచ్‌లు కలిగి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

## తెలుగు రాష్ట్రాల మీదుగా తిరుపతి వెళ్లే ప్రత్యేక రైళ్లు తిరుచానూరు వరకు..

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 06, ప్రభాత వార్త:** వివిధ ప్రాంతాల నుండి తెలుగురాష్ట్రాలమీదుగా తిరుపతివెళ్ళేపలు ప్రత్యేక రైలు సర్వీసులను తిరుచానూరు వరకే నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. సికింద్రాబాద్‌తిరుచానూరు సికింద్రాబాద్ ల మధ్య తిరిగే నెంబర్ 07009/10 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను ఈనెల 09 నుంచి, నాందేడ్ తిరుచానూరునాందేడ్ మధ్య తిరిగే నెంబర్ 07015/16 రైలును ఈనెల 11 నుంచి, చర్లపల్లి సికింద్రాబాద్‌చర్లపల్లి మధ్య తిరిగే నెంబర్ 07017/18, జాల్నాతిరుచానూర్ జాల్నా మధ్య తిరిగే నెంబర్ 07609/10, చర్లపల్లితిరుచానూరుచర్లపల్లి మధ్య తిరిగే నెంబర్ 07251/52 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను తిరుపతి నుంచి కాకుండా తిరుచానూరు వారికే నడుపుతున్నామన్నారు.

## మేధోమథనంతో మరింత మెరుగైన సేవలు

### - పౌర సేవల్లో సంతృప్తి స్థాయే ముఖ్యం - వాట్సప్ గవర్నెన్స్ వినియోగం మరింత పెరగాలి: సిఎం చంద్రబాబు



**విజయవాడ అక్టోబరు 6, ప్రభాతవార్తప్రతినిధి:** వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌర సేవలు మరింత మెరుగు పరిచేందుకు అధికారులు మేధోమథనం జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పౌర సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆర్టీజీఎస్, పౌర సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి, సీఎస్ కే.విజయానంద్, ఐటీ, ఆర్టీజీఎస్, సీఎంఓ ఉన్నతాధికారులు హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవల్లో ప్రజల సంతృప్త స్థాయి పెంచడంపై ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రజల నుంచి ఐవీఆర్ఎస్‌తో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా వెల్లడిస్తున్న అభిప్రాయాల్లో సానుకూలత ఏ స్థాయిలో ఉంది, అసంతృప్తి ఎక్కడెక్కడ ఉందన్న సమాచారాన్ని క్రోడీకరించాలని సూచించారు. తద్వారా సమస్య మూలాలను కనుగొని వాటిని వేగంగా పరిష్కరించటం ద్వారా ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరుచుకోవచ్చని సీఎం పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ డేటా లేక్‌లో అపారమైన సమాచారం నిక్షిప్తమై ఉందని తద్వారా డేటా ఆధారిత నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రం యూనిట్‌గా ప్రభుత్వం 19 విభాగాల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రతీ రోజూ దృష్టి సారించాలని అలాగే ప్రతీ 15 రోజులకూ ఒకసారి సమాచార సేకరణ చేయాలని సూచించారు. వీటిపై ప్రతీ నెలా ఆడిట్ నిర్వహించి ప్రతీ మూడు నెలలకూ ఓ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. దీనికోసం రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, నియోజకవర్గం స్థాయిలో సమాచారం తీసుకుని విశ్లేషించాలని పేర్కొన్నారు. 15 నెలలుగా ప్రజల్లో సంతృప్తి స్థాయి క్రమంగా మెరుగు పడుతోందని ఇది మరింత పెరగాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవల్లో ప్రజలు ఎలా స్పందిస్తున్నారన్నదే ప్రధాన అంశమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలకుల నిర్వాకం కారణంగా రెవెన్యూ రికార్డులు తారుమారై వివాదాలు పెరిగాయని... వాటిని సరిచేస్తున్నట్టు సీఎం తెలిపారు. ప్రజలకు అందిస్తున్న సేవల ప్రమాణాలను మెరుగుపరుచుకుని సంతృప్త స్థాయిని పెంచుకోవాలని సీఎం సూచించారు. ప్రభుత్వ శాఖలు, అధికారులు, ఉద్యోగుల పనితీరు విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగంలో నైపుణ్యాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో కొందరు సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందడం లేదని, అలాంటివారి అర్హతలు పరిశీలించి వారు కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు పొందేలా చూడాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్న 730 సేవల వినియోగం మరింతగా పెంచేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సేవలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా సులభంగా అందుతాయనే భావన ప్రజల్లో విస్తృతమైతే ఎక్కువగా వినియోగించే ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి తగినట్టుగా ప్రజల్లో అవగాహన మరింత పెంచాలని సూచించారు. డ్రోన్ల వినియోగానికి సంబంధించి ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రైవేటు వినియోగం కూడా పెరిగేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య రంగంతో పాటు వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వినియోగం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. డిసెంబరులో డ్రోన్ షో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 16 తేదీన ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు వస్తున్న దృష్ట్యా డ్రోన్ సిటీకి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. సీసీ కెమెరాలను ట్రాఫిక్ సహా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.

## టమోటా ధరలపై మంత్రి అచ్చెన్నాయుడు భరోసా

### - రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ



**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** టమోటా ధరలపై రైతులు ఆందోళన పడాల్సిన అవసం లేదని వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్ననాయుడు అన్నారు.ఆయన కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.రాప్తాడు మార్కెట్ లో టమోటా ధరలు గరిష్టం రూ.18, కనిష్ఠం రూ.9, మోడల్ ధర రూ.12 గా ఉన్నాయి వివరించారు.30 నుండి 40 మెట్రిక్ టన్నులు మించి పత్తికొండ మార్కెట్ సరుకు రాదు, దసరా సెలవులు కావడంతో మరొక 10 టన్నులు అదనంగా చేరుకుంది.. రోడ్లపై 2వ గ్రేడ్ క్వాలిటీ టమాటాలు వేసి గందరగోళం సృష్టించారు.అది సరికాదన్నారు.ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామన్నారు.ఈ రోజు పత్తికొండ మార్కెట్ లో టమోటాలు సేకరించి చిత్తూరు ప్రొసెసింగ్ యూనిట్ కి 10 మెట్రిక్ టన్నులు, రైతు బజార్లకు 15 మెట్రిక్ టన్నులు పంపిస్తాము..తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు సరుకు ఎగుమతి వర్షాల వల్ల తగ్గింది... ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో టమాటా అమ్మకాలు మందగించామన్నారు.రాప్తాడు మార్కెట్ కి 3000 మెట్రిక్ టన్నులు రాగా అందులో కేజీ టమోటా గరిష్టంగా 18 రూ, కనిష్టంగా 9 రూ జరిగింది.. .టమోటాలకు ట్రెండింగ్ ధరను బట్టి ప్రస్తుతం మంచి ధర లభిస్తుంది, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే అన్ని విధాలుగా రైతులను ప్రభుత్వం ఆదుకుంట్నుదని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

## పలువురు ఐపిఎస్‌ల రిటైర్మెంట్ జాబితాను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలువురు ఐపీఎస్ ల రిటైర్మెంట్ జాబితాను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసారు.ఇందుకు సంబంధించిన వివరాలను అనుసరించి 1990 బ్యాచ్ కు చెందిన అంజనీ కుమార్. 31.01.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు. 1991 బ్యాచ్ కు చెందిన మాదిరెడ్డి ప్రతాప్. 30.06.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తారు. 1992 బ్యాచ్ కు చెందిన పి. సీతారామాంజనేయులు. 31.08.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు. 1992 బ్యాచ్ కు చెందిన కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి. 30.04.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తారు. 1993 బ్యాచ్ కు చెందిన పీవీ సునీల్ కుమార్. 30.06.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసారు. 1994 బ్యాచ్ కు చెందిన ఎన్. బాలసుబ్రమణ్యం. 31.10.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు. 2005 బ్యాచ్ కు చెందిన జి.. పాల్ రాజు. 31.01.2026 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేస్తారు. 2015 బ్యాచ్ కు చెందిన కె.ఎస్.ఎస్.వి. సుబ్బారెడ్డి. 31.03.2026 సంవత్సరంలో పదవీ విరమణ చేస్తారు.

## తిరుమల ఆలయ సంప్రదాయాలపై మళ్లీ మాటల యుద్ధం

### - ఆలయ పవిత్రతను ధ్వంసం చేశారన్న భూమన
### - ఆనవాయితీని అపచారమనడం సిగ్గుసిగ్గు.. భానుప్రకాశ్

**తిరుపతి,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతిదేవస్థానం సంప్రదాయాలు, ఆలయ మర్యాదలపై మళ్ళీ మాటలయుద్ధం మొదలైంది. అటు వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేయడంతో ఇలాంటివన్నీ గత ఐదేళ్ళ తప్పిదాలు సమయంలో కనబడలేదా?అంటూ ప్రస్తుత బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి సేవకుడిగా సేవలందిస్తున్నారు. ఆయనకు గత నెలలో తండ్రిని కోల్పోవడంతో జరిగిన పెద్దకర్మ అనంతరం టిటిడి తరపున సంప్రదాయంగా ఆయన నివాసానికి వెళ్ళి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఆలయ అర్చకులు పరివట్టం కట్టడం, వేదాశీర్వచనంచేయడం, ప్రసాదాలు అందజేశారు. ఇదంతా ఆలయ సంప్రదాయంగానే సాగింది. అయితే శ్రీవేంకటేశ్వరస్వామి సేవకుడిగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆలయ మర్యాదలను మంట గలుపుతున్నారని మాజీ టిటిడి ఛైర్మన్,వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి దాన్ని రాద్ధాంతం చేస్తూ సోమవారం తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ బిఆర్‌నాయుడు పట్ల వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని, ఆయన వ్యవహారాలు, ఎప్పుడు ఎలా ఉండాలో తెలియక ఆలయ మర్యాదలను మంటలో గలుపుతున్నారని విమర్శించారు. వెంకయ్యచౌదరిని పరామర్శించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోందని అన్నారు. అయితే ఈ విమర్శలను బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తప్పులు చేయడం, తప్పుడు మాటలు మాట్లాడటం కరుణా కర్‌రెడ్డికి అలవాటైపోయిందని ఎద్దేవాచేశారు. 2023లో అప్పటి టిటిడి ఇఒ ధర్మారెడ్డి కుమారుడు మరణిస్తే పెద్దకర్మ తంతు పూర్తయ్యాక ఆలయ మర్యాదల ప్రకారం ఆ గ్రామానికి వెళ్ళి ఆ అధికారికి పరివట్టం కట్టడం, ప్రసాదాలు అందజేసి వేదపండితులు వేదాశీర్వచనం అందించినపుడు అది నీకు అపచారంగా అనిపించలేదా;?ఛైర్మన్ హోదాలో అప్పుడు కళ్ళుమూసుకున్నావా అని ఘాటుగా స్పందించారు.

## ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడిని ఖండించిన 'సుంకర'



**విజయవాడ ,అక్టోబరు 6,ప్రభాతవార్త** భారత దేశ సర్వోన్నత న్యాయ స్థాన ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడి ప్రయత్నం న్యాయ వ్యవస్థపై,భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించవల్సి వస్తుందని ఆల్ ఇండియా లాయర్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్,న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి గవాయి రాజ్యాంగాన్ని రక్షించడం లోను,రాజ్యాంగం నిర్దేశించిన మౌలిక సూత్రాలలో ఒకటైన భౌతిక ధర్మాన్ని రక్షించడం లోనూ ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, ఈ దాడి ఒక వ్యక్తి న్యాయమూర్తిపై చేసిన వ్యక్తిగత దాడి కాదని, భారత దేశ రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని వ్యతిరేకించే శక్తుల ప్రయత్నంగా చూడాల్సి ఉందన్నారు.

## ఎంజెపి స్కూళ్ల అభివృద్ధికి సహకరించండి: కేంద్రమంత్రి రాందాస్ అథవాలేతో మంత్రి సవిత



**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల(ఎంజేపీ స్కూళ్లు) అభివృద్ధికి సహకరించాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయమంత్రి డాక్టర్ రాందాస్ అథవాలేను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత కోరారు. రాష్ట్రంలో డి.ఎన్.టి. కులాల లబ్ధిదారులు వివిధ స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వాటికి కూడా పరిష్కారం చూపాలని కోరారు. విజయవాడలోని ఓ హోటల్లో కేంద్రమంత్రి డాక్టర్ రాందాస్ అథవాలేను మంత్రి సవిత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఎంజేపీ స్కూళ్ల అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

## కల్తీ మద్యం మాఫియాకు మూల విరాట్ జగనే

### టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** కల్తీ మద్యం మాఫియాకు మూల విరాట్ జగనే అని టీడీపీ ఎమ్మెల్సీ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆరోపించారు. గత 5 ఏళ్ల వైఎస్సార్సీపీ పాలనలో కల్తీ మద్యంతో జగన్ మద్యం మాఫియా ముఠా రూ. 3,500 కోట్లు కొల్లగొట్టారని దుయ్యబట్టారు. గత 5 ఏళ్ల కల్తీ మద్యంతో పేదల ప్రాణాలు తీసి, మహిళల పుస్తెలు తెంచి ఆ పాపపు సొమ్ము తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నేడు కల్తీ మద్యం వ్యవహారంలో బాధ్యులపై సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. నాడు కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన వైఎస్సార్సీపీ నేతలపై జగన్ ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు.

గతంలో విజయవాడలో వైఎస్సార్సీపీ నేత మల్లాది విష్ణు బార్‌లో కల్తీ మద్యం తాగి 6 మంది ప్రాణాలు కోల్పోతే ఏం చేశారని ప్రశ్నించారు.

వైఎస్సార్సీపీ హయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది ప్రాణాలు కోల్పోతే బాధ్యులపై జగన్ ఏం చర్యలు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేంద్రసాయం, రాష్ట్ర సహకారంతో గాడిన పడుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్

### - విశాఖ స్టీల్ పై సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన



విశాఖ స్టీల్ పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, అక్టోబర్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు కర్మాగారం పటిష్టతకు, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఏడాది కాలంలో కేంద్ర సాయం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్లాంట్ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి వచ్చిందని... ఇది ఆహ్వానించదగిన పరిణామంగా సిఎం అన్నారు. ప్లాంట్‌ని నష్టాల నుంచి బయటపడేయడానికి, బలోపేతం చేయడానికి యాజమాన్యం, కార్మికులు, ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. గత ఏడాది కాలంలో తీసుకున్న చర్యలు, సమిష్టి నిర్ణయాలు, సమన్వయం కారణంగా ప్లాంట్ మంచి ఫలితాలు సాధిస్తోందని సిఎం అభిప్రాయ పడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ బలోపేతం చేయడంతో పాటు గరిష్ట ఉత్పత్తి స్థాయికి తీసుకువెళ్లే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో తీసుకున్న చర్యలను, వచ్చిన ఫలితాలను సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సిఎం చంద్రబాబు చొరవ తీసుకుని ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రం నుంచి ఆర్థిక సాయం తెచ్చారు. కూటమి ప్రభుత్వ ప్రయత్నాలతో నాడు కేంద్రం ప్లాంట్ పరిరక్షణ కోసం రూ.11,440 కోట్ల సాయం అందించింది. ఇందులో మెజారిటీ మొత్తం ఇప్పటికే విడుదల కావడంతో ఆ నిధుల్ని వినియోగించి ప్లాంట్‌ను గాడిన పెట్టే పనులు చేపట్టడం జరిగింది. ఏడాది కాలంలో అటు కేంద్ర సాయం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో అందిస్తున్న సహకారంతో ఉత్పత్తి సామర్థ్య గణనీయంగా పెరిగింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్లాంట్ సామర్థంలో 25 శాతం మాత్రమే ఉత్పత్తి జరగ్గా.... ఈ సెప్టెంబర్‌లో అది 79 శాతానికి చేరింది. ఇది మంచి పరిణామం అని దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని సిఎం చంద్రబాబు స్టీల్ ప్లాంట్ అధికారులకు సూచించారు. మూడవ త్రైమాసికం ముగిసేలోగా 92.5 శాతం ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకోవాలని సిఎం సూచించారు. దీని కోసం అంతా ఐక్యంగా పనిచేయాలని అన్నారు.

ENDOWMENTS DEPARTMENT
SRI KRISHNALAYAM
Pulivendula(T&M), Kadapa District
e- Procurement Tender
NIT.No.P/COE/446/2024 Dt:11.3.2024
E- Tenders are invited through the e-Procurement portal for Construction of Dyana Mandiram on the South Side of the Main Temple. Interested bidders May Visit the Official website www.apeprocuremednt.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee

వార్త

మధ్యవర్తి మాట, అడవిలోని బాట ఎంతవరకు తీసుకెళ్తాయో ఎవరికీ తెలియదు.

-రాఛెల్

# ఔషధలీల..మృత్యుహేల

సాధారణ దగ్గు వారం రోజుల్లో దానంతటదే తగ్గిపోతుంది. అదే కోరింత దగ్గయితే చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుందని తాజా అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. కోరింత దగ్గు పీడితులు ఊపిరి పీల్చుకునేటప్పుడు కంగు కంగుమనే శబ్దంతో దగ్గువస్తుంది. కోరింత దగ్గయితే అంటు రోగమేనని చెప్పకతప్పదు. ఈ రెండింటికి తేడా తెలియక దగ్గు సంకేతాలు తెలియగానే పిల్లలకు వెంటనే దగ్గు మందు ఇచ్చేసి అదే తగ్గిపోతుందులే అనుకోవడం కద్దు. కానీ దగ్గు మందు నాణ్యత బెడిసి కొట్టి మధ్యప్రదేశ్‌లో 14 మంది చిన్నారులను పొట్టన పెట్టుకుంది.ఈ సంఘటన గురించి తెలియగానే కేంద్ర ఆరోగ్య శాఖ మెళకువ తెచ్చుకుంది. ఎక్కడైనా దుస్సంఘటనలు జరుగగానే అప్పటికప్పుడు ప్రక్షాళన నిర్ణయాలు తీసుకోవడం మన పాలకులకు అలవాటే. ఇక్కడా ప్రభుత్వం ఆ మేరకు స్పందిస్తోంది. నిబంధనలు పాటించని కంపెనీల లైసెన్సులను రద్దు చేస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 'కోల్డ్రిఫ్' దగ్గు మందులను వాడిన వారిలో తీవ్ర 'అనారోగ్య లక్షణాలు కనపడి అసువులు బాశారు. చాలా రాష్ట్రాలు సత్వరం ఆ మందులను నిషేధించాయి. ప్రాణాపాయానికి కారణమైన మందులను తమిళనాడు కాంచీపురంలో ఓ ఔషధ తయారీ సంస్థ నుంచి బయటికొచ్చింది.అలాంటి నాసిరకం మందులను కనిపెట్టాల్సింది ఆరోగ్యశాఖ కింద పనిచేసే ఔషధ నియంత్రణ విభాగమే. కానీ మార్కెట్‌లోకి విడుదలై పసిపిల్లల ప్రాణాలు తీసే వరకు తెలియలేదంటే ఏమనుకోవాలి. దీనికి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖే బాధ్యత వహించాలి. కాగా 'కోల్డ్రిఫ్' సిరప్‌ను తయారు చేసిన శ్రేసన్ ఫార్మస్యూటికల్స్ మీద చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఉద్యుక్తమయ్యింది. ముందే తీసుకోవాల్సిన చర్యలు తర్వాత తీసుకుంటే ఏముపయోగం? కొన్ని ప్రాణాలు బలైపోయాయి. మధ్యప్రదేశ్‌లోని బేటుల్ జిల్లా, ఆమ్లాఖ్లలో ఇద్దరు చిన్నారులు ఈ సిరప్ వాడాక మరణించారు. దాంతో ఛింద్వారా జిల్లాలోని పరాసియా ప్రజారోగ్య కేంద్రం పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రవీణ్ సోనిపై కేసు నమోదు చేశారు. ఆ డాక్టరు చాలా మందికి అదే సిరప్‌ను సిఫారసు చేశారు. ఈ సిరప్‌ 10నాణ్యత ప్రమాణాల్లో 9 మాత్రమే అనుగుణంగా ఉన్నాయని గుర్తించారు. ఈ మందు కలుషితమైనట్లు గుర్తించి దాని తయారీ కంపెనీపై తమిళనాడు రెగ్యులేటరీ అథారిటీ ఎఫ్‌డిఎ చర్యలు తీసుకొంది. దాని లైసెన్సును రద్దు చేయమని సిడిఎస్‌సిఒకు సిఫారసు చేసింది. ఇవన్నీ ఏదైనా దుస్సంఘటన జరిగినప్పుడు తీసుకునే చర్యలే. వీటిలో ప్రత్యేకత ఏమీలేదు.ఆ బ్యాచ్ సిరప్ నలుగురు ఎలా అనుమతిచ్చి, మార్కెట్లోకి విడుదలై, డాక్టర్ల చేత సిఫారసు చేయబడిందంటే వీటికి ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఎంత ఉందో పసికట్టి వారిపై చర్యలు తీసుకోవడం ఎంతో అవసరం.ఈ మందు వాడిన పిల్లలకు మూత్రపిండాల సమస్యలు వచ్చాయి. మూత్ర పిండాలు వాచిపోయి క్రియాటినైన్ లెవెల్స్ మారిపోయి తీవ్ర సమస్యలు తలెత్తాయి.మూత్రం బంద్ అయ్యింది. ఒక కేసులో లెప్టోస్పైరోసిస్ పాజిటివ్ కనపడింది. ఇంత సీరియస్ సంఘటనలో కూడా ప్రభుత్వ విభాగాల అలసత్వం బయటకు రాకుండా ఏవేవో సమర్థింపులుచేసుకుంటున్నారు. పైగా గ్రామీణ ప్రాంతం నుంచి ఆ చిన్నారులు రావడాన్ని కూడా ఒక అవకాశంగా మార్చుకోవాలని చూశారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టడం వారి నేరం కాదు. కానీ సంఘటనకు ఎవరూ బాధ్యత వహించడం లేదు. వైద్యులు దగ్గుమందులు రాసేటప్పుడు హేతుబద్ధంగా వ్యవహరించాలని కేంద్రప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఇక్కడ 'హేతుబద్ధత'కు అర్థం తెలియక కొంత మంది డాక్టర్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో విడుదలైన దగ్గుమందులో రసాయనాలుంటాయని ప్రిస్క్రిప్షన్ రాసే మందు ఎలా తెలుస్తుందో జవాబు దొరకని ప్రశ్న. ఉదంతం జరిగాక ప్రాణాపాయంలో ఉన్న చిన్నారులకుఎలాంటి వైద్యసహాయం అందలేదు. మరణించిన చిన్నారులకు పోస్టుమార్టెమ్ కూడా వెంటనే జరుగలేదు. ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాన్ని వెల్లడిస్తోంది. 'కోల్డ్రిఫ్' దగ్గు మందు కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలతో కలుషితమైందని అనుమానిస్తున్నారు. కేవలం ఆ బ్యాచ్ సిరప్ ఎస్ఆర్ 13ను మాత్రమే నిషేధించారు. ఈ బ్యాచ్ సిరప్‌లు మరెక్కడా వాడకుండా సీజ్ చేసే ప్రక్రియ మొదలైంది. ఇలా అనంతర జాగ్రత్తలు చిన్నారుల ప్రాణాలు నిలబెట్టలేవు. కనుక సిరప్‌లు తయారయ్యే ఫార్మసీ కంపెనీల వద్దనే సంపూర్ణ స్థాయిలో పరీక్ష,విశ్లేషణ, పర్యవేక్షణ పటిష్టం చేయాల్సిన అవసరముంది. తీరా నాసిరకం ఔషధాలు బయటికొచ్చి రోగి శరీరంలోకి ప్రవేశించాక చేతులుకాలాక ఆకులు పట్టుకున్న చందాన ఉంటుంది. 'కోల్డ్రిఫ్' దగ్గుమందును ల్యాబ్‌లో పరీక్షించి చూస్తే డైఇథిలిన్ గ్లైకాల్ (డిఇజి) ఇథిలీన్ గ్లైకాల్ (ఈజీ)గా పిలిచే ప్రమాద రసాయనం ఆనవాళ్లున్నాయి. ఈ రెండూ మానవ శరీరం లోని మూత్రపిండాలు, కాలేయంతో పాటు నాడీ వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నాయి. చిన్న ఫార్మా కంపెనీలు తమ ఔషధ ఉత్పత్తులను మార్కెటింగ్ సందర్భంలో డాక్టర్లకు తృణమో పణమో ఆశ చూపిస్తారు. ఆ నేపథ్యంలోనే డాక్టర్లు కొన్ని మందులను వాడమని సిఫారసు చేయడం సహజం. డా.ప్రవీణ్ సోనీ ప్రభుత్వ డాక్టరు. కానీ తన ప్రైవేటు ప్రాక్టీసులో చిన్న పిల్లలకు పై నాసిరక మందును సిఫారసు చేశారు. అదే ఆయన తప్పిదమైంది. ప్రతి విషాద ఉదంతం జరిగినప్పుడు ఆ తర్వాత మరో విషాదం జరుగకూడదని ఒక స్ఫూర్తి, చిత్తశుద్ధితో సంకల్పం చెప్పుకుంటే తప్ప మానవ జీవన ప్రమాణాలను పెంచలేము.

"బలవంతంగా పనిచేసే వంద మంది కంటే ఒక స్వచ్ఛంద కార్యకర్త మేలు."



రాధాకృష్ణన్

"మేధావి అంటే మరెవరో కాదు. ప్రతి చిన్న, పెద్ద విషయాన్ని స్పష్టంగా చూడగలవాడే మేధావి."



బైరన్

# యువత సామాజిక బాధ్యతను గుర్తెరగాలి

**చదువు లక్ష్యం కేవలం ఉద్యోగమే కాదని జీవితాన్ని అర్థవంతంగా ఆనందంగా జీవించడమని వారు గుర్తించాలి. ఈ యువత దేశాన్ని ఉద్ధరించుతుందన్న ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. భూమి ఆకాశాలను ఏకం చేసే సత్తా కూడా వారికి ఉంది. పట్టుదల, వైద్యం వారి సొంతం. వారి ఆలోచనలను సరైన దిశలో మళ్లిస్తే వారు అద్భుతాలు సృష్టించగలుగుతారు. హత్యలు, ఆత్మహత్యల లాంటి వాటికి జోలికి పోకుండా తమ ఉన్నత స్థితి, సామాజిక పురోగతి లాంటి వాటికి బాటలు వేయాలి. సామాజిక స్థితిగతులను వారు అధ్యయనం చేయాలి. అన్యాయాన్ని ఎదిరించాలి. అక్రమాలకు అడ్డుకట్టు వేయాలి. కులమత రహిత సమాజానికై తమ వంతు పాత్ర పోషించాలి. చిన్నచిన్న విషయాలకి కృంగిపోతే, కునారిల్లితే వారు ముందుకు సాగలేరు. ముళ్లదారులను పూలదారులుగా మలుచుకుంటూ వారి ప్రయాణం సాగాలి. యువతే నవ సమాజాన్ని నిర్మించాలి.**

శ్రీశ్రీ కుమార్

నేటి విద్యార్థులే భావిభారత పౌర నిర్దేశకులు. రేపటి సమాజానికి మార్గదర్శకులు, విద్యార్థులు ఆదర్శవంతమైన యువతగా రూపుదిద్దుకొని ఒక నీతి నిజాయితీ, నిబద్ధతతో కూడిన వ్యవస్థను రూపొందిస్తారని వారి పైన తల్లిదండ్రులకే కాదు అందరికీ ఉండే ఒక ఆకాషా అభిప్రాయం, ఆకాంక్ష. ఉన్నతమైన ఆశయాలతో మెరుగైన సమాజాన్ని నిర్మిస్తారని వీరిపై అందరికీ ఉండే ఒక సహజమైన విశ్వాసం కానీ కొద్ది సంవత్సరాలుగా పరిశీలిస్తే విద్యార్థులు రకరకాల దురలవాట్లకులోనై చెడు మార్గం పట్టడం గమనించవచ్చు. కారణాలు ఏమైనా కావచ్చు. కానీ రేపటి రోజుకు వీరు ఆశాకిరణం లాగాకాక సంఘ వ్యతిరేక శక్తులుగా కూడా తయారవుతున్నట్లు మనకు అవగతమవుతున్నది. ముఖ్యంగా విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం చాలా తరచుగా వింటున్నాం. కొద్దిమంది మరో అడుగు ముందుకేసి వాటి స్మగ్లింగ్‌లో కూడా పట్టుబడుతున్నారు. ఇలాంటి సంఘటనల వల్ల కాబోయే యువతపై మనం పెంచుకున్న విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఇలాంటి దురలవాట్లకు లోనై వారు చివరకు సంఘవిద్రోహశక్తులుగా మారే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రవర్తనను ముందే పసిగట్టి కౌన్సిలింగ్ ద్వారానో కఠిన చర్యల ద్వారానో అరికట్టాల్సిన ఆవశ్యకత బాధ్యత తల్లిదండ్రులపైన, అధ్యాపకులపైన ఎంతో ఉంది. ఎన్ని చట్టాలున్నా, ఎన్ని చర్యలున్నా తగ్గకుండా నడుస్తున్న మరో దురలవాటు ర్యాగింగ్. కేవలం సీనియర్లు జూనియర్ల మధ్యన ఒక పరిచయం స్నేహభావం వెల్లివిరియాలనే సదుద్దేశంతో మొదలైన ఈ ప్రక్రియ విద్యార్థిలోకాన్ని ఒకజాడ్యం లాగా ఆవహించింది. వారి జీవితాలను కబళిస్తున్నది. సీనియర్లు జూనియర్ విద్యార్థులను వికృత క్రీడలతో విచిత్రమైన చేష్టలతో దానిని వింత పుంతలు తొక్కించారు. పర్యవసానంగా ఈ బాధను తట్టుకోలేకపోయిన సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు మనకు తెలుసు. పోలీసు కేసులు రిజిస్టర్ అవుతున్నా, టిసిలు ఇచ్చిన సంఘటనలున్నా ఈ ర్యాగింగ్ రోగం తగ్గిన దాఖలాలు లేవు. రకరకాల రూపాలలో విశృంఖలంగా సాగుతూనే ఉన్నది. దీనిని సంపూర్తిగా సమూలంగా అరికట్టకపోతే ఈ దుష్ట సంస్కృతిని నిర్మూలించకపోతే మరిన్ని విలువైన ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. నాగర్ కర్నూల్ సూర్యాపేట, మెడికల్ కళాశాలలో సంఘటనలు సమాజాన్ని కదిలించి వేశాయి. చిత్తూరు జిల్లాలోనూ సీనియర్లు ఒక జూనియర్ విద్యార్థిని తమ రూములో చిత్రహింసలకు గురిచేసి తాము చేసిన ఘనకార్యాన్ని వీడియో కూడా తీయడం దారుణం. కళాశాల యాజమాన్యం కూడా ఇలాంటి సంఘటనల్లో మౌనం పాటించడం శోచనీయం.విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దవలసిన అధ్యాపకులు, యాజమాన్యం తగిన సమయంలో స్పందించకపోతే దాని పరిణామాలు అనూహ్యంగానే ఉంటాయి. గత తొమ్మిది ఏళ్ల వ్యవధిలో 2024-25 సంవత్సరంలో అత్యధికంగా ర్యాగింగ్ కేసులు నమోదు కావడం బాధాకరం. 2022-24 మధ్య 51 ఆత్మహత్యలు కేవలం ర్యాగింగ్ వల్లనే జరిగినట్లు నివేదికలు తెలుపుతున్నాయి.వృత్తి విద్యాకళాశాలలు ర్యాగింగ్‌కు కేంద్రాలుగా నిలవడం బాధాకరం. విద్యార్థులు యువత తాము అనుకున్నవి జరగకపోతే తట్టుకోలేకపోతున్నారు. మానసికంగా కృంగిపోతున్నారు. అది వారికి ఇష్టమైన కోర్సు కావచ్చు, ఉద్యోగం కావచ్చు. తనకు నచ్చిన మొబైల్ కొనివ్వలేదని ఆత్మహత్యలకు పాల్పడిన వారు, మొబైల్ వాడనివ్వలేదని కూడా మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు మనం చదువుతున్నాం. విద్యార్థులు ఈ రకంగా



సున్నిత మనస్కులుగా తయారు కావడం వారి భవిష్యత్తుకు మంచిది కాదు. తల్లిదండ్రులు కూడా వారిని ఆ విధంగా పెంచకూడదు.తాము అనుకున్న మార్కులు రాలేదనిర్యాంకు రాలేదని కూడా తీవ్రచర్యలకు పాల్పడుతున్నారు. మార్కులు, ర్యాంకు, కోర్సు ఇవి మాత్రమే జీవితం కాదనేది వారు గుర్తించాలి. పాఠశాలల్లో కళాశాలల్లో కూడా వారికి తరచుగా కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించుతూ వారిని దృఢ మనస్కులుగా తయారు చేయాలి.పరీక్షలు మార్కులు ర్యాంకులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ జీవితం ఒకటేనని వారు గుర్తించేలా చేయాలి ఒంటరిగా తిరిగేవాళ్లను అన్యమనస్కంగా ఉండే వారి మీద ఒక కన్నేసి ఉండాలి. అనుమానాస్పద ప్రవర్తనను పరిశీలిస్తూ ఉండాలి. ఉద్యోగార్థులు తమ ప్రయత్నంలో విఫలమైతే విరక్తిచెందుతారు. మరోమారుప్రయత్నం చేసి సాధించవచ్చుననే మనోధైర్యం వారిలో కల్పించాలి. వైఫల్యాలే భవిష్యత్తులో విజయాలకు సోపానాలని వారికి బోధించాలి. వారికి జీవితంపై ఆశ కలిగేలా చేయాలి. ఉద్యోగమే కాదు ఉపాధి అవకాశాలు గూర్చి వారికి అవగాహన కల్పించి, అవకాశాల గూర్చి కూడా వారికి తెలియజేసి వారిని ఆ దిశగా ఆలోచింపజేయాలి. జీవిత సత్యాలను, జీవన నైపుణ్యాలను వారికి నేర్పడం ద్వారా సమాజానికి ఉపయోగపడేలా వారిని తీర్చిదిద్దవచ్చు. మరి కొందరు ప్రేమ విఫలమైందనే మనోవ్యథలో కూడాకృంగిపోతున్నారు. తల్లిదండ్రులకు సమాజానికి భారంగా మిగిలిపోతున్నారు. అలాంటి వారి మనసు మళ్లించి మంచి వ్యాపకంలో వారిని తీరిక లేకుండా ఉండాలి. వారి అభిరుచిని బట్టి పని అప్పగిస్తే వారు ఇష్టపూర్తిగా చేసి విజయాన్ని ఆస్వాదిస్తారు. ఒత్తిడిని జయించే శక్తి సామర్థ్యాలు కలిగేలా చేయడం ద్వారా విద్యార్థులను యువతను సన్మార్గంలో పెట్టి వారితోనే సమాజంలో మార్పు తీసుకురావచ్చు. సామాజిక సేవ, రాజకీయాల వంటివి కూడా వారిని సరైన దిశలో నడిపిస్తాయి. వారి శక్తి వారు తెలుసుకునేలా చేయడంలోనే విజయ రహస్యం దాగి ఉంది. దేశ గ్రంథపఠనం ఎందరో మహనీయుల జీవిత చరిత్రలు చదివించడం ద్వారా వారిలో జీవితం పట్ల ఆసక్తిని కలిగించవచ్చు. సమాజంపట్ల బాధ్యతను పెంచవచ్చు. విద్యార్థులలో యువతలో ఎందుకింత నైరాశ్యం ఆవహించింది? అసలు వారి చదువుల్లోనే ఏదో ఒక లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. భాషల పట్ల నిర్లక్ష్యం పెరిగింది. భాషా వాచకాలలో ఎన్నో నీతి కథలు, ఆదర్శ పురుషుల జీవిత గాథలు, జీవన నైపుణ్యాలు నేర్పే విషయాలు ఇంకా జీవన విధానం తెలిపే అనేక విషయాలు ఉంటాయి. మారిన కాలమాన పరిస్థితులలో తరగతి బోధనలో భాషలు మూలన పడ్డాయి. ప్రాముఖ్యత కోల్పోయాయి. కంప్యూటర్ యుగం కావడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే టెక్నికల్ కోర్సులకు డిమాండ్ సహజంగానే పెరిగింది. గ్రంథాలయాల్లో పుస్తకాలకు చెదలు పట్టాయి. పుస్తక పఠనం విద్యార్థుల్లో యువతలో పూర్తిగా పడిపోయింది. అందువల్ల వారు మానసిక దుర్బలులవుతున్నారు. చదువు, మొబైల్, టీవీ, కంప్యూటర్ ఇంతకుమించి వారికి వేరే ప్రపంచం లేకుండా పోయింది.అందులోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. ఆప్తులైన స్నేహితుడు కూడా కరువయ్యారు. ఆటలు ఏనాడో మరిచిపోయారు. శారీరక వ్యాయామం, శ్రమ పూరిగా మరుగున పడింది.ఆటంటే నేడు క్రికెట్ మాత్రమే. ఆటల ద్వారా స్నేహభావం గెలుపోటములు వాటి విలువ తెలుస్తుంది. క్రీడా స్ఫూర్తిని జీవితంలో కూడా ఉపయోగించగలుగుతారు. పాఠశాలల్లో కళాశాలల్లో గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నికలు లేకుండా చేశారు. దాంతో వారికి సామాజిక స్పృహ, ప్రతినిధులు, చట్టసభలు, చర్చలు ఇంకా వాదనల లాంటి వాటికి దూరమయ్యారు. రాజకీయ జ్ఞానం కూడా బొత్తిగా కొరవడుతున్నది. సామాజిక శాస్త్రాల పట్ల పాలకుల నిర్లక్ష్య ధోరణి దీనిని మరింత పెంచింది.సామాజిక బాధ్యత కూడా యువత నేడు గ్రహించడం లేదు. చదువు లక్ష్యం కేవలం ఉద్యోగమే కాదని జీవితాన్ని అర్థవంతంగా ఆనందంగా జీవించడమని వారు గుర్తించాలి. ఈ యువత దేశాన్ని ఉద్ధరించుతుందన్న ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. భూమి ఆకాశాలను ఏకం చేసే సత్తా కూడా వారికి ఉంది. పట్టుదల, వైద్యం వారి సొంతం. వారి ఆలోచనలను సరైన దిశలో మళ్లిస్తే వారు అద్భుతాలు సృష్టించగలుగుతారు. హత్యలు, ఆత్మహత్యల లాంటి వాటికి జోలికి పోకుండా తమ ఉన్నత స్థితి, సామాజిక పురోగతి లాంటి వాటికి బాటలు వేయాలి. సామాజిక స్థితిగతులను వారు అధ్యయనం చేయాలి. అన్యాయాన్ని ఎదిరించాలి. అక్రమాలకు అడ్డుకట్టు వేయాలి. కులమత రహిత సమాజానికై తమ వంతు పాత్ర పోషించాలి. చిన్న చిన్న విషయాలకి కృంగిపోతే, కునారిల్లితే వారు ముందుకు సాగలేరు. ముళ్ళదారులను పూలదారులుగా మలుచుకుంటూ వారి ప్రయాణం సాగాలి. యువతే నవ సమాజాన్ని నిర్మించాలి. ●

# ఇది జీవన సౌలభ్యమా! వ్యాపార సౌకర్యమా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ట్రంప్ సుంకాల భారం నుంచి మన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రధాని జీఎస్టీ రేట్లు తగ్గించారా ? లేక అధిక జీఎస్టీ రేట్ల వలన ఎకానమీ ఆర్థిక మాంద్యం వైపుపోతున్నదనా? దేశంలో అధిక జీఎస్టీ రేట్ల వల్ల పడిపోయిన సార్థక డిమాండ్‌ను సరుకుల మార్కెట్లను పెంచి ఉత్పత్తులు ఉద్యోగిత ఆదాయాలు దేశంలో పెంచి ప్రజల జీవన సౌలభ్యం పెంచేందుకా? మన దేశంలో ఉన్నది జీవన సౌలభ్యమా? వ్యాపార సౌలభ్యమా? జీవన సౌలభ్యం అయితే సమాజంలో జీవనస్థితిగతుల నాణ్యతను సూచించేది. అంటే ఆర్థికఅవకాశాలు విద్యా వైద్య వసతులు, మౌలిక సదుపాయాలు పర్యావరణ స్వచ్ఛతమొదలైన అంశాల ప్రాతిపదికన జీవన సౌలభ్యస్థాయిని నిర్ధారిస్తారు. వ్యాపార సౌలభ్యం అంటే దేశంలో ఒక ప్రాంతంలో వ్యాపారాన్ని ప్రారంభించడం, నిర్వహించడం వాటిలో ఉన్న నియమ నిబంధనలో వ్యాపార అభివృద్ధికి దోహదపడుతున్నాయా లేదాఅనేది వ్యాపార సౌలభ్యాన్ని నిర్ణయిస్తాయి. ఉదాహరణకు జీఎస్టీ రేట్ల తగ్గింపును తీసుకుందాము. ఆ రేటు తగ్గింపుతో వినియోగదారులకు ఇప్పుడు 200000కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుందని అధికారిక అంచనా. మరి ఇంతకాలం వసూలు చేసినది? జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉన్నందువలన మన జిడిపిలో కుటుంబ రుణాలపెరుగుదల 40శాతంవరకు ఉన్నదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరొకవైపు కుటుంబాల పొదుపు జిడిపిలో 18.1 శాతానికి పడిపోయింది. ప్రజలు ఇంతవరకు చేసిన రుణాలను తీర్చుకోగలరా?ఈ నేపథ్యంలో దేశం, ప్రజల జీవన సౌలభ్యంమాటేమిటి? మొన్నటి వరకు ఐదు స్లాబ్‌ల జీఎస్టీ పన్ను విధానంతో జీవన సౌలభ్యాన్ని కోల్పోయామా? వ్యాపార సౌలభ్యం జరిగిందా? ఈ ఐదు స్లాబుల జీఎస్టీ రేటు దేశంలో డిమాండ్‌ను తగ్గిపోయేట్టుగా చేసిందా ముఖ్యంగా చిన్నతరహా కుటీర పరిశ్రమలు2020-24 మధ్యకాలంలో49342 సంస్థలు మూతపడి 3.18 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. 2014లో మేక్ ఇన్ ఇండియా ప్రారంభించినప్పటి నుంచి ఉత్పాదక రంగంవాటా మన జిడిపిలో 16.7శాతం నుంచి 13శాతానికి పడిపోయింది. నిరుద్యోగం ఎక్కువైంది. అయితే దేశంలో ప్రతి ఏటా 80 లక్షల మంది లేబర్ మార్కెట్కు చేరుకుంటున్నారు. వారిలో రెండు శాతం కూడా ఉపాధి పొందలేకపోతున్నారు. ప్రస్తుతం జీఎస్టీ రెండు స్లాబులుగా తగ్గించడం వలన మూతపడిన పరిశ్రమలు తెరుచుకుంటాయా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి? 2014లో మన ప్రధాని మేక్ ఇన్ ఇండియా పథకాన్ని ప్రారంభిస్తూ భారతదేశం కేవలం ఒక మార్కెట్ గా కాకుండా ఒక ఉత్పత్తి కేంద్రంగా కూడా ఉండాలని ప్రపంచమార్కెట్లును కైవసం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఆనాటి స్వదేశీ ఉద్యమం తరహాలో ఈనాడు స్వయం పోషకత్వం కోసం మేకిన్ ఇండియా ఆత్మనిర్భర భారత్ ఇలాంటి పథకాలను మన ప్రధాని జాతీయ వాదమని దేశభక్తి అని ప్రజల ఐక్యతను ఆశిస్తూ చేస్తున్న పాలనలో ఈ జీఎస్టీ పన్నుల విధానంతో దెబ్బతిన్నాయని భావించడం జరిగి ఇప్పుడు జిఎస్టిరేట్లను తగ్గించుచున్నారా? లేక ట్రంపు సుంకాల భారం నుంచి మన ఆర్థికవ్యవస్థను కాపాడేందుకు. అంతర్జాతీయ శ్రామిక సంస్థ ప్రకారం దేశంలో 2024లో బలహీనమైన ఉపాధి అవకాశాలున్నాయని ధరలు ఎక్కువగాను ఆదాయాలు తక్కువగాను వినియోగ వస్తువుల డిమాండ్ పడిపోయిందని ఫలితంగా పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయని తెలియజేసింది. 2014లో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రపంచీకరణ వలన అద్భుతమైన ఫలితాలు మన ఆర్థికవ్యవస్థలో లభిస్తాయని ఎక్కువ గానే ఆశ పెట్టుకున్నారు.మనదేశంలో తయారీ రంగంలో ఏటా14 శాతం వృద్ధి రేటును అందిస్తామని 2022 నాటికి దేశంలో తయారీరంగంలో10కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు కల్పించారు.కానీ తయారీ రంగంలో వృద్ధి రేటుఆరు శాతం వరకు కూడా పెరగలేదు.అటు అమెరికా ప్రెసిడెంట్ సుంకాల వలన ఇటు దేశంలో మనప్రధాని పన్నుల విధానం వలన దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారు. ●

# ప్రజావాక్కు



## డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్‌నేరాలలో 'డిజిటల్ అరెస్టు' ఒక కొత్త వల. నేరగాళ్లు తాము ప్రభుత్వ అధికారులు, సీబీఐ లేదా సైబర్ పోలీసులు అని నటిస్తూ బాధితులకు కాల్ చేస్తారు. తప్పుడు కేసుల్లో నిందితులమని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయని భయపెడతారు. వెంటనే జరిమానా చెల్లించాలని, లేకపోతే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తారు. కొన్నిసార్లు పర్సనల్ డాక్యుమెంట్లు పంపమని, బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వమని ఒత్తిడి తెస్తారు. ఇలా నిర్దోషుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు దోచుకుంటున్నారు. నిపుణులు హెచ్చరిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. గుర్తింపుకార్డు చూపించినానేరుగా నమ్మకూడదు.ఎప్పుడూ బ్యాంక్ సమాచారం, పాస్‌వర్డ్‌లు పంచకూడదు. అనుమానం కలిగితే సంబంధిత అధికారిక వెబ్‌సైట్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్ ద్వారా నిజానిజాలు తెలుసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## దేశాన్ని తూలనాడటం మానుకోవాలి

పార్లమెంట్‌లో అపోజిషన్ నాయకుడైన రాహుల్ గాంధీని కాబోయే ప్రధానమంత్రి వరుసలోని వారని అంటారు. ఈయనకు దేశ రాజకీయాలపై మంచి పట్టు ఉన్నదని తెలుసున్న విషయమే.కాని ఎక్కడ ఏలా మాట్లాడాలో ఇంకాచాలాతెలుసుకోవాలి. పరంపరగా వచ్చిన కాంగ్రెసు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న రాహుల్ ఇంకా రాజకీయాలలో పరిపక్వతచెందాల్సింది చాలా ఉంది. ముఖ్యంగా ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు మాతృదేశంపై కువిమర్శలు చేయ కూడదు కదా! గతంలో ఎంతోమంది ప్రభుత్వ వ్యతిరేక రాజకీయులు ఇతర దేశాలకు వెళ్ళినా దేశాన్ని, అప్పటి ప్రభుత్వాన్ని తులనాడలేదే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉపాధి హామీ మంచి ఉపకరణం

తెలంగాణ అంటే ఒకనాడు పల్లేర్లు మొలిసిన భూములు కనిపించేవి. ఇప్పుడు పచ్చని పసరికలు కనబడుతున్నాయి. దానికి ప్రధాన కారణం ప్రాజెక్టులతో పాటు విరివిగా కురుస్తున్న వర్షపాతం అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారమే తెలంగాణలో బీడు భూమి5శాతం అయితే ఉపాధి హామీని ఉపయోగించి ఆ బీడు భూమిని సాగులోకి తెవొచ్చు.

- భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతిమించిపోతూ వున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యం మత్తులోవాహనాలు నడపొద్దని అధికారులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంతమాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటి పడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. ప్రధానంగా రహదారులను సైతంఅడ్డాగా మార్చుకొని మరీ తాగుతున్నారు. మద్యం దుకాణాలవద్ద పర్మిట్‌రూం అందుబాటులో ఉన్నా.. చాలావరకు వినియోగించుకోవడం లేదు. అధికారుల తనిఖీలు అంతగా లేకపోవ డంతో ఈ తతంగంగా సాగిపోతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించాలి

జంట నగరాలైన హైదరాబాద్,సికింద్రాబాద్‌లో బస్సు చార్జీలు రెండు మూడు స్టాపులకు ఐదునుండి పది రూపాయల చొప్పున పెంచింది. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం అవుతుంది. నెలకు అదనంగా ఐదువందల రూపాయలపై చిలుకుపడే అవకాశంఉంది. ఇప్పుడు ఉన్న చార్జీలలో యాభైశాతం పెంచారు.కావునా వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం పెంచిన చార్జీలు తగ్గించాలి. ఇంట్లోమహిళలకు ఉచితబస్సు ఇచ్చిపురుషులకు చార్జీలు పెంచడం సరికాదు. కుటుంబంపైనే భారం పడే అవకాశం ఉంది. గతంలో కూడా బస్సు చార్జీలు పెంచారు. ఇప్పుడు కూడా పెంచడంతో సామాన్యులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## విభజించు పాలించు

ఆంగ్లేయులు నేర్పిన సమయపాలనకు, అత్యంత విలువనిచ్చిన గాంధీజీని తుపాకితో కాల్చిచంపిన కిరాతకుడైన గాడ్సేను హీరోగా అభివర్ణిస్తూ, అతనిని పొగుడుతూ అతను ఆరోజు గాంధీను ఎందుకు కాల్చాడో అతని మనోగతం తెలిపే అతను వ్రాసిన లేఖను ఇప్పుడు సుప్రీంకోర్టు అనుమతితో బహిర్గతం చేస్తూ, కొత్త విషయం అంటూ చెత్త విషయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో దుర్మార్గమైన భావజాలం గలఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తయిందని ఆ సంస్థ పేరుమీద ఒక వంద రూపాయల నాణెం విడుదల చేయడంలో ఔచిత్యం ఏమిటో.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెల్ల బంగారం.. రైతు శ్రమకు గ్లోబల్ గౌరవం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పత్తి పంట కేవలం వస్త్ర పరిశ్రమకే కాదు, కోట్లాది మంది రైతుల జీవనాధారంగా నిలుస్తుంది. తెల్ల బంగారం అని పిలువబడే ఈ పంటకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించడం లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి వాణిజ్యాభివృద్ధి సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 2019లో మొదటిసారిగా ప్రపంచ పత్తిదినోత్సవాన్ని ప్రారంభించాయి. 2019 అక్టోబర్ 7న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ (నీతివీ) ఆధ్వర్యంలో జరిపారు. పత్తి ఉత్పత్తి దారులు, వ్యాపారులు, దుస్తుల తయారీ పరిశ్రమ, రైతులు,ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఈ పంట ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకునే రోజు ఇది. పత్తి కేవలం ఒక పంట మాత్రమే కాదు, అది లక్షలాది మంది రైతుల జీవనాధారం, దుస్తుల పరిశ్రమకు మూలాధారం, ప్రపంచ వ్యాపార చరిత్రలో ఒక ప్రధాన విభాగం. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం పత్తిపంట ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించటం, దాని ఉత్పత్తి, వ్యాపారం, పర్యావరణ అనుకూలత,ఆర్థిక ప్రాధాన్యతలపై అవగాహన కల్పించడం. పత్తి రైతులు ఎదుర్కొనే సమస్యలు, ధరల మార్పులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలపై చర్చించటానికి, స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించటానికి ఈ దినోత్సవం ఒక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎనభైకి పైగా దేశాలు పత్తిని సాగు చేస్తున్నాయి. చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు ప్రధాన ఉత్పత్తిదారులు. వీటిలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి సాగు దేశంగా నిలుస్తుంది. దేశంలోని మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎండ ప్రాంతాలు, వర్షాధారిత భూభాగాలుపత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి. భారతదేశం ప్రపంచ పత్తి ఉత్పత్తిలో కీలక స్థానం కలిగి ఉంది. చైనా తరువాత భారత్ ప్రపంచంలో రెండవ అతి పెద్ద పత్తి ఉత్పత్తిదారు. దేశవ్యాప్తంగా సుమారు 130 లక్షల హెక్టార్ల భూమిలో పత్తిసాగు జరుగుతోంది. సంవత్సరానికి సగటున 360-400 లక్షల గింజల బేళ్ల పత్తిఉత్పత్తి



అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్,తమిళనాడు రాష్ట్రాలు ప్రధాన పత్తి ఉత్పత్తి ప్రాంతాలు. భారతదేశం ప్రపంచ పత్తి ఎగుమతుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. 'మేడ్ ఇన్ ఇండియా కాటన్' అనే పేరుతో భారత పత్తి ప్రపంచ మార్కెట్లో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పత్తిపంట కేవలం వస్త్ర తయారీకి మాత్రమే కాకుండా అనేక అనుబంధ రంగాలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. పత్తి విత్తనాల ద్వారా నూనె, పిండి, పశువుల మేత తయారీ జరుగుతుంది. అలాగే టెక్స్టైల్ మిల్లులు, హ్యాండ్లూమ్ పరిశ్రమలు, తాడు తయారీ, మెడికల్ కాటన్ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు పత్తి ప్రధాన ముడి సరుకుగాఉంది. ఈ విధంగా పత్తి పంట దేశ ఆర్థికవ్యవస్థలో కీలక స్తంభంగా నిలుస్తుంది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి రైతుల సంక్షేమం, వారికి సరైన ధర భరోసా, కొత్త రకాల విత్తనాల అభివృద్ధి, నీటివనరుల సమర్థ వినియోగం, పర్యావరణ అనుకూల సాగు విధానాల ప్రోత్సాహం వంటిఅంశాలపై ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు చర్చలు నిర్వహిస్తాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ప్రారంభమైన 'కాటన్4' ప్రాజెక్టు (బుర్కినా ఫాసో, చాద్, మాలి, నైజర్) పత్తి ఉత్పత్తి దేశాల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి కోసం రూపొందించ బడింది. పత్తి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడే పంట. ఇది సహజమైన, బయో డిగ్రేడబుల్ ఫైబర్ కావడంతో ప్లాస్టిక్,పాలిస్టర్ వంటి కాలుష్య కారక పదార్థాలకు ప్రత్యామ్నాయం అందిస్తుంది. పత్తి ద్వారా తయారయ్యే వస్త్రాల పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన వినియోగ పదార్థాలుగా నిలుస్తాయి. 'కాటన్ ఈజ్ లైఫ్' అనే నినాదం పత్తి మనిషి జీవితంలో ఉన్న అంతర్భాగాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశంలో ఈ రోజు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు పత్తి రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు, విత్తనాల ప్రదర్శనలు, ఎగుమతుల ప్రోత్సాహం, టెక్స్టైల్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల పరిచయం వంటి అనేక కార్యక్రమాలు ఈ రోజున నిర్వహించ బడతాయి. పత్తి పంట కేవలం వ్యవసాయం కాదు, అది గ్రామీణ భారత ఆర్థిక జీవితానికి నాడిగాఉంది. రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ "రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణఈ అన్ని కలిపి పత్తిని నాగరికతకు ప్రతీకగా నిలుస్తాయి. అందువల్ల అక్టోబర్ 7 ప్రపంచ పత్తి దినోత్సవం కేవలం ఒక పంటకు గౌరవ దినం కాదు, అది రైతుల శ్రమకు, ప్రకృతి ప్రసాదానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అంకితమైన విశ్వమానవ ఉత్సవం. తెల్ల బంగారం అయిన పత్తి సమృద్ధి మానవ సమాజ అభివృద్ధికి మూలాధారం. ●

## ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం..

## పదవి చేపట్టిన నెలకే ప్రధాని

# సెబాస్టియన్ రాజీనామా!



**ప్యారిస్, అక్టోబరు 6:** ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్నూ తాజాగా రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి ఆయన దిగిపోయారు. గత నెల జాతీయ అసెంబ్లీ జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాకోయిస్ బేరౌ ఓడిపోవడంతో.. సెబాస్టియన్‌ను తదుపరి ప్రధానిగా అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ నియమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సెబాస్టియన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. తర్వాత రాజకీయ పార్టీలతో వారాల తరబడి సంప్రదింపులు జరిపిన అనంతరం ఆదివారం తన మంత్రివర్గాన్ని కూడా నియమించారు. సోమవారం మంత్రివర్గం తొలి సమావేశం కూడా నిర్వహించనుంది. మంత్రివర్గాన్ని నియమించిన గంటల వ్యవధిలోనే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆయన రాజీనామాను అధ్యక్షుడు మాక్రన్ ఆమోదించినట్లు తెలుస్తోంది. కాగా, గత రెండేళ్లలో ఫ్రాన్స్‌లో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఆయన వద్ద రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించడమే. గత రెండేళ్ల నుంచి ఇదే సమస్య వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే, ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి ప్రధాని వ్యక్తిని అధ్యక్షుడు నియమిస్తారు.

# ఆఫ్రికా నుంచి డ్రగ్స్ అక్రమ రవాణా

## ప్రమాదకరంగా కొనసాగిస్తున్న స్మగ్లర్లు

## సినిమా ఫక్కీలో డ్రగ్స్ మాఫియా దందాలు



**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఆఫ్రికా దేశాలకు చెందిన డ్రగ్స్ మాఫియా డాన్‌లు తమ దేశాల నుంచి మాదకద్రవ్యాలను స్మగ్లర్ల ద్వారా ప్ర మాదకర పరిస్థితుల్లో భారత్‌కు రవాణా చేస్తున్న తీరు పోలీసులు, డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆఫ్రికా దేశాలైన దక్షిణాఫ్రికా, టాంజానియా, కెన్యా సహా ఇంకొన్ని దేశాలకు చెందిన బీద వారిని ఒక పద్ధతి ప్రకారం ఎంచుకుని వారి కడుపు, మల ద్వారాల వద్ద ప్రమాదకరమైన కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌ను వుంచి భారత్‌కు పంపుతున్న అక్కడి డ్రగ్స్ డాన్‌లు ఇక్కడి సర్కారీ విభాగాలకు కొ త్త సవాళ్లు విసురుతున్నారు. వాస్తవానికి ఈ పద్ధతులు కొత్తవి కాకున్నా ఏదైనా తేడా వస్తే డ్రగ్స్ తరలిస్తున్న స్మగ్లర్ల ప్రాణాలు పోవడం ఖాయంగా చెప్పాలి. ఒకవేళ పోలీసులకు దొరికిపోతే జీవితాంతం భారత్‌లోని జైళ్లలో మగ్గాల్సి వుంటుంది. ఇలా గడచిన పదేళ్ల కాలంలో 200 మంది వరకు ఆఫ్రికా దేశాలకు చెందిన స్మగ్లర్లు భారత్‌లోని పలు జైళ్లలో మగ్గుతుండగా వీరిలో వంద మంది శిక్షలు అమలైన వారున్నారు. కాగా పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్లలో మంది మహిళలు వుండడం గమనార్హం. మరోవైపు ప్రమాదకరంగా డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేస్తున్న స్మగ్లర్ల శరీరాల్లో వుంచిన డ్రగ్స్‌ను వెలికి తీసే ందుకు పోలీసులు వారిని నాలుగైదు రోజుల పాటు ఆసుపత్రుల్లో వుంచాల్సి వస్తోంది. డ్రగ్స్ మాఫియా ఆగడాలు, అడ్డగోలు వ్యవహారాలు సినిమా తరహాలో చిత్ర విచిత్రంగా వుంటున్నాయి. తమ ఏజెంట్ల కడుపులో లేదా శరీరంలోని మరేదైనా భాగంలో మాదకద్రవ్యాలను దాచి వుంచుతారు. ఆ తరువాత తమ ఏజెంట్లను తాము పంపా ల్సి న చోటుకు నిర్ణీత వ్యవధిలో పంపు తారు. అయితే కొన్నిసార్లు నిర్ణీత సమయంలో స్మగ్లర్లు చేరకపోతే వారి ఆరోగ్యం పాడై ఉన్నచోటే మరణిస్తుంటారు. ఈ తరహా టెక్నిక్‌లను ఇప్పుడు ఆఫ్రికా కు చెందిన మాదకద్రవ్యాల డాన్‌లు అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా తమ తమ దేశాలలో బీద వారిని ముఖ్యంగా మహిళలు, మ ధ్య వయస్సు వారిని ఎంచుకుని వారికి దండిగా డబ్బులు ఇస్తారు. ఆ కుటుంబాలలో ఒకరు లేదా ఇద్దరిని ఎంచుకుని వారి కడుపులో మాదకద్రవా ్యలను నోటి ద్వారా మింగించడం లేదా ఆపరేషన్లు చేసి కడుపులో దాచి వుంచుతారు. దీని తరువాత ఆ వ్యక్తులను ఆఫ్రికా దేశాల నుంచి దుబాయ్ మీదుగా భారత్‌లోని పలు నగరాలకు పంపుతుంటారు. ఇక్కడ వీరు రాగానే డ్రగ్స్ మాఫియా డాన్‌ల అనుచరులు రహస్య ప్రాంతానికి తీసుకు వెళ తారు. అనంతరం తమకు బాగా పరిచయం వున్న వైద్యుల ద్వారా ఆపరేషన్లు చేయించి వారి కడుపులో వున్న డ్రగ్స్‌ను వెలికితీస్తారు. దీని తరువాత సదరు వ్యక్తులను వారం పది రోజుల పాటు ఆసుపత్రుల్లోనే వుంచి వైద్యం అందించి కోలుకున్న తరువాత తిరిగి వారి దేశాలకు పంపిస్తారు. ఇలా ఒకసారి భారత్‌కు ప్రమాదకరంగా డ్రగ్స్ తీసుకు వచ్చినందుకు ఆఫ్రికా దేశస్తులకు మూడు లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు అందుతుంది. ఇదే సమయంలో ఏదైనా తేడావచ్చి ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు పది లక్షల రూపాయల వరకు అందజేస్తారు. ఇంత డబు ్బలు ఆ దేశంలోని బీదవారికి జాక్‌పాట్ తగిలినంతగా చెప్పాలి. ఇలా ప్రమాదకరంగా కడుపులో డ్రగ్స్‌ను దాచుకుని ప్రయాణాలు చేస్తున్న వారు రెం డు లేదా మూడు రోజుల వ్యవధిలోనే డ్రగ్స్‌ను బయటకు తీయకుంటే మరణించడం ఖాయంగా చెప్పాలి. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ము ంబాయితో బెంగళూరు, చెన్నై శంషాబాద్ విమానాశ్రయాలలో తరచూ శరీరాలలో హెరాయిన్, కొకైన్ సహా పలు రకాల డ్రగ్స్‌ను మాత్రలు, లేదా పొ ట్లాల రూపంలో దాచుకుని వస్తూ ఇక్కడ కస్టమ్స్ అధికారులకు దొరికిపోతున్న తీరు డ్రగ్ మాఫియా ఆగడాలు ఏ స్థాయికి చేరాయో ఊహించుకోవ చ్చు. శంషాబాద్ విమానాశ్రయంలో ఏడాదిన్నర క్రితం టాంజానియాకు చెందిన ముగ్గురు వ్యక్తులు కడుపులో హెరాయిన్ దాచి వుంచి హైదరాబాద్ కు రాగా అప్పటికే వారి ప్రయాణం మూడు రోజులు దాటడంతో తీవ్ర అస్వస్తతకు లోనవడం, సరిగ్గా నడవలేక పోవడంతో డిఆర్ఐ అధికారులు అ నుమానించి వెంటనే విమానాశ్రయంలోనే స్కానింగ్ చేయగా వారి కడుపులో డ్రగ్స్ వున్న విషయం రట్టయ్యింది. ఇందులో మొదటి వ్యక్తి కడుపులో 57 మాత్రలు, రెండవ వ్యక్తి కడుపులో 108 మాత్రలు వున్నాయి. వీరిద్దరిని వారం రోజుల పాటు ఆసుపత్రిలో వుంచి చిన్నపాటి ఆపరేషన్లు చేసి కడుపులోని మాదకద్రవ్యాలను వెలికితీశారు.

# లక్షల స్కాలర్‌షిప్ లభించినా వీసా తిరస్కరణ

## అమెరికా వెళ్లాలనుకున్న భారత్ విద్యార్థికి అనూహ్య అనుభవం




**కొలంబియా, అక్టోబరు 6:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న భారతీయ విద్యార్థులను ఆందోళనకు గురిచేసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం చదివేందుకు ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 88 లక్షలు) భారీ స్కాలర్‌షిప్ సాధించిన భారత విద్యార్థికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. చదువు పూర్తయ్యాక అతను తిరిగి భారత్‌కు వెళ్లడనే అనుమానంతో స్టూడెంట్ వీసాను నిరాకరించింది. భారత్‌కు చెందిన 27 ఏళ్ల కౌశిక్ రాజ్, కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సులో ప్రవేశానికి ఎంపికయ్యాడు. దీనికి తోడు సుమారు రూ. 88 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌ను కూడా సాధించాడు. దీంతో తన కల నెరవేరినట్లేనని భావిస్తున్న తరుణంలో అమెరికా వీసా ఇంటర్వ్యూ తర్వాత అతనికి నిరాశే ఎదురైంది. అధికారులు అతని వీసా దరఖాస్తును తిరస్కరించారు. చదువు పూర్తయిన తర్వాత కౌశిక్ తిరిగి తన సొంత దేశానికి వెళతాడన్న నమ్మకం తమకు కలగడం లేదని వీసా తిరస్కరణ పత్రంలో అధి కారులు స్పష్టంగా పేర్కొన్నారు. అమెరికా నిబంధనల ప్రకారం, స్టూడెంట్ వీసా (ఎఫ్1) కోసం దరఖాస్తు చేసుకున్నవారు తమ చదువు తాత్కాలికమేనని, ఆ తర్వాత తమ దేశానికి తిరిగి వెళ్లేందుకు బలమైన కుటుంబ, సామాజిక బంధాలు ఉన్నా యని నిరూపించు కోవాల్సి ఉంటుంది. కౌశిక్ విషయంలో ఈ నిబంధన నెరవేరలేదని అధికారులు తేల్చిచెప్పారు. ఈ అనూహ్య పరిణామంపై కౌశిక్ రాజ్ స్పందించాడు. నా కుటుంబం, బంధువులు అందరూ భారత్‌లోనే ఉన్నారు. అయినా నాకు వీసా నిరాకరించడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నాడు. వీసా అధికారులు తన సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించడం వల్లే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అతను అనుమానం వ్యక్తం చేశాడు. గతంలో తాను జర్నలిస్టుగా పనిచేసినప్పుడు రాసిన కథనాల లింకులను సోషల్ మీడియాలో పంచుకున్నా నని, వాటిని చూసిన అధికారులు తాను అమెరికాలో స్థిరపడటానికే వస్తున్నానని అపార్థం చేసుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంపై అప్పీల్ చేసుకునే అవకాశం లేదని, కావాలంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అమెరికా వీసా అనేది ఒక అవకాశం మాత్రమే కానీ, హక్కు కాదని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ పరిణామం అమెరికాలో ఉన్నత విద్య కోసం ప్రయత్నిస్తున్న ఇతర భారతీయ విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.



# బిజెపి ఎంపి ఖగేన్ ముర్ముపై దాడి!

**కోల్‌కతా, అక్టోబరు 6:** పశ్చిమబెంగాల్ లో భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన బీజేపీ ప్రతినిధి బృందం పై సోమవారంనాడు దాడి జరిగింది. జల్‌పాయ్‌గురి జిల్లాలో బీజేపీ ప్రతినిధుల కాన్వాయ్‌పై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో మాల్దా ఉత్తర్ ఎంపీ ఖగెన్ ముర్ము తీవ్రంగా గాయపడ్డారు. సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ సైతం గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. దాడిలో ఈ ఇద్దరు నేతలు ప్రయాణిస్తున్న వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు వెళ్తున్న తమ పార్టీ ప్రతినిధి బృందంపై దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఉందని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. టీఎంసీ గూండాలు నార్త్ మాల్దాకు రెండుసార్లు ఎంపీగా ఉన్న ఖగెన్ ముర్ముపై దాడి చేశారు. కోల్‌కతా కార్నివాల్‌లో మమతా బెనర్జీ మునిగిపోయారు. టీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏమాత్రం వరద సహాయక చర్యలను పట్టించుకోవడం లేదు. బీజేపీ నేతలు, కార్యకర్తలు మాత్రమే బాధితులను ఆదుకుంటున్నారు. టీఎంసీ బెంగాల్‌లో క్రూరత్వం రాజ్యమేలుతోందని సామాజిక మాధ్యమం ఎక్స్‌ ఖి ఆయన పేర్కొన్నారు. మాల్దా ఉత్తర్ లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపీగా ఆయన రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2006 నుంచి 2019 వరకూ హబీబ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆయన సేవలందించారు.

# బీహార్ ఎన్నికలకు 11 మందితో ఆప్ జాబితా



**పాట్నా, అక్టోబరు 6:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 11 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఎపి) సోమవారం విడుదల చేసింది బీహార్‌లో ఆప్ పోటీ చేస్తుండటం ఇదే మొదటిసారి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈసారి బీహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారు. ఈ విషయాన్ని ఆప్ ఢిల్లీ విభాగం చీఫ్, సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ఆ తర్వాత ధ్రువీకరించారు. ఆప్ అభ్యర్థులు వీరే.. ఆప్ ప్రకటించిన 11 మంది అభ్యర్థులలో డాక్టర్ మీరాసింగ్-బెగుసరాయ్ (బెగుసరాయ్), యోగి చౌపల్-కుషేశ్వర్‌స్థాన్ (దర్భంగా). అమిత్‌కుమార్‌సింగ్-తరియ (సారణ్), భాను భారతీయ-కస్బా (పూర్ణియా), సౌభద యాదవ్-బేనిపట్టి (మధుబని), అరుణ్‌కుమార్ రజక్-ఫుల్వారి షరీఫ్ (పాట్నా), డాక్టర్ పంకజ్‌కుమార్-బంకీపూర్ (పాట్నా), అష్రాఫ్ ఆలం-కిషన్ గంజ్ (కిషన్‌గంజ్), అఖిలేష్ నారాయణ్ ఠాకూర్-పరిహార్ (సీతామర్హి), అశోక్‌కుమార్‌సింగ్-గోవింద్‌గంజ్ (మోతిహారి), మాజీ కెప్టెన్ ధర్మరాజ్‌సింగ్-బక్సర్ (బక్సర్) ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్-2025ను ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరుగనుంది. నవంబరు 14న కౌంటింగ్ జరుగుతుంది కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో 2020లో మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి.



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం నాడు బద్రీనాథ్‌ను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడి నివాసంలో తేనీరు సేవించిన దృశ్యం

# ఎవరెస్టుపై మంచు తుపాను.. చిక్కుకుపోయిన 1000 మంది

**బీజింగ్, అక్టోబరు 6:** ప్రపంచంలోనే అతిపెద్ద పర్వతం ఎవరెస్టుపై మంచు తుపాను బీభత్సం సృష్టించింది. దీంతో వేల అడుగుల ఎత్తులో దాదాపు 1000 మంది పర్వతారోహకులు మంచు శిఖరంపై చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు స్థానికులతో కలిసి అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. టిబెట్‌లో ఎవరెస్టు పర్వతం తూర్పువాలు వైపు శుక్రవారం సాయంత్రం నుంచి దట్టంగా మంచు కురుస్తోంది. ఆదివారానికి అది మంచు తుపానుగా మారింది. దీంతో దాదాపు 1000 మంది క్యాంప్ సైట్ల వద్ద చిక్కుకుపోయారు.



వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 350 మందిని రక్షించి క్యుడాంగ్ అనే చిన్న టౌన్‌షిప్‌కు తరలించారు. ఎవరెస్టుపైకి వెళ్లే మార్గాల్లో భారీగా మంచు చరియలు పడి దారులు మూసుకుపోయాయి. దీంతో వాటిని తొలగించేందుకు వందలాది మంది స్థానికులు, రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. సాధారణంగా ఈ వైపు నుంచే పర్వతారోహకులు, హైకర్లు ఎక్కువగా ఎవరెస్టు పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు చైనాలో సెలవులు కావడంతో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంది. అదే సమయంలో మంచు తుపాను సంభవించడంతో వీరంతా పర్వతంపై చిక్కుకుపోయారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో హైకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది హైకర్లు హైపోథెర్మియా బారిన పడినట్లు రెస్క్యూ బృందం వెల్లడించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శనివారం నుంచి ఎవరెస్టు పైకి వెళ్లేందుకు అనుమతులు నిలిపివేశారు. సాధారణంగా అక్టోబరులో ఈ మంచు పర్వతంపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మరోవైపు, నేపాల్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే.

## ద్వారపాలకుల బంగారు తాపడం మాయం!

# సిట్ దర్యాప్తునకు ఆదేశించిన కేరళ హైకోర్టు



**తిరువనంతపురం, అక్టోబరు 6:** కేరళలోని సుప్రసిద్ధ శబరిమల దేవాలయంలోని ద్వారపాలకుల విగ్రహాల బంగారం మాయమవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. బంగారు పూత పూసిన రాగి పలకల నుంచి బంగారం మాయమవడంపై కేరళ హైకోర్టు తాజాగా సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు విజిలెన్స్ బృందం ఈ విషయంపై తన ప్రాథమిక దర్యాప్తుపై మధ్యంతర నివేదిక సమర్పించిన అనంతరం కేరళ హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. దర్యాప్తును గోప్యంగా నిర్వహించాలని, నివేదికను నేరుగా కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. 2019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఉన్న బంగారు పూత పూసిన రాగి పలకలను తాపడం కోసం తొలగించారు. దీని కోసం స్పెషల్ కమిషనర్ నుంచి కానీ, కోర్టు నుంచి కానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. కనీసం సమాచారం ఇవ్వలేదు. అప్పుడు వాటి బరువు 42.8 కిలోలు. కానీ ఈ రాగి పలకలు చెన్నైలోని ఓ సంస్థకు చేరేసరికి వీటి బరువు 38.258 కేజీలు మాత్రమే ఉంది. అంటే 4.54 కేజీల బంగారం తగ్గిపోయింది. ఓ భక్తుడి ద్వారా వాటిని చెన్నైకి పంపడం కూడా వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన, వివరణ లేని వ్యత్యాసం అని పేర్కొంది. వాస్తవానికి ఈ ద్వారపాలకుల విగ్రహాలను 1999లో 40 ఏళ్ల వారంటీతో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కేవలం ఆరేళ్లకే తాపడంలో లోపాలు తలెత్తడంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది. 2019లో ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మరమ్మతులు చర్యలు చేపట్టింది. అయితే, వారు స్పెషల్ కమిషనర్‌కు గానీ, కోర్టుకు గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ బంగారు రేకులను తొలగించడం వివాదానికి కారణమైంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంపై అసెంబ్లీలో కూడా తీవ్రస్థాయిలో వాగ్వాదాలు జరిగాయి. శబరిమలైలో బంగారం మిస్ కావడంపైయుడిఎఫ్ సభ్యులు అసెంబ్లీలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీనితో స్పీకర్ ఎఎన్ షంసీర్ సభను రేపటికి వాయిదావేసారు.

# ఎమ్జీఆర్ విగ్రహం ధ్వంసం

## యధాస్థానంలో ఏర్పాటు చేసిన స్థానికులు

**చెన్నై, అక్టోబర్ 6:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకె వ్యవస్థాపకుడు ఎంజి రామచంద్రన్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. మధురై జిల్లా తిరుప్పం కుంద్రం నియోజకవర్గంలోని అవనియాపురంలో ఈ సంఘటన జరిగింది. ప్రసిద్ధ జల్లికట్టు అరేనా సమీపంలో ఉన్న 3.5 అడుగుల ఎంజిఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. పీఠం నుంచి ఆ విగ్రహాన్ని పెకలించడదాన్ని సోమవారం ఉదయం స్థానికులు గమనించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న అన్నా డిఎంకె నేతలు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. కూలిన ఎంజిఆర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై నిరసన తెలిపారు. బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అవనియాపురం పోలీసులకు పార్టీ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ఈ సంఘటనను ఖండించారు. ఎంజిఆర్ కీర్తి, విధానాలను ఎదుర్కోలేని వారు ఈ పిరికి చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. పోలీసులు నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సంక్షిప్తంగా..

## దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఐఎన్ఎస్ సహ్యాద్రి



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారతీయ యుద్ధ నౌక ఐఎన్ఎస్ సహ్యాద్రి దక్షిణ చైనా సముద్రంలో మోహరిస్తున్నారు. గడిచిన రెండు వారాల్లో ఆ వివాదాస్పద జలాల్లో భారతీయ యుద్ధ నౌక సంచరించడం ఇది రెండో సారి. ప్రస్తుతం ఐఎన్ఎస్ సహ్యాద్రి మూడు రోజుల పాటు మలేషియాలో ఉన్నట్లు నేవీ ఓ ప్రకటనలో తెలిపింది. దక్షిణ చైనా సముద్రంలో ఈస్ట్రన్ ఫ్లీట్ ను డిస్ప్లాయ్ చేస్తున్నారని, ఇండోపసిఫిక్ ప్రాంతంలో కూడా యుద్ధ నౌకల మోహరింపును బలపేతం చేస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. ఐఎన్ఎస్ సహ్యాద్రి బాధ్యతాయుతంగా ఆపరేషనల్ డిప్లాయ్‌మెంట్‌లో పాల్గొన్నదని, ఇండోపసిఫిక్ సముద్ర ప్రాంతంలో సెక్యూర్టీ భాగస్వామి బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. రెండు వారాల క్రితమే మరోయుద్ధ నౌక ఐఎన్ఎస్ నిస్తార్ ఇండో పసిఫిక్ రీచ్‌లో పాల్గొన్నది. పది రోజుల పాటు ఆ ఈవెంట్ జరిగింది. సింగపూర్ వేదికగా జరిగిన పసిఫిక్ రీచ్ విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశ నౌకలు కూడా పాల్గొన్నాయి.

## దుర్గామాత నిమజ్జన ర్యాలీలో ఘర్షణలు, పలువురికి గాయాలు

**కటక్, అక్టోబరు 6:** ఒడిశాలోని కటక్ నగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా చెలరేగిన హింసతో అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలో 36 గంటల పాటు కర్ఫ్యూ విధించి, 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను, సోషల్ మీడియాను నిలిపివేశారు. శాంతిభద్రతలను పునరుద్ధరిం చేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వ హిస్తున్నారు. దుర్గా నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. ఈ వాగ్వాదం కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు రాళ్లు, సీసాలతో దాడులు చేసుకోవడంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది.

ఈ హింసాత్మక ఘటనలో ఎనిమిది మంది పోలీసుల సహా మొత్తం 25 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడాలి: ఢిల్లీ సిఎం



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** సమాజంలో విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులేనని, వారి సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వం పనిచేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. ఢిల్లీలోని పీతంపురలో శ్రీ బ్రాహ్మణ సభ నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో రేఖా గుప్తా మాట్లాడుతూ, "సమాజంలో ఎవరైనా విజ్ఞాన దీపాలను వెలిగిస్తున్నారంటే అది మన బ్రాహ్మణ సమాజమే. వారు శాస్త్రాలనే కాదు, శస్త్రాలను కూడా పూజిస్తారు. నేటి సమాజాన్ని, దేశాన్ని కాపాడాలంటే శాస్త్ర, శస్త్రాలు రెండూ ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎల్లప్పుడూ జ్ఞానాన్ని పంచుతూ, ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మంచిని పెం చుతూ సమాజ హితం కోసం పాటుపడ్డారని ఆమె కొనియాడారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్రాహ్మణులను ముందుకు తీసుకెళ్లేందుకు వారి సంక్షేమానికి కట్టుబడి ఉండాలని ఆమె సూచించారు.

## వైద్యవిద్యార్థినిపై పదే పదే లైంగిక దాడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పార్టీ పేరుతో హోటల్‌కు పిలిచి, 18 ఏళ్ల ఎంబీబీఎస్ విద్యార్థినిపై ఒక యువకుడు, అతడి స్నేహితులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ దారుణాన్ని వీడియో తీసి, నెలరోజుల పాటు ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు అత్యాచారం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు. వాయవ్య ఢిల్లీలోని ఆదర్శ్ నగర్‌లో ఈ ఘటన జరిగింది. హర్యానాలోని జింద్‌కు చెందిన బాధితురాలు ఢిల్లీలో హాస్టల్‌లో ఉంటూ ఎంబీబీఎస్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువకుడు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరికీ ముందునుంచే పరిచయం ఉంది. సెప్టెంబర్ 9న తన ఇద్దరు స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుందామని నమ్మించి బాధితురాలిని హోటల్ గదికి పిలిచాడు. అక్కడ ఆమెకు ఇచ్చిన కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపారు. ఆమె స్పృహ కోల్పోయాక ప్రధాన నిందితుడు అత్యాచారం చేయగా, మిగిలిన ఇద్దరు ఆ దారుణాన్ని వీడియో తీసి, ఆ తర్వాత వారు కూడా లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

# అన్న సమారాధనను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి

**భీమవరం అక్టోబర్ 6ప్రభాతవార్త :** అన్నిధనాల కెల్లా అన్నదానం గొప్పదని, దైవ కార్యక్రమంలో అన్నదానం చేయడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని ప్రభుత్వ మా మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మెంటే వారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరి దేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగింపులో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేసి మహా నివేదన నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 2000 మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# స్వచ్ఛ ఆంధ్ర అవార్డులలో నంబర్ వన్ గా నిలవాలి

## అధికారులకు దిశా నిర్దేశం - జిల్లా కలెక్టర్ సెల్వి



**ఏలూరు ప్రభాత వార్త :** ఏలూరు జిల్లాను 'స్వర్ణ ఏలూరు – స్వచ్ఛ ఏలూరు' గా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక సి.ఆర్.రెడ్డి కళాశాల ఆడిటోరియం



లో సోమవారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, వివిధ శాఖల అధికారులతో కలిసి అందించారు. ముందుగా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంక్రాంతి లోగా జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల సాధన లక్ష్యాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అధికారులు, ప్రజలు కలిసికట్టుగా మనసు పెట్టి పనిచేస్తే 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో అన్ని విభాగాలలోనూ రాష్ట్ర స్థాయి అవార్డులను సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల చేతుల మీదుగా అవార్డులు తీసుకోవచ్చున్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో 2, జిల్లా స్థాయిలో 51 స్వచ్ఛ అవార్డులు సాధించిందని, రానున్న స్వచ్ఛ అవార్డుల సమయానికి ప్రస్తుతం సాధించిన అవార్డులకు రెట్టింపు అవార్డులు సాధించేలా లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. జనవరి,1వ తేదీ నాటికి జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పూర్తిస్థాయిలో నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు.




సంక్రాంతి నాటికి జిల్లాలో నూరుశాతం ఇంటింటికి తడి, పొడి చెత్త సేకరణ చేయాలనీ, సేకరించిన తడి, పొడి చెత్తలను వేరుచేసి, తడిచెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలన్నారు. ప్రతీ ఇంటిలోనూ తడి చెత్తను హెూమ్ కంపోస్ట్ గా మార్చి, మొక్కలకు ఎరువుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కలిగించాలని, పట్టణ ప్రాంతాలలో 3 వేల ఇళ్ళు , గ్రామీణ ప్రాంతాలలో 5 వేల ఇళ్లలో హెూమ్ కంపోస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 50 వేల ఇళ్లలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుచేసుకునేలా చూడాలని, జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లు ఏర్పాటుచేయాలని, ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డులో 80 వేల టన్నులకు పైగా ఉన్న వ్యర్థాలను

7వ పేజీలో

# పరిశుభ్రత లో భారత దేశాన్ని ప్రపంచదేశాలు మెచ్చాలి:కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

**భీమవరం అక్టోబర్ 6 ప్రభాతవార్త :** ప్రపంచ దేశాలు మెచ్చే విధంగా పరిశుభ్రతలో భారతదేశం తలమానికంగా నిలిపేందుకు అవసరమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ ప్రధానోత్సవం కార్యక్రమానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు మరియు పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంట త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ స్వచ్ఛత విషయంలో భారతదేశాన్ని



ప్రపంచ దేశాలు చెప్పుకునే అంత మార్పు ప్రజల సహాయ సహకారాలతోనే సాధ్యమన్నారు. భారత దేశంలో స్వచ్ఛత

7వ పేజీలో

# తణుకు డిగ్రీ కళాశాలలో జీఎస్టీ పై అవగాహన సదస్సు

**తణుకు, అక్టోబర్ 6(ప్రభాత వార్త):** జీఎస్టీ పన్ను వ్యవస్థ దేశ ఆర్థిక నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఏడుకొండలు అన్నారు. కళాశాల వాణిజ్య విభాగం, అర్థ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్" అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక సూత్రాలను, పన్ను విధానాలను అవగాహన చేసుకోవడం ద్వారా వ్యాపార, ఉద్యోగ అవకాశాల్లో ముందుకు వెళ్లగలరని అన్నారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ఎ.మారుతీ దేవి చౌదరి మాట్లాడుతూ జీఎస్టీ విధానం వినియోగదారులకు పారదర్శక వ్యవస్థను అందించడంతో పాటు సూపర్ సేవింగ్ సూత్రాన్ని ప్రోత్సహిస్తుందని తెలియజేసారు. కె.జీవన్ బాబు విద్యార్థులకు జీఎస్టీ అమలు పద్ధతి, దాని ప్రయోజనాలు, సేవింగ్ మేనేజ్‌మెంట్ గురించి వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ అధ్యాపకులు డాక్టర్ ఐ.వి.నారాయణ, జి.ఇందిరా కుమారి, కె.రాజశేఖర్, బి.యస్.యల్. పద్మశ్రీ, ఎస్.సుభాకర్ రెడ్డి, బి.శిరీష ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుబ్రహ్మ అవార్డుతో భాష్యం ఉపాధ్యాయులకు ఘన సత్కారం

## తెలుగు ఉపాధ్యాయిని సీతారత్నం హెచ్ఎం అప్పారావు లకు గురుబ్రహ్మ సత్కారం.



**పెనుగొండ అక్టోబర్ 6(ప్రభాత వార్త) :** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుబ్రహ్మ పురస్కారంతో భాష్యం ఉపాధ్యాయులకు ఘన సత్కారం జరిగింది. విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను గౌరవించేందుకు గోదావరి టాలెంట్ టెస్ట్, విద్యారంగ పత్రిక ఎడ్యుకేషన్ స్పెషల్ ఆధ్వర్యంలో "గురుబ్రహ్మ అవార్డుల ప్రధానోత్సవం" ఆదివారం రాజమండ్రి ఆనంద రీజెన్సీ పందిరి హాల్లో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పెనుగొండ భాష్యం పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.అప్పారావు , తెలుగు ఉపాధ్యాయిని పి.సీతారత్నం "గురుబ్రహ్మ" పురస్కారంతో సత్కరించబడ్డారు. విద్యారంగంలో వారి అంకితభావం, విద్యార్థులపై చూపిన మార్గదర్శకత్వం, నిత్య నూతన విద్యా విధానాల అమలులో చూపిన చొరవకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించబడింది. అవార్డు స్వీకరించిన అనంతరం ఎన్.వి.అప్పారావు మాట్లాడుతూ ఎంతో మంది ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును స్వీకరించడం ఎంతో గౌరవంగా, ఆనందంగా ఉంది. గురువు స్థానం ఎంత గొప్పదో, బాధ్యత ఎంత గొప్పదో ఈ వేదికపై ప్రతి ఒక్కరు వివరించారు. ఈ అవార్డు మాపై మరింత బాధ్యతను పెంచుతుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం మేము నిరంతరం కృషి చేస్తాం. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే మార్గదర్శకులుగా నిలుస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో




భాష్యం వెస్ట్ జోన్ ఇంచార్జ్ ఏ.శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజాజీ, ఉపాధ్యాయ%-%ఉపాధ్యాయేతర సిబ్బంది హాజరై అవార్డు గ్రహీతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ప్రపంచవ్యాప్తంగా ఆమోదనీయమైన పీపీపీ విధానం

## వెల్లడించిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

**తణుకు, అక్టోబర్ 6(ప్రభాత వార్త):** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీపుల్స్ పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానం ప్రపంచవ్యాప్తంగా ఆమోదనీయమైందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఎక్కువ ఉచిత సీట్లు, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ వైద్యం రావడం ఇష్టం లేని జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తికి తప్ప సర్వప్రయోజనాల విధానం పీపీపీ విధానం సర్వత్రా ఆమోదనీయమైందన్నారు. పీపీపీ మోడల్ కారణంగా కలిగే విస్తృత ప్రయోజనాల గురించి ప్రపంచమంతా తెలిసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆలోచనలతో రాష్ట్రంలో ప్రారంభించిన ఈ విధానాన్ని అన్ని దేశాల్లో అనుసరించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాధాకృష్ణ పేర్కొన్నారు.



# గ్రామ సచివాలయాన్ని ఆకస్మిత తనిఖీ చేసిన టిడిపి ఇన్చార్జ్ రామరాజు



**మొగల్తూరు అక్టోబర్ 6 ( ప్రభాతవార్త ) :** పేరుపాలెం సౌత్ గ్రామంలో సచివాలయం సోమవారం ఉదయం తెరిచే సమయానికి తెరవక పోవటాన్ని నరసాపురం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు ఆకస్మిత తనిఖీ నిర్వహించారు అనంతరం ఆయన అక్కడ నుండే మొగల్తూరు ఎంపీడీవో సిహెచ్ త్రిశూలపాణి కి ఫిర్యాదు చేశారు. రెండు గంటలపాటు సచివాలయం తెరవక పోవడానికి ఉద్యోగులు బాధ్యతారహితంగా పని చేస్తున్నట్లు ఆయన అధికారికి ఫిర్యాదు చేసి ఇటువంటి పరిస్థితి మరల పునరావతం కాకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రామరాజు రెండు గంటల సమయం అనంతరం తెరిచిన సచివాలయంలో ఉద్యోగుల హాజరు పట్టి ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాలు ద్వారా ప్రజలకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉద్యోగులు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యాలయం ఉదయం 10 గంటలకు తెరిచి ఉన్నట్లయితే ప్రజలు పనులు నిమిత్తం సచివాలయ కార్యాలయానికి వస్తుంటారని అటువంటి వారికి ఇబ్బంది లేకుండా ఉద్యోగులు చూడాలని కోరారు. రామరాజు వెంట మాజీ సర్పంచ్ తిరుమాని లక్ష్మీనరసింహస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు గుబ్బల నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు కౌరు ముత్యాలరావు, ఏఎంసీ డైరెక్టర్లు సత్తినేని బాబ్జి, డొల్ల రత్నం రాజు, సత్య సూర్య కృష్ణ, సత్తినేని సర్వేశ్వరరావు, పాల రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్ళు కు నాయకర్ కృషి

ప్రభాతవార్త నరసాపురం : విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ , రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథినీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ గృహ పథకాల అమలు విషయమై చర్చించారు. నరసాపురం నియోజవర్గంలో అర్హత కలిగిన కుటుంబాలకు వీలైనంత త్వరగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. పార్థసారథి సానుకూలంగా స్పందిస్తూ, గృహనిర్మాణ పథకాలను వేగవంతంగా అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.



# వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు

## ఫారెస్ట్ రేంజర్ కె రామలింగా చార్యులు

కైకలూరు అక్టోబర్ 5 (ప్రభాతవార్త): వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దని కైకలూరు అటవీశాఖ రేంజర్ కే రామలింగా చార్యులు కోరారు. ఆదివారం మండలంలోని కొల్లేటికోట బీట్ పరిధి పందిరిపల్లి గూడెంగ్రామంలో డిఆర్ఓ రంజిత్ ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ఆర్ఓ రామలింగాచార్యులు, రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే యేసు రాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ వన్యప్రాణలను వేటాడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద 1972 ప్రకారం శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. వన్యప్రాణులు సంరక్షణ మరియు పక్షుల సంరక్షణ, వాటిని సంరక్షించే కార్యాచరణ గురించి,ప్లాస్టిక్ ని ఉపయోగించడం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. రొయ్యల చెరువులో ఉపయోగించేటువంటి



యాంటీబయోటిక్స్ ఫెస్టిసైడ్స్ గురించి వాటి వల్ల జరిగే అనర్థాలు గురించి,ప్లాస్టిక్ వల్ల కొల్లేరు నీరు ఎంతో కలుషితం అయిందని పేర్కొన్నారు. వన్యప్రాణులను ఎలా సంరక్షించుకోవాలో వాళ్ళందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది. గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


# 26 మంది పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణి

**కైకలూరు అక్టోబర్ 6 (ప్రభాతవార్త) :** కలిదిండి మండలం కలిదిండి ఆర్సిఎం చర్చ్ ఆవరణలో భీమవరం రాజ్ ట్రస్ట్ అధినేత గంటా రాజ్ కుమార్ సహకారంతొ దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ నాయకులు జక్కుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కలిదిండి, కైకలూరు కు చెందిన 26 మంది పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వల్లభనేని శ్రీవాస్ చౌదరి (నాని ), మండల టీడీపి అధ్యక్షులు జోగిరాజు, సీనియర్ న్యాయవాది యెలేటి న్యూటన్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కట్టా గోపి, రాష్ట్ర బీసీ నాయకులు కట్టా రాఘువులు విచేశారు. వారు మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ వారు చేసే సేవకార్యక్రమాలు చాలా అభినందనీయం కరోనా సమయంలో కూడా భీమవరం టౌన్ మొత్తం ఆహార పదార్థాలు పంచడం శానిటేషన్ చేయడం చదువుకునే పిల్లలకు బుక్స్



పంపిణి చేయడం ప్రతీ నెల సుమారుగా 14 వందలమంది వికలాంగులకు వితంతువులకు వృద్దులకు రూ 500/- చొప్పున పంపిణి చెయ్యడం ఈరోజు కలిదిండిలొ మహిళలకు కుట్టు మిసషన్లు వాటికి ఎలక్ట్రికల్ మోటార్లు స్టూళ్లు వాటిని తీసుకువెళ్ళుటకు ఒకొక్కరికి రూ 500/- ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలొ సనమండ దాసు, జనసేన తంబీ, కూరెళ్ళ భోగేశ్వరరావు, గూట్ల ఈశ్వర్, అందుగాలా వెంకటరత్నం, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక యుగంలో మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం




**నర్సాపురం ప్రభాతవార్త :** స్థానిక శ్రీ వై ఎన్ కళాశాల చరిత్ర , రాజకీయ శాస్త్రము మరియు భూగోళ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'ఆధునిక యుగంలో మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం' అనే అంశముపై ఒకరోజు వర్కుషాప్ ను నిర్వహించారు. ఈ వర్క్ షాప్ నకు మల్కిపురం డిగ్రీ కళాశాలకు చెందిన పి. సూర్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి, 'మౌర్య పాలనా నిర్మాణాల ఔచిత్యం ఏమిటంటే, సమర్థవంతమైన పాలన, పౌర సంక్షేమం, మరియు రాజకీయ ఐక్యతను సాధించడంలో ఈ ప్రాచీన వ్యవస్థ నేటికీ మార్గదర్శకంగా నిలుస్తుందని, కేంద్రీకృత పాలనా వ్యవస్థ, బ్యూరోక్రసీ, సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత, మరియు సమర్థవంతమైన న్యాయ వ్యవస్థ వంటి మౌర్యుల నమూనాలను ఆధునిక భారతదేశం తన పాలనా నిర్మాణంలో అవలంబించిందని, పౌర సంక్షేమానికి మరియు ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, దీనికి తోడ్పడేలా పన్నుల వసూలు, ప్రజల జనన మరణాల నమోదు, వాణిజ్యం వంటి వివిధ విభాగాలు ఏర్పాటు చేయబడ్డాయని, ప్రధాన రహదారుల నిర్మాణం, వాణిజ్య మార్గాల విస్తరణ ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి కృషి చేశారని, నేటికీ రహదారుల నిర్మాణం, వాణిజ్య విస్తరణ ప్రభుత్వ విధానాలలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ' ఉద్బోదించారు. ఈ వర్క్ షాప్ నకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు అధ్యక్షత వహించగా, డీన్ మరియు ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ ఆర్ డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, చరిత్ర శాస్త్ర విభాగాదిపతి ఎస్ సోమశేఖర్, డాక్టర్ ఎల్. మల్లేశ్వరరావు, పరిమి రామకృష్ణ, బయోటెక్ శ్యాంబాబు, మారుతీ రావు, జాగ్రఫీ ప్రసాద్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లేక వెలవెల పోతున్న ప్రభుత్వ పాఠశాలలు

## - ప్రభుత్వ పాఠశాలలపై తగ్గిన ఆసక్తి

**ప్రభాతవార్త చాట్రాయి :** చాట్రాయి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేక వెలవెల పోతున్నాయి. ఒక్కో పాఠశాలలో ఐదుగురు పదిమంది మాత్రమే విద్యార్థులు ఉండగా ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలు కూడా చాట్రాయి మండలంలో దర్శనమిస్తా ఉంటాయి. మరికొన్ని పాఠశాలలలో 20 నుండి 30 మంది విద్యార్థులు ఉన్న ఒకరు ఇద్దరు ఉపాధ్యాయులతో కాలక్షేపం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని పలువురు అంటున్నారు. ఏడాదికి ఏడాదికి ప్రభుత్వం పాఠశాలలో చదివే వారి సంఖ్య ప్రభుత్వ స్పందన నామమాత్రంగానే ఉందని చెప్పాలి. ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు ఎందుకు రావడం లేదుఅనే విషయంపై ఉన్నతాధికారులు కూడా ఏనాడు రివ్యూ చేసిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో సైతం కనీసం 250 మంది పైగా విద్యార్థులు ఉండాల్సి ఉండగా 100 మంది కూడా లేని పరిస్థితి ఏర్పడుతోంది. మధ్యాహ్న భోజనంతో యూనిఫామ్, పుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలపై దృష్టి సారించకపోవడం ఏమిటి అనేది అంతులేని ప్రశ్న. వ్యవసాయ కూలీలు సైతం ప్రైవేట్ పాఠశాలల పైనే మక్కువ చూపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలలో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ పేదలు వెనకాడటం లేదని చెప్పాలి. దీనికి బలమైన కారణమేంటనేది ఉన్నతాధికారులే గ్రామాలలో సర్వే నిర్వహించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



## పట్టణములులో జి ఎస్ టి పై అవగాహన

నర్సాపురం ప్రభాతవార్త : నరసాపురం పట్టణం7వ వార్డులో నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన స్థానిక షాపులను సందర్శించి, గత ప్రభుత్వ కాలంలో ఉన్న వస్తువుల ధరలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 ప్రకారం లభిస్తున్న ధరలతో పోల్చి ప్రజలకు వివరించారు. కొత్త జీఎస్టీ విధానం వల్ల నిత్యావసర సరుకుల ధరలు తగ్గి, సాధారణ ప్రజలకు ఉపశమనం లభిస్తోందని ఆయన తెలిపారు. ప్రజలందరూ కొత్త జీఎస్టీ విధానం ద్వారా అందుతున్న ప్రయోజనాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం పట్టణ టిడిపి అధ్యక్షులు–ఎ ఎం సి చైర్మెన్ జక్కం శ్రీమన్నారాయణ, 31వ



వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహారావు (బాబ్జీ), టౌన్ పార్టీ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొన్నాల నాగబాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భూపతి నరేష్, కోటిపల్లి గోపాలకృష్ణ, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, పెండ్రా శ్రీనివాస్, దేశెట్టి సత్యనారాయణ, జక్కం కాశీ, నాగిడి రాంబాబు, తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సిద్ధాంతం దేవి సెంటర్లో లో భక్తి-భోజన ఘనత

### అన్నప్రసాదంతో కిటకిటలాడిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయం

**పెనుగొండ అక్టోబర్ 6 (ప్రభాతవార్త):** శరన్నవరాత్రి మహోత్సవాలు ముగియడంతో మండలంలోని ఆలయాల్లో భక్తి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సిద్ధాంతం దేవి సెంటర్లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు, దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అన్నప్రసాదంగా పులిహోర, దద్దోజనం, బూరెలు, కూరలు, పిండివంటలు వంటి ఎన్నో రుచికరమైన వంటకాలు భక్తులకు అందించారు. భక్తులు శ్రద్ధగా అమ్మవారిని దర్శించుకుని అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమాన్ని



విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శుద్ధమైన నీరు, కూర్చొనే ఏర్పాట్లు, శ్రమికుల సహకారం వంటి అన్ని అంశాలను సమర్థంగా పర్యవేక్షించారు. భక్తులు ఈ సేవను ప్రశంసిస్తూ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించవలెను.
ఫోన్ : 9704502377

## ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలంటు ర్యాలీ

భీమవరం అక్టోబర్ 6 ప్రభాతవార్త :ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని, పర్యావరణ పరిరక్షణకు మనందరం కృషి చేద్దామని పీ ఎస్ ఎం మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి సాయి ప్రసాద్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పీ ఎస్ ఎం హైస్కూల్లో సోమవారం ప్లాస్టిక్ ను నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక రోగాలు వస్తున్నాయని, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల్లో మార్పు చాలా అవసరమని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ ను నిషేధించడం మనందరి నైతిక బాధ్యత అని



అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే షర్మిల, జీడిగుంట సునీల్, బైరెడ్డి శేష కుమారి, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షికి ఘన నివాళి నదీమాతకు పంచహారతులు:



పెనుగొండ అక్టోబర్ 6 ప్రభాత వార్త :పెనుగొండ, సిద్ధాంతం గ్రామం ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా సోమవారం రాత్రి గోదావరి పుష్కర రేవు వద్ద వాల్మీకి మహర్షి జయంతి మరియు గోదావరి హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వేద పండితులు, మహిళా భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా



విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ముళ్ళపూడి రేణుక మాట్లాడుతూ ప్రకృతితో మమేకమై జీవించే సంస్కృతి మనదే. నదీమాతల ఆరాధన పర్యావరణ పరిరక్షణకు పూర్వీకుల సందేశం. ఆమె వాల్మీకి మహర్షి జీవితాన్ని, రామనామం ప్రభావాన్ని, రామాయణంలోని ధర్మ బోధనలను విశేషంగా వివరించారు. ఆనాడు వాల్మీకి మహర్షి జీవితాన్ని మార్చిన రామనామం నేడు దేశ చరిత్రను తిరగరాస్తోంది. ప్రతి మానవుడు రామాయణాన్ని చదవాలి,అని ఆమె పేర్కొన్నారు.వేద పండితులు కలగ భద్రుడు స్వామి బ్రాహ్మణత్వంతో, నీట్టాల సతీష్, లక్ష్మీదేవి దంపతులు వశిష్ట గోదావరి కి పంచ హారతులు భక్తిశ్రద్ధతో సమర్పించారు. దీపాల వెలుగులతో నదీ తీరం ప్రకాశించగా, మహిళా భక్తుల పాల్గొనడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డులలో నంబర్ వన్ గా నిలవాలి

నిర్వహణ చేసి తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి నిర్వహణ కు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలను బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ–వ్యర్థాలను ముందుగా పురపాలక సంఘాల స్థాయిలో సేకరించాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛంద్ర నిరంతర కార్యక్రమమని, సంపూర్ణ పారిశుద్ధ్యసాధనకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రతీ వ్యక్తి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశుభ్రత ముందుగా మన ఇంటి నుండే ప్రారంభం కావాలని, అప్పుడే గ్రామం, జిల్లా,రాష్ట్రం, దేశం సంపూర్ణ పారిశుద్ధ్యం గా మారుతుందన్నారు. పర్యావరణానికి కీడు చేసే ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతీ ఒక్కరూ నియంత్రించాలన్నారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏలూరు నగరపాలక సంస్థలో ఇంటింటికి వెళ్లి చెత్తసేకరణ చేస్తున్నామని, ప్రతీ ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్తసేకరణ వాహనాలకు అందించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతీ ఒక్కరూ నిషేధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు, జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ, డిఎంహెచ్ఓ డా. పి .జె. అమృతం, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్, జిల్లా ప్రజారవాణాధికారి షబ్నమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలు పరిష్కార తీరు పారదర్శకంగా, నాణ్యతతో ఉండాలి

### - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.. పిజీఆర్ఎస్ లో 248 అర్జీలు అందాయి



**ఏలూరు,అక్టోబరు,6: ప్రభాతవార్త :** పిజిఆర్ఎస్ లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవచూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విఅధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, సర్వే ఏడి అన్సారీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. పీజీఆర్ ఎస్ లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.

**అందిన అర్జీలలో కొన్ని..**

పెదపాడు మండలం చిన్న సత్యవోలు గ్రామానికి చెందిన సింగవరపు వెంకట అప్పారావు తన భూమి గ్రామ సర్వేఆర్.ఎస్. నెం.453 ప్రక్కన ఉన్న భూమిని కొందరు చేపల చెరువు త్రవ్వివున్నారని దీని వలన చుట్టుప్రక్కల ఉన్న తమ అపరాల పంటలకు నష్టంవాటిల్లు తుందని కనుక అధికారులు పరిశీలించి తమకు నష్టపరిహారం అందించాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఏలూరు పట్టణానికి చెందిన దొండపాటి విశాల్ ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజి లో బిటెక్ మొదటి సంవత్సరంలో జాయిన్ అయి బిటెక్ మొదటి సంవత్సరం పూర్తిచేశానని, తనకు అనారోగ్యం, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేను గోపన్నపాలెం పిఇటి కాలేజి నందు జాయిన్ అయినానని, గతంలో నేను చదివిన బిటెక్ ఇంజనీరింగ్ కాలేజిలో మొదటి సంవత్సరం పూర్తిచేసిన బిటెక్ సర్టిఫికేట్ ఇవ్వమని అడిగితే కాలేజి వారు రూ.75,000/- లు కడితేనే ఇస్తామని చెబుతున్నారని, కావున తమరు నాకు బిటెక్ చదివిన మొదటి సంవత్సరం సర్టిఫికేట్ ఇప్పించమని అర్జీ అందజేశారు. ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామానికి చెందిన గాజాల గోవర్ధన తనకు ఆధారమైన 0.05 సెంట్లు భూమిలో ఇల్లు నిర్మించుకొని దానిలో నివాసం ఉంటున్నానని, నిమ్మగడ్డ విజయక్రాంతి అనుఆమె మా ఇంటి నుంచి వెళ్లగొట్టారని, కావున అధికారులు వచ్చి సర్వేచేసి తన ఇల్లును తనకు ఇప్పించమని అర్జీ అందజేశారు. పోలవరం మండలం పాతపేటకు చెందిన కత్తవ వెంకటలక్ష్మి తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. చాట్రాయి మండలం చీపురుగూడెంకు చెందిన ఘంటసాల వెంకటేశ్వరరావు తనకు పింఛన్ మంజూరు చేయుమని కోరుతూ అర్జీ అందజేశారు. టి.నర్సాపురం మండలం మక్కినవారిగూడెం కు చెందిన చక్రపు సాయమ్మ నా కుమారునికి తన ఇల్లు, స్థలం వ్రాసి ఇచ్చానని అప్పటి నుంచి తనను పట్టించుకోవడం లేదని, ఇచ్చిన ఇల్లును, స్థలంను తిరిగి తనకు ఇప్పించమని అర్జీ అందజేశారు. సోమవారం జరిగిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో 200సోమవారం జరిగిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో 248 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేటు సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్రత లో భారత దేశాన్ని ప్రపంచదేశాలు

అనేటువంటి నినాదాన్ని ఆ రోజుల్లోనే ప్రారంభించిన వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ అన్నారు. 2014 లో భారత్ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన తరువాత అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు స్వచ్ఛభారత్ ఉద్యమానికి పెద్ద ఎత్తున దేశంలో శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ 2014 సంవత్సరంలో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత స్వచ్ఛ భారత్ పై సంకల్పించారని ఆ సంకల్పమే 10 సంవత్సరాల కాలంలో దేశంలో పారిశుధ్య పరిస్థితులలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నగరాన్ని మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ సర్వేక్షణ అవార్డ్స్ మాదిరిగానే, స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ కూడా స్వచ్ఛతా కార్యకలాపాల్లో అద్భుత ప్రదర్శన చూపిన వారిని గుర్తించి, అన్ని వర్గాలను స్వచ్ఛత స్ఫూర్తిని అందించడానికి, ప్రోత్సహించడమే లక్ష్యంఅన్నారు. భీమవరం శాసనసభ్యులు మరియు పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా భీమవరం పురపాలక సంఘంతో లైన్స్ క్లబ్ సంయుక్తంగా స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణకు అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వి. భీమారావు, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలు కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖదిబ్ కైసర్ బానో, డిపిఓ ఎం రామనాథరెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్, కె. రామచంద్రారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు,స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు గ్రహీతలు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిమ్స్ కి వెళ్లే బస్సులో చనుబండ నుండి నడిపించండి

### - మంత్రి సారధికి తెదేపా నేత రాము వినతి

చాట్రాయి, అక్టోబర్ 6, ప్రభాతవార్త : నూజివీడు డిపో నుండి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లే బస్సును విస్సన్నపేట వచ్చి వెళ్తుండగా చనుబండ నుండి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ని కోరినట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నక్క రాము తెలిపారు. ఈ మేరకు విజయవాడ క్యాంప్ ఆఫీసులో కలిసి శ్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం చనుబండ, కృష్ణారావు పాలెం, నరసింహారావు పాలెం, పర్వతాపురం తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. మంత్రి పార్థసారథి సానుకూలంగా స్పందించారని నూజివీడు డిపో మేనేజర్ తో మాట్లాడారని మంగళగిరి నుండి విస్సన్నపేటకు వచ్చే ఎయిమ్స్ బస్సును విస్సన్నపేట నుండి చనుబండ వరకు పొడిగించాలని చెప్పినట్లు ఆయన వివరించారు. అదేవిధంగా విజయవాడ మెట్రో బస్సులను చనుబండ వరకు పొడిగించే విధంగా మాట్లాడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా త్వరలో విజయవాడ డిపో మేనేజర్ తో మాట్లాడి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈసీసీఎస్ సమావేశం

.అత్తిలి– అక్టోబర్ 6 ( ప్రభాత వార్త): అత్తిలి మండలం తిరుపతిపురం సెక్టర్ ఉరదా ళ్ల పాలెం గ్రామంలో పోషణ మహోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీలక్ష్మి, పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో ఈసీ సీఈ సమావేశం నిర్వహించారు. నవచేతన పిల్లలకు విద్యను అందించే విధానాన్ని పోషకాహారం గురించితెలిపారు. ఆధార శీల విద్యార్థులకు విద్యను అందించే విధానాన్ని పోషకాహారం అందించే విధానం, ప్రీ స్కూల్ పిల్లలకు కార్నర్స్ గురించి తెలియజేశారు. భాషాభివృద్ధి,శరీర అభివృద్ధి, గణితాభివృద్ధి, మేధావివృద్ధి, సాంఘిక అభివృద్ధి, గురించి కూడా వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు సి హెచ్ ఆర్ కే కుమారి,జిఎన్ జ్యోతి, ఎం వెంకటలక్ష్మి, ప్రి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి.

అత్తిలి/ తాడేపల్లిగూడెం– అక్టోబర్ 6( ప్రభాత వార్త): ఈనెల 10 న ఉదయం 10 గంటలకు భీమవరం జువ్వలపాలెం రోడ్ లో గల ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియం లో , ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్,ఎస్. శాంతిప్రియ, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, చదలవాడ నాగరాణి, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ నేతల మోహనరావు సంయుక్తంగా పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తాడేపల్లిగూడెం యూనిట్ ప్రధాన కార్యదర్శి వై వి సత్యనారాయణమూర్తి తెలిపారు. డిపార్ట్మెంటల్ డి డి ఓ లకు సంబంధించిన పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తారని తెలిపారు. పెన్షన్ సమస్యలు గల పెన్షనర్ లు తమ సమస్యలకు సంబందించిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ తో సహా హాజరై తక్షణ పరిష్కారం పొందా లని కోరారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఈసీసీఎస్ సమావేశం.

అత్తిలి– అక్టోబర్ 6 ( ప్రభాత వార్త): అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో పోషణ మహోత్సవాలలో భాగంగా ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీలక్ష్మి, పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో ఈసీ సీఈ సమావేశం నిర్వహించారు. నవచేతన పిల్లలకు విద్యను అందించే విధానాన్ని పోషకాహారం గురించితెలిపారు. ఆధార శీల విద్యార్థులకు విద్యను అందించే విధానాన్ని పోషకాహారం అందించే విధానం, ప్రీ స్కూల్ పిల్లలకు కార్నర్స్ గురించి తెలియజేశారు. భాషాభివృద్ధి,శరీర



అభివృద్ధి, గణితాభివృద్ధి, మేధావివృద్ధి, సాంఘిక అభివృద్ధి, గురించి కూడా వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు సి హెచ్ ఆర్ కే కుమారి,జిఎన్ జ్యోతి, ఎం వెంకటలక్ష్మి, ప్రి

## ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్



వేలేరుపాడు, అక్టోబర్ 6, ప్రభాత వార్త : వేలేరుపాడు మండలంలోని మారుమూల కొండ ప్రాంతంలో ఉన్న మోదలు గ్రామాన్ని సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు (న్యూఢిల్లీ) హుస్సేన్ నాయక్ పరిశీలించారు.గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు వారి పక్క ఇల్లు నిర్మించి గ్రామానికి వెళ్లేందుకు రహదారిని నిర్మించాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. మండలంలోని ఈ గ్రామాన్ని బుట్టాయిగూడెం మండలంలోకి మార్చేలా చూడాలని గ్రామస్తులు ఆయన్ను కోరారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని,తమ కార్యాలయంకు ఎటువంటి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడతామని ఆయన తెలియజేశారు. దేశంలోని మొట్టమొదటిసారిగా గిరిజన మహిళను రాష్ట్రపతి గా నియమించిన ఘనత నరేంద్ర మోదీ నాయకత్వం లో భారతదేశానికే దక్కుతుందన్నారు. చట్టాల పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉంటే సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని అన్నారు.



## ఈనెల 13వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు,



పెనుమంట్ర ప్రభాతవార్త : మండలంలోని మార్టేరు (శివరాపేట) గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి సోమవారం (ఈనెల 06వ తేదీ) జరగవలసిన ఉండగా అనివార్య కారణాల వల్ల రద్దు అయినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తేతలి రాజారెడ్డి తెలిపారు. ఈ ఊరేగింపు మరల 13వ తేదీ సోమవారం నిర్వహించనున్నామని తెలిపారు. అదేవిధంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## చాట్రాయి అంబులెన్స్ లేక మూడు మాసాలు

### - మర్మతులకు వెళ్లిందంటున్న అధికారులు

### - ఆపద సమయంలో ప్రజల అవస్థలు

చాట్రాయి,అక్టోబర్ 6, ప్రభాతవార్త : కాట్రాయ్ మండలానికి సంబంధించిన అంబులెన్స్ లేక మూడు మాసాలు పూర్తయింది. మర్మతులకు వెళ్లిందని అధికారులు చెప్తుండగా ప్రజలకు ఆపద సమయంలో అందుబాటులో అంబులెన్స్ లేక నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఉపయోగపడే అంబులెన్స్ మరమ్మతుల కోసం మూడు నెలలు పాటు లేకుండా ఉండటం పై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లాకు మారుమూల మండలమైన చాట్రాయి మండలంలో అంబులెన్స్ లేకపోతే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. గత మూడు మాసాల నుండి తీవ్ర అస్వస్థకు గురైన వారు 108కు ఫోన్ చేస్తే చాట్రాయ్ అంబులెన్స్ లేదని విసన్నపేట నుండి గాని చింతలపూడి నుండి గాని వస్తుందని సమాధానం చెబుతున్నారని అక్కడనుండి చాట్రాయికి వచ్చేసరికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇటీవల చెన్నంపేటలో పాముకాటుకు ఓ మహిళ గురికాగా అంబులెన్స్ లేకపోవడంతో చాట్రాయి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేసరికి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి





ఏర్పడింది. ఈ విధంగా మండలంలో అన్ని గ్రామాల ప్రజలు అంబులెన్స్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ప్రాణాలు కాపాడే అంబులెన్స్ కు మరమ్మతులు చేయడం పై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ఉన్నతాధికారులు స్పందించి అంబులెన్స్ కు మర్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## జీఎస్టీ హేతుబద్ధీకరణతో పేదలకు ప్రయోజనం

భీమవరం అక్టోబర్ 6ప్రభాతవార్త :జీఎస్టీ హేతుబద్ధీకరణతో పేదలకు ప్రయోజనమని టౌన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ కె శ్రీనివాస్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పన్ను తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఆహార పదార్థాలు, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలు వంటి నిత్యావసరాలపై పన్ను భారం తగ్గాయన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో 99 శాతం వస్తువులు 5 శాతం జీఎస్టీ పరిధిలోకి వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో రైల్వే టీసీ కె ప్రభాకర్, ఎం పల్లారావు, వి అది నారాయణ ప్రయాణీకులు పాల్గొన్నారు



## ప్రజా సమస్యల వేదికలో నాలుగు అర్జీలు స్వీకరణ

### ఎంపీడీవో త్రిశూల పాణి

**మొగల్తూరు అక్టోబర్ 6 ( ప్రభాతవార్త) :** మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో నాలుగు అర్జీలు స్వీకరించినట్లు ఎంపీడీవో సి.హెచ్. త్రిశూలపాణి తెలిపారు. అర్జీలు సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని కోరుతూ పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో మేడిద నవీన్ కిరణ్,డిప్యూటీ తాసిల్దార్ సంధ్య, ఏవో అబ్దుల్ రహీం, ఆర్డబ్ల్యూసీ మోహన్ రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ్ కుమారి, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.



## పూర్వజన్మ సుకృతమే దేవాలయనిర్వహణ పదవులు -ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం అక్టోబర్ 6ప్రభాతవార్త పూర్వజన్మ సుకృతం వల్లే దేవాలయాల సేవచేసే పదవులు వస్తాయని, పరమేశ్వరుని సేవామహాడభాగ్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పంచారామ క్షేత్రం భీమవరం శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. దేవస్థాన చైర్మన్ గా చింతలపాటి బంగార్రాజు, సభ్యులుగా బ్రహ్మజ్యోసుల సత్య ప్రసాద్, బొచ్చ కృష్ణవేణి, పడమటి లీలా కుమారి, కృష్ణపాల వెంకట రామ, సాయి నాగేంద్ర విజయ లక్షీకుమారి, యార్లగడ్డ రమేష్, బండి రమణ, పోతునూరి శ్యామ్, పెద్దింటి జ్యోతిమయి, కొప్పర్తి విజయ కుమార్ లు ప్రమాణ స్వీకారం చేశారు.




# 'రాజాసాబ్' ట్రైలర్‌కు బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్

రెబల్ స్టార్ ప్రభాస్ "రాజా సాబ్" ట్రైలర్ కు బ్లాక్ బస్టర్ రెస్పాన్స్, ఇక మిగిలింది బాక్సాఫీస్ రికార్డ్స్ వేటే ఒబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా మూవీ "రాజా సాబ్" ట్రైలర్ రీసెంట్‌గా రిలీజై బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ సినిమా మీద అప్పటికే స్కై రేంజ్ ఎక్స్ పెక్టేషన్స్ ఉండగా..ట్రైలర్ రిలీజ్ తర్వాత ఈ అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. ట్రైలర్‌లో రెండు డిఫరెంట్ షేడ్స్ లో ప్రభాస్ కనిపించిన తీరు రెబల్ ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసింది. టెర్రిఫిక్ రాజా సాబ్ క్యారెక్టర్ తో పాటు వింటేజ్‌లుక్‌లో ప్రభాస్ వెర్సటైల్‌గా కనిపించి ఆకట్టుకున్నారు.రాజా సాబ్ ట్రైలర్‌లో కనిపించిన వరల్డ్ క్లాస్ మేకింగ్ క్వాలిటీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ స్టాండర్డ్స్ ను చూపించింది. దర్శకుడు మారుతి ప్రభాస్ తో వన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ అనిపించే సినిమా రూపొందించినట్లు రాజా సాబ్ ట్రైలర్ ప్రూవ్ చేస్తోంది. తనకు ఇష్టమైన రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో తన ఫేవరేట్ హీరో ప్రభాస్ ను మారుతి వెర్సటైల్‌గా చూపించారు. తమన్ బీజీఎంలోని వేరియేషన్స్ రాజా సాబ్ ట్రైలర్ కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి.ముగ్గురు హీరోయిన్స్ మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ రాజాసాబ్‌కు కావాల్సినంత గ్లామర్ ను యాడ్ చేస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి9న థియేటర్స్ లోకి రాబోతున్న రాజా సాబ్ కోసం టాలీవుడ్ బాక్సాఫీస్ ఎదురుచూస్తోంది. ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ రాజా సాబ్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులు రాజాసాబ్ ను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేందుకు వెయిట్ చేస్తున్నారు .

# 2025లోనే హైయెస్ట్ గ్రాసింగ్ మూవీ..!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం 'ఓజి'. మన తెలుగు సినిమా నుంచి ఎలాంటి ఓపెనింగ్స్ అందుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఒక్క సరైన సినిమా పడితే పవర్ స్టార్ పవర్ ఏంటో చూపించిన సినిమా ఇది. ఇలా 150 కోట్లకి పైగా ఓపెనింగ్స్ తో మొదలైన మోత ఇపుడు టాలీవుడ్‌లో ఈ ఏడాది హైయెస్ట్ గ్రాసర్ గా నిలిచి దుమ్ము లేపింది. దీనితో ఓజి చిత్రం భారీ గ్రాసర్ గా ఇప్పుడు నిలిచింది అని చెప్పాలి. ఈ ఏడాదిలో తెలుగు నుంచి బిగ్గెస్ట్ గ్రాసర్ గా 303 కోట్లకి పైగా గ్రాస్ తో వెంకీ మామ సంక్రాంతికి వస్తున్నాం నిలిచింది.

మరి దానిని క్రాస్ చేసి ఓజి సరికొత్త గ్రాసర్ గా నిలిచి అదరగొట్టింది అని మేకర్స్ నుంచి వచ్చిన అప్డేట్ తో కన్ఫర్మ్ అయ్యింది.లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ ఓజీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రెస్పాన్స్ అందుకుందో అందరికీ తెలిసిందే.

పవర్ స్టార్‌ను ఎలాగైతే చూడాలని అభిమానులు కోరుకున్నారో అలాగే చూపెట్టాడు దర్శకుడు సుజీత్. ఇక ఓజీతో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల సునామీ సృష్టించాడు పవన్ కళ్యాణ్.

11 రోజుల ముగిసే సరికి ఈ మూవీ వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.308 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్ళు కలెక్ట్ చేసినట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. దీంతో ఈ సినిమా రూ.300 కోట్ల క్లబ్‌లోకి అధికారికంగా ఎంట్రీ ఇచ్చింది. ఈ వసూళ్లతో 2025లోనే హైయెస్ట్ గ్రాసింగ్ తెలుగు సినిమాగా ఓజీ సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.

పవన్ పవర్‌ఫుల్ యాక్షన్‌కు థమన్ సాలిడ్ సంగీతం అండగా నిలిచింది. ఇమ్రాన్ హష్మి, ప్రియాంక మోహన్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్, అర్జున్ దాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రొడ్యూస్ చేశారు .

## తెర



# డైట్ పై రాశి ఖన్నా క్రేజీ కామెంట్స్ !

గ్లామర్ హీరోయిన్ రాశిఖన్నా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పింది. ముఖ్యంగా తాను గతంలో లావు ఉండేదాన్ని అని ఆమె తెలిపింది. ఈ విషయం గురించి రాశిఖన్నా ఇంకా మాట్లాడుతూ.,చిన్నప్పట్నుంచి నాకు ఫుడ్ అంటే ఇష్టం. పరాఠా, మఖాన్ బాగా తినేదాన్ని. అందుకే లావుగా ఉండేదాన్ని. సినిమాల్లోకి వచ్చిన తర్వాత స్క్రీన్‌పై అందంగా కనిపించాలి. మొదట్లో నాకు ఇది అర్థం కాలేదు. ఆ తర్వాత అర్థమైంది అని రాశి ఖన్నా తెలిపింది.రాశి ఖన్నా ఈ విషయం గురించి ఇంకా మాట్లాడుతూ,నాకు నేనే లావుగా కనిపించాను. తగ్గాలని నిర్ణయించుకున్నాను. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే మెల్లగా తగ్గాలనుకున్నాను. జిమ్ కు వెళ్లడం ప్రారంభించాను. ఇప్పుడు నా జీవితంలో జిమ్ ఓ భాగమైపోయింది. ఐతే, స్లిమ్ గా మారే క్రమంలో నేను డైట్ మార్చలేదు. చిన్నప్పట్నుంచి ఏవి తింటున్నానో, వాటినే ఇప్పుడు కూడా తింటున్నానని, కానీ అన్నీ కొంచెం కొంచెం తింటున్నానని రాశి ఖన్నా చెప్పుకొచ్చింది.

# 'వాషింగ్టన్ సుందర్' తొలిసాంగ్ రిలీజ్



సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'వాషింగ్టన్ సుందర్' తొలిసాంగ్ రిలీజ్ సత్య వినుగొండ, అనుశ్రీ, శీతల్ భట్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్' యస్.యస్. మూవీ కార్పొరేషన్ బ్యానర్ పై బిపేట ప్రేమ్ కుమార్ సమర్పణలో నిర్మిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సిద్ధపడుతున్నారు. సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి నందన్ రాజ్ బొబ్బిలి చక్కటి సంగీతాన్ని అందించారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మొదటి సాంగ్‌ని సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు సత్య వినుగొండ మాట్లాడుతూ,చిన్నప్పుడు తన సొంత ఊరును వదిలిపెట్టి పారిపోయిన కుర్రాడు మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఆ ఊరికి ఎందుకొచ్చాడు? వచ్చిన ఆ కుర్రాడు ఆ ఊరికి ఏం చేశాడు? మళ్లీ తన సొంత ఊరును వదిలి హైదరాబాద్‌కు ఎందుకు వెళ్ళిపోయాడు? అనేదే 'వాషింగ్టన్ సుందర్' సినిమా కథ. ఈ సినిమాకి ప్రధానంగా సంగీతం హై లైట్ కానుంది. నందన్ రాజ్ బొబ్బిలి చక్కని సంగీతాన్ని అందించారు. ఈ చిత్రంలో నటించిన చక్కటి నటీనటులు అందరూ తమా తమ పాత్రల్ని సమర్థవంతంగా పోషించారు. సినిమా ఆద్యంతం హాయిగా సాగుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఈ 'వాషింగ్టన్ సుందర్'. పక్కాగా మాస్‌తో మేళవించిన చక్కటి ఎంటర్ టైనర్ అని చెప్పొచ్చు. నిర్మాణానంతర పనులన్నీ పూర్తి చేసుకొని అతిత్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అని తెలిపారు. ఈ సినిమాకి డీఓపీ : మధు బసిరెడ్డి, శ్రీనివాస్ విన్నకోట, ఎడిటర్ : మేనగ శ్రీను, కోరియోగ్రఫీ : గణేష్ మాస్టర్, ఫైట్స్ : నందూ, డిఐ : యమ్ బి ప్రకాష్. 5.1 కాళీఎస్.ఆర్ అశోక్, సహ నిర్మాతలు : అంజయ్య దన్నారం, జీవన్ రెడ్డి పోతులూరి, అనిల్‌కుమార్ గుజ్జరి.

# సూర్యతేజ బర్త్ డే రోజు 'మన ఊరి ప్రేమాయణం' లోగో లాంచ్

టాలీవుడ్ హీరోవిక్టరీ వెంకటేష్ వీరాభిమాని అయిన సూర్యతేజ పసుపులేటి కథానాయకుడిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి కెరటంలా దూసుకొస్తున్నారు. ఆయన హీరోగా స్వీయ నిర్మాణ దర్శకత్వంలో 'మన ఊరి ప్రేమయాణం' అనే చిత్రం తెరకెక్కుతోంది. అలమేలుమంగమ్మసమర్పణలో రూపొందుతున్న ఈచిత్రానికి సంబంధించిన టైటిల్,లోగోని హీరో సూర్యతేజ పసుపులేటి జన్మదినోత్సవం సందర్భంగా ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమం లో ప్రఖ్యాత సీనియర్ నటుడు సుమన్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నిర్మాత కె.ఎన్ రాజు, డీఓపీ ఎడిటర్ ఉదయ్‌కుమార్ జి. ప్రముఖ నిర్మాత రామసత్యనారాయణ మూవీ టీమ్ తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సూర్యతేజ పసుపులేటి మాట్లాడుతూ, 'మన ఊరి ప్రేమయాణం' ఓ చక్కటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా రూపొందింది. అన్నివర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ప్రేక్షకులకు కనువిందు చేయనున్నాయి. నా జన్మదినోత్సవం సందర్భంగా ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత సీనియర్ నటుడు హీరో సుమన్ టైటిల్, లోగోని లాంఛ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే నిర్మాతలుకె.ఎన్‌రాజు, రామ సత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించడం మరచిపోలేను. హీరోగా వస్తున్న నన్ను ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపకుంటున్నాను. ఇక సినిమా విషయానికొస్తే. ఇంటిల్లిపాదినీ ఆకట్టుకునే చిత్రమిది. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ తమతమ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే అంశాలతో ఈ 'మన ఊరి ప్రేమ యాణం' తెరకెక్కింది. ఎక్కడా రాజీ పడకుండా.. ప్రేక్షకులు శబాష్ అనేలా అన్ని హంగులతో అందమైన ప్రదేశాల్లో చిత్రీకరణ జరుపుకుంది. ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ సినిమా చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు, నిర్మాత, దర్శకత్వం : సూర్యతేజ పసుపులేటి, నిర్మాత: కె.ఎన్ రాజు, డీఓపీ : ఎడిటర్ : ఉదయ్‌కుమార్ జి. సంగీతం : శ్రీ వెంకట్,



# బ్యాడ్‌బాయ్ టీజర్ రిలీజ్



హీరో నాగశౌర్య కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్‌బాయ్ కార్తీక్‌లో పవర్ ఫుల్ పాత్రలో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఆయన బర్త్ డే సందర్భంగా విడుదలైన అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేశారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. మేకర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ నాగ శౌర్యను రగ్గడ్, ఇంటెన్స్ స్టైలిష్ న్యూ అవతార్‌లో ప్రజెంట్ చేస్తుంది. యాక్షన్ సన్నివేశాలు, హైఆక్టేన్ మూమెంట్స్‌తో మాస్ పాత్రలో పరిచయం చేస్తోంది. ఈ టీజర్‌లో శౌర్యతో పాటు విధి, సముద్రఖని, నరేష్ వికె, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రంలో ఇంటెన్స్ డ్రామా, హ్యూమరస్ కామెడీ కలగలిసి ఉన్నాయి. నాగశౌర్య స్క్రీన్ ప్రెజెన్స్, షార్ప్ డైలాగ్ డెలివరీ, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్ అదిరి పోయింది. వెన్నెల కిషోర్ క్యారెక్టర్ మంచి హ్యూమర్ ని ప్రామిస్ చేస్తోంది. దర్శకుడు రామ్ దేసినా అద్భుతమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను అందించారు. రసూల్ ఎల్లోర్ డైనమిక్ సినిమాటోగ్రఫీ బ్రిలియంట్ గా వుంది. హారిస్ జయరాజ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ ఎమోషన్‌ని మరింత ఎలివేట్ చేసింది. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా వున్నాయి.

బ్యాడ్ బాయ్ కార్తీక్ త్వరలో బిగ్ స్క్రీన్స్ లోకి రానుంది. నటీనటులు: నాగశౌర్య, విధి, సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్‌తదితరులు.

# 'ట్రాన్ ఆరెస్' సరైన సమయంలో వస్తుంది

డిస్నీ రాబోయే సైఫై చిత్రం ట్రాన్: ఆరెస్ ఈ వారంలో థియేటర్లలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. దీని ప్రధాన థీమ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కావడంతో, లీడ్ యాక్టర్ జారెడ్ లెటో ఈ చిత్రం 'సరైన సమయంలో' వస్తుందని నమ్ముతున్నారు.లండన్ ప్రీమియర్ సమయంలో జారెడ్ డిజిటల్ స్పైతో మాట్లాడుతూ, "ఒక విధంగా చూస్తే, ఎఐ ఒక పెద్ద సంభాషణగా మారిన సరైన సమయంలో వస్తుంది. మేము ఈ సినిమా పై 910 సంవత్సరాల క్రితం పని చేయడం మొదలుపెట్టాము. అప్పుడు ఎఐ గురించి ఎవరూ మాట్లాడేవారు కాదు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ దాని గురించి మాట్లాడుతున్నారు. ప్రతి ఒక్కరూ దాన్ని ఉపయోగిస్తున్నారు. వారు తెలిసినా లేదా తెలియకపోయినా, అది మన జీవితాల్లో ఏదో ఒక రూపంలో భాగమైపోయింది. కాబట్టి ఈ సినిమా ఈ సమయంలో వస్తుండటం ఆసక్తికరంగా ఉందని నేను భావిస్తున్నాను" అని చెప్పారు.

జారెడ్ దాదాపు ఒక దశాబ్దం పాటు ఈ ప్రాజెక్ట్‌తో సంబంధం ఉన్నవారు. అతని కోస్టార్ జోడీ టర్నర్‌స్మిత్ ఈ చిత్రం ఎఐఎథిక్స్ అన్వేషణ ప్రొడక్షన్ సమయంలో మరింత సమయోచితంగా మారిందని పేర్కొన్నారు. జోడీ మాట్లాడుతూ, "మేము దీన్ని ఒకటిన్నర సంవత్సరాల క్రితం షూట్ చేశాము. దీన్ని ఒక విధంగా ముందుగా చూసేలా చేశారు అని వివరించారు.

"సినిమా మొదట్లో ఉన్నప్పుడు మేము ఎఐ సంభాషణలో లేము. అంటే, జారెడ్ దాదాపు ఒక దశాబ్దం పాటు ఈ బౌల్డర్‌ను కొండ మీదకు నెట్టుతున్నాడు. కానీ వారు ఈ సినిమాను ప్రస్తుతం, సంబంధితంగా ఉన్న సంభాషణలో ఉంచడంలో విజయవంతమయ్యారు. అది నిజంగా అద్భుతం అన్నారు.జోడీ మరింత చెప్పుతూ "ప్రపంచస్థితిలో ఎఐకి, మాకు ఏ జవాబులు లేవు. కానీ మేము ప్రశ్నలో జీవిస్తున్నాము. మేము ప్రజలను మాతో పాటు ఎథిక్స్ గురించి, ఎఐని మానవ కేంద్రీకృతంగా ఎలా ఉంచాలి అనే ప్రశ్నలో ఉండమని అడుగుతున్నాము." ఆమె" అది అంతా డూమ్, గ్లూమ్ కావాల్సిన అవసరం లేదు అని చెప్పారు. మానవులు ఎఐని "ప్రపంచాన్ని మంచిగా మార్చడానికి ఉపయోగించగలిగితే అన్నారు.ఈ టెక్నాలజీ ఎవాన్ పీటర్స్ నటించిన జూలియన్ డిల్లింజర్ వంటి ఎథిక్స్ లేని వ్యక్తి చేతిలో ఉంటే ఏమవుతుంది. కాబట్టి ఇది గొప్పది, సంబంధితమైనది, ప్రస్తుతమైనది, ముఖ్యమైనది.జారెడ్ లెటో, జోడీ టర్నర్‌స్మిత్, గ్రెటాలీ, ఎవాన్ పీటర్స్, హసన్ మిన్హాజ్, జెఫ్ బ్రిడ్జెస్ నటించిన ట్రాన్. ఆరెస్ 2025 అక్టోబర్ 10న ఇండియన్ థియేటర్లలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది.



# 'సీతా పయనం' నుంచి ప్రిన్స్ ధ్రువ ఫస్ట్ లుక్



మల్టీ ట్యాలెంటెడ్ అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ సీతా పయనం. శ్రీరామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య,అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ రోజు ధ్రువ సర్జా బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఆయన ఫుల్ ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. ధ్రువ సర్జాని యాక్షన్ హాల్క్ ప్రజెంట్ చేసిన ఫస్ట్‌లుక్ అదిరిపోయింది.ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పాటలు చార్ట్‌బస్టర్ హిట్ అయ్యాయి. ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్‌రాజ్, కోవైసరళ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. డిఓపి: జి బాలమురుగన్, ఎడిటర్ : అయూబ్ ఖాన్, డైలాగ్స్: సాయిమాధవ్ బుర్రా.తారాగణం: ఐశ్వర్యఅర్జున్, నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్‌రాజ్, కోవై సరళ, అర్జున్, ధ్రువసర్జా.సాంకేతికబృందం:కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం: అర్జున్‌సర్జా,బ్యానర్: శ్రీరామ్. ఫిల్మ్స్ : ఇంటర్నేషనల్: సంగీతం: అనుప్ రూబెన్స్ డిఓపి: జి బాలమురుగన్‌ఎడిటర్: అయూబ్ ఖాన్ డైలాగ్స్: సాయి మాధవ్ బుర్రా సాహిత్యం: చంద్ర బోస్, కాసర్లశ్యామ్,పీఆర్వో: వంశీశేఖర్ : డిజిటల్ మార్కెటింగ్: ఫస్ట్ షో.

# 'ది ప్యారడైజ్ ' కోసం రాఘవ్ జూయాల్ రెడీ !




ఇప్పుడు నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ది ప్యారడైజ్ ' చిత్రంలో కూడా రాఘవ్ విలన్ గా నటిస్తున్నాడు. ప్రస్తుతం ది ప్యారడైజ్ షూటింగ్ జోరుగా సాగుతోంది. తాజాగా శ్రీకాంత్ ఓదెల తో రాఘవ్ జూయాల్ స్క్రిప్ట్ రీడింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. రా సీన్స్ ను చూసి రాఘవ్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. ఇక రాఘవ్ జూయాల్ త్వరలో ఈ సినిమా సెట్స్ లో చేరడానికి రెడీగా ఉన్నాడు.కాగా, రాఘవ్ జూయాల్, తన పాత్ర గురించి మాట్లాడుతూ.. దర్శకుడు శ్రీకాంత్ పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇక ఈ చిత్రంలో మోహన్ బాబు కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషలలో ఈ సినిమా విడుదలవుతోంది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్చి 26, 2026న థియేటర్లలో విడుదల కానుంది. కాగా ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

# చేదోడు వాదోడుగా... !



వ్యవసాయంలో పురుషులతో సమానంగా పనిచేస్తారు మహిళలు. కానీ వారి పనికి ప్రాధాన్యం తక్కువ. కొన్నేళ్లుగా ఆ పద్దతిని మారుస్తూ స్త్రీలూ ఈ రంగంలో తమదైన ప్రతిభను కనబరుస్తున్నారు. అలాంటి వారిలో ఒకరు రేఖా కుజూర్. మహిళల్ని ఆర్థికంగా శక్తిమంతం చేయాలనే ప్రభుత్వ ఆశయానికి ముందే... ఛత్తీస్‌గఢ్, కోర్బా జిల్లాలోని బొట్లీ గ్రామంలో ఈ పురోగతి మొదలైంది. దానికి కారణం రేఖనే.

ఈమెకు ముగ్గురు పిల్లలు. పెద్ద అమ్మాయిని రాయ్‌గఢ్‌లోని ఓ కళాశాలలో చేర్చి... అక్కడికి సమీపంలోని వనాన్‌చల్ గ్రామానికి మకాం మార్చారు. ఊరుకాని ఊరిలో కుటుంబాన్ని పోషించాడానికి భర్త పడుతున్న కష్టాన్ని చూసి... తనకు చేదోడుగా ఉండాలనుకున్నాడు. అందుకు వ్యవసాయాన్ని సాధనంగా ఎంపిక చేసుకున్నారు. ఐదుఎకరాల భూమిలో సాగు మొదలు పెట్టారీమె. జీతం సరిపోక అప్పు కోసం చేయాల్సి న పరిస్థితి తెలిసిన వారు కూడా డబ్బులడుగుతాం మొహం చాటేసేవారు. ఈ అరకొర జీతాలతో ఇల్లు గడవడం కష్టమని అర్థమైంది. అందుకని పనిచేయాలనుకున్నా. అప్పుడే నాబార్డ్ తోటల పెంపకం ప్రారంభించింది. 2014లో మామిడి మొక్కల్ని నాటాను. పొదుపు గ్రూపులో రూ.లక్ష రుణం తీసుకుని అంతర పంటలుగా బత్తాయి, నిమ్మ, సీతాఫలం, జీడి మొక్కల్ని వేశాను. ఇలా ఎనిమిది నుంచి తొమ్మిది పంటలు ఏకకాలంలో పండిస్తున్న మహిళగా నాకు గుర్తింపు వచ్చింది. ఆ స్ఫూర్తితోనే సాగు తరగతులకు హాజరై... కూరగాయలు పండించడాన్నీ తెలుసుకున్నా. ఆ నైపుణ్యంతో ఆకుకూరలు, టొమాటో, అల్లం, పచ్చిమిర్చి, వంకాయ వంటి వాటిని సాగు చేయడం మొదలుపెట్టారు. నా భర్త సహాయంతో పశుపోషణ కూడా ప్రారంభించా, మేకల పెంపకంతో మొదలై... ఇప్పుడు కోళ్లూ, గొర్రెలూ, బాతులూ, పందులూ వరుసగా పెంచుతున్నా. ఇంటి వెనకున్న చిన్న చెరువులో చేపల్ని కూడా పెంచుతున్నా. కొద్ది కాలంలోనే అన్నీ మంచి ఫలితాలను ఇచ్చాయి. ఇప్పుడు నా కుటుంబానికి సరిపడా ఆహారాన్ని నేనే పండించగలుగుతున్నా. మిగిలింది అమ్మి, ఆదాయం పొందుతున్నా. వీటన్నింటి కోసం రేయింబవళ్లు శ్రమించా. నా భర్త. పిల్లలు వీలున్నప్పుడు సహాయం చేసేవాళ్లు అనే రేఖకు అక్కడి ప్రభుత్వం ఉత్తమ మహిళా రైతు పురస్కారంతో సత్కరించింది. అంతేకాదు, కొత్తగా ఆర్థిక స్వావలంబన కోసం ప్రయత్నించాలనుకునే మహిళలకు ఈమె విజయాన్నే పాఠంగా చెపుతున్నారు నాబార్డ్ అధికారులు. ఆమె గ్రామంలోనే కాకుండా, చుట్టు పక్కల గ్రామాలూ, జిల్లాల మహిళలకూ వ్యవసాయంలో మెలకువలను నేర్పుతున్నారు. ◻

# ఖైదీల్లో మానసిక మార్పు కోసం !

**పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు. నేరం చేసి జైలు జీవితం గడుపుతున్న చాలామంది ఖైదీలు ఇలాంటి పశ్చాత్తాప భావనకే లోనవుతారు. తాము చేసిన తప్పును సరిదిద్దుకొని సమాజంలో తలెత్తుకొని జీవించాలనే ఇలాంటి ఖైదీలకు పునరావాసం కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నారు 83 ఏళ్ల అరుణా సరీన్.**



ఏళ్లకేళ్లుగా జైల్లో మగ్గుతోన్న ఖైదీల్లో సత్ప్రవర్తన నింపేందుకు గత పాతికేళ్లుగా వారికి యోగా పాఠాలు చెబుతున్నారామె. ఈ విధంగానే రోజూ ఉదయం మూడు గంటల పాటు తానూ జైల్లోనే గడుపుతున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 50 వేల మంది ఖైదీల్లో సానుకూల మార్పు తీసుకొచ్చిన ఈ యోగా టీచర్ స్ఫూర్తిదాయక ప్రయాణం మీకోసం..!

**ఖైదీల పునరావాసంలో భాగంగా..** శిక్ష కాలంలో వారికి వివిధ వృత్తి నైపుణ్యాలు నేర్పించడం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, జీవనోపాధి అవకాశాలను చూపించడం.. శిక్షణ పొందుతున్నారు. ఈ కోరనే వాళ్లలో సత్ప్రవర్తనను పెంపొందిస్తూ.. సమాజంలో తలెత్తుకునేలా చేయడం దీని ముఖ్యోద్దేశం. ఇలా నాలుగ్గోడల మధ్య మగ్గుతున్న ఖైదీలకు యోగా పాఠాలు చెప్పడం కూడా ఇందులో ఓ భాగమే! గత పాతికేళ్లుగా ఈ పనిలోనే నిమగ్నమయ్యారు అరుణ.



**......అలా తొలిసారి జైలుకెళ్లా!**

అయితే ఈ మధ్యలోనే తన భర్త మరణించడంతో మానసిక వేదనకు గురైన అరుణ.. ఈ ధ్యాన ప్రక్రియతోనే ఈ బాధ నుంచి బయటపడ్డానంటోంది.

యోగా, ధ్యానం.. వంటి వ్యాయామాలు మన మానసిక ఆరోగ్యాన్ని ఎలా పెంచుతాయో నా భర్త చనిపోయినప్పుడు అనుభవపూర్వకంగా తెలుసుకున్నా. ఈ బాధ నుంచి బయటపడి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్న శాఖ.. ఈ సంస్థ ఢిల్లీకి చెందిన ఓ టీచర్ జబల్ వచ్చింది. ఈ సమయంలోనే స్థానికంగా ఉన్న జైల్లో యోగా తరగతులు నిర్వహించారు. నన్ను తనతో చేరమని ప్రోత్సహించారు. అలా జైల్లోకి అడుగుపెట్టడం, ఖైదీల్ని కలుసుకోవడం అదే తొలిసారి. ఆ వాతావరణం నన్ను భయపెట్టలేదు సరికదా.. అక్కడికెళ్లాక ఒక రకమైన ఆత్మీయ భావన నాకు కలిగింది. ఆపై యోగా తిరిగే సెషన్ పూర్తి చేసుకొనివచ్చేశాం. ఇలా ఖైదీల్లో స్ఫూర్తి నింపే ఈ ప్రయత్నం సాకెంతో నచ్చింది. ఆంటోన్న అరుణ.. ఖైదీలకు యోగా పాఠాలు చెప్పడానికి ఈ సందర్భమే ప్రేరణ అని అంటున్నారు.

**రోజూ మూడు గంటలు..** ప్రస్తుతం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ నిర్వహిస్తున్న 'ప్రిజన్ ప్రోగ్రామ్'లో భాగమైన అరుణ.. ఈ నేపథ్యంలోనే మధ్యప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న జైళ్లలోని ఖైదీలకు యోగా పాఠాలు నేర్పుతున్నారు. తొలుత జబల్‌పూర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ సెంట్రల్ జైలులోని ఖైదీలకు యోగా పాఠాలు బోధించాను. ఇప్పుడు ఈ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 జైళ్లలోని ఖైదీలకు యోగాతో పునరావాసం కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాధారణంగా ఉదయాన్నే చాలామంది గుడికి వెళ్తారు.. కానీ నేను జైలుకు వెళ్తాను. ఆదివారాలు, ప్రభుత్వ సెలవులు మినహాయిస్తే.. రోజూ దాదాపు మూడు గంటల పాటు ఖైదీలతోనే సమయం గడుపుతా. ఈ విధంగానే వాళ్లతో వివిధ రకాల యోగాసనాలు సాధన చేయిస్తా. అలాగే ధ్యానం, శ్వాస సంబంధిత వ్యాయామాలు.. వంటివీ 3 నేర్పిస్తా. అందరిలో ఒత్తిడి, యాంగ్జైటీ, ఆందోళనలను దూరం చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్నీ " పెంపొందిస్తాయి. అంటున్నారు అరుణ.

**వేలాది మంది రాతలు మార్చి..!** 'ఆర్ట్ ఆఫ్ లివిఖింగ్ చేపట్టిన 'ప్రిజన్ ప్రోగ్రామ్' దేశవ్యాప్తంగానే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల జైళ్లలో మగ్గుతున్న లక్షలాది మందిలో స్ఫూర్తి నింపుతోంది. వీళ్లలో సుమారు 50 వేల మందికి తన యోగా పాఠాలతో చేరువయ్యారు అరుణ. అయితే ఈ శిక్షణలో చాలామంది మంచి మార్పులు తీసుకొచ్చినట్లు అనుభవపూర్వకంగా చెబుతున్నారీ యోగా టీచర్. ◻

# ఇంటర్వ్యూలో ఇలా వద్దు..



కొంతమందికి ఇంటర్వ్యూ అంటేనే భయం, ఆందోళనలతో చెమటలు పడుతుంటాయి. మరి ఈ సమస్య నుంచి బయట పడేదెలా అంటారా.. ఈ చిట్కాలు మీ కోసమే.

✦ చాలామంది ఇంటర్వ్యూకి కొన్ని రోజుల ముందే అన్నీ చదువుకుని, ప్రాక్టీస్ అయి సిద్ధంగా ఉంటారు. తీరా భయంతో తెలిసిన ప్రశ్నలకీ సమాధానం తప్పుగా చెబుతుంటారు. తరవాత అయ్యో నాకు తెలుసు కదా అనుకుంటారు. దీనికి కారణం వారు మానసికంగా సన్నద్ధం కాలేకపోవడమే. ఇలాంటి సందర్భంలోనే మన బలహీనతలను బలంగా ఉపయోగించుకోగలగాలి. మీకు అంతగా ఇబ్బందిగా ఉంటే నేను అసౌకర్యంగా ఫీలవుతున్నాను అని వారికి చెప్పండి. వారే అర్థం చేసుకుంటారు. లేదా ఇంటర్వ్యూకి వెళ్లే ముందు ఒకసారి అద్దం ముందు సాధన చేయండి. కాస్త భయం పోతుంది.

✦ ఇంటర్వ్యూకి సమయపాలన చాలా ముఖ్యం. ఆలస్యంగా వెళితే మీకు టైమ్ మేనేజ్‌మెంట్ లేదు అనుకుంటారు. ఈ సమయపాలనను బట్టే ఈ ఉద్యోగానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో వారికి తెలుస్తుంది. అందుకే ఎప్పుడైనా ఇంటర్వ్యూకి 15 నిమిషాల ముందు చేరుకోవడం మంచిది. అంతేకాదు, కొన్ని కంపెనీలు దుస్తుల కోడ్ పెడుతుంటాయి. వాటిని తప్పకుండా అనుసరించాలి. ఎందుకంటే మన డ్రెసింగ్‌ని బట్టీ కొన్నిసార్లు ఉద్యోగానికి ఎంపిక చేసే అవకాశం ఉంటుంది.

✦ ఇంటర్వ్యూలో ప్రవర్తన కూడా చాలా ముఖ్యం. కొంతమంది కంగారులో ఫోన్ ఆన్‌లో పెట్టి ఇంటర్వ్యూ గదిలోకి వెళ్తుంటారు. అదేమో అప్పుడే మోగుతుంది. నిర్లక్ష్యంగా పరిగణిస్తారు జాగ్రత్త! ఆదేకాదు అవతలివారు మాట్లాడుతున్నప్పుడు మీరు దిక్కులు చూసినా, అతిగా నవ్వినా క్రమశిక్షణ లేదు అనుకుని రిజెక్ట్ చేస్తారు. కాబట్టి లోనికి వెళ్లేముందే అన్నీ సరిచూసుకోండి. ఇంటర్వ్యూ చేసేవాళ్లపట్ల మర్యాదగా ప్రవర్తించాలి. ◻

# కండ బలానికి..



బరువు పెరగకూడదు. కండ మాత్రం పెరగాలి అనుకుంటున్నారా? అయితే మీరు ఈ మజిల్ ఫుడ్ గురించి తెలుసుకుందాం..

**అవిసులు:** శరీరం కొవ్వుతో నిండిపోయి ఓ ఆకృతింటూ లేకుండా బరువు పెరిగే వారు తగ్గే క్రమంలో



అవిసె

గింజలకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులని పంచే ఒమెగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు ఉంటాయి. ఈ గింజలతో చేసే స్మూతీలు, లడ్డూలు మేలు చేస్తాయి.



**పెరుగు :** పెరుగే కదా అని తక్కువ అంచనా వేయొద్దు. జీర్ణశక్తి పెరగాలన్నా, బరువు తగ్గాలన్నా, ప్రొటీన్ అందాలన్నా పెరుగు తినడమే మేలైన మార్గం.

**బీన్స్:** శాకాహారులకు బి విటమిన్ మొదలుకుని ప్రొటీన్లు, పీచుని అందించి చక్కని కండ బలాన్ని అందించే ఆహారం బీన్స్ గింజలు.

**చికెన్ :** మసాలాలు వేసి వేపుళ్ల రూపంలో ఉన్న చికెన్‌ని కాకుండా.. మసాలా తగ్గించి సలాడ్ పద్ధతిలో తింటే మంచిది. కండబలం పెరుగుతుంది.



**గుడ్లు:** ఆరు నగ్రాముల ప్రొటీన్‌తో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంచే జింక్, క్యాల్షియం, లూటిన్, జియాంతిన్ వంటివన్నీ పుష్కలంగా అందిస్తుంది గుడ్డు. ◻

# ఫోన్ ఎంతసేపు ఇచ్చారు ?



'అమ్మా బోర్ కొడుతోంది'.. ఈ మాట వినగానే చాలామంది 'కాసేపు టివి చూసుకో' అనేస్తారు. స్క్రీన్ చూపించడం ఇష్టం లేని తల్లులైతే ఆటలు ఆడుకోమనో, బొమ్మలు గీయమనో చెబుతారు. సరేనని వెళతారా..మళ్లీ కొద్ది సేపటికే 'బోర్' అంటూ విసిగిస్తారు. మనల్ని పని చేసుకోనివ్వడం లేదనో..బాగా అల్లరి చేస్తున్నారనో చివరికి ఫోన్ టీవిలకు సరేనంటే ఇక ఆ లోకంలో పడి తిండీ నిద్రనీ మర్చిపోతారు. ఇది కాస్త ఊహ తెలిసిన వారి పరిస్థితి.

**ఇక ఏ షాపింగ్‌కో..** రెస్టరంట్‌కో వెళితే.. అకనకడా ఫోన్, ట్యాబ్ ఒళ్లో పెట్టుకుని తలని దాంట్లో దూర్చేసే చిన్నరులే ఎక్కువగా కనిపిస్తారు. ప్రశాంతంగా భోజనం చేయనిస్తారు. కాసేపు విసిగించకుండా ఉంటారని అలా వాటిని చేతిలో పెడతాం. కానీ రంగుల తెరపై ఆడిపాడేఆ బొమ్మలు పిల్లల మెదళ్లపై ఎంత దుష్ప్రభావం చూపుతాయో తెలుసా? ఒకసారి ఫోన్ తీసుకుని చూడండి. కోపంతో చిందులేస్తారు. ఏడ్చి గోల చేసేస్తుంటారు. గోల ఆపుతారని తిరిగి ట్యాబ్ చేతిలో పెట్టగానే మ్యాజిక్ చేసినట్టుగా గోలంతా మాయం అంటే అది వారిని కంట్రోల్ చేస్తోందనేగా అర్థం?

**మనదే కాదు..** ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి మెడికల్ కమ్యూనిటీ వాళ్లు, పాలసీ మేకర్స్ కూడా దీన్నో సమస్యగా చూస్తున్నారు. స్వీడన్ ప్రభుత్వంమైతే పిల్లల స్క్రీన్ సమయం మీద నియమావళినీ రూపొందించిందట. దాని ప్రకారం రెండేళ్లలోపు వారికి ఫోన్ ఇవ్వడానికి లేదు. పెద్దపిల్లలైనా పరిమితికి మించి డిజిటల్ స్క్రీన్ చూపించడం నిషిద్ధమే! ఇవి పిల్లల ఆలోచనలను కట్టేయడమే కాదు..నిద్రకి దూరం చేస్తాయి. డిప్రెషన్‌కీ దారితీస్తాయి. అందుకే అది దూరమైతే కోపం, గోడవ చేయడం, ఏడవడం, ఎదుటివారిని కొట్టడం వగైరా! నిజానికి ఇది పిల్లల్లో ఇతరులపై దాడిచేసే గుణాన్నీ ప్రేరేపిస్తోందట. కాబట్టి బలవంతంగానైనా దూరంగా ఉంచండి అటోంది 'యేనిసెఫ్' ఏడ్చినా, బోర్ కొడుతోందన్నా వాళ్లనలా వదిలేయమంటోంది.

ఈ చర్య కోపాన్నీ చిరాకునీ భరించడం నేరునపతుందట. బోర్ కొట్టడమూ మంచిదేనట. వాళ్లలోంచి సృజనాత్మకతను బయటకు తీస్తుందట. ఇది చెప్పినంత సులువు కాదు. కానీ చేయక తప్పదు. చేస్తారా మరి? ◻

# నోరూరించే సొరకాయ రొట్టె


గుజరాతీల వంటకాలకు ఒక ప్రత్యేక రుచి పరిమళం ఉంటాయి. వాళ్ల ఆరోగ్య సూత్రాలు పాటించడం కొంచెం ఎక్కువే. అందుకే వీలైనప్పుడల్లా మట్టి పాత్రల్లో వండటానికి ప్రయత్నిస్తారు. అన్నిటినీ మించి కారం తక్కువగా వాడతారు. కూరలూ, చిరుతిళ్లూ.. ఏవీ స్పైసీగా ఉండకపోగా కొంచెం తియ్యగానే ఉంటాయి. గుజరాత్‌లో ఇష్టంగా తినే పదార్థాల్లో 8హాండవో' ఒకటి. ఇది సొరకాయతో చేసే రొట్టె. తమ తమ ఇష్టాన్ని బట్టి ఇతర దుంపలు, కూరగాయలు జతచేస్తారు. ఇంతకీ ఈ వంటకం ఎలా చేస్తారంటే..బియ్యం, కందిపప్పు, శనగపప్పు, మినపప్పు, పెసరపప్పులను నానబెట్టి గ్రైండ్ చేయాలి. అందులో కాస్త పెరుగు, కొన్ని నీళ్లు పోసి ఇడ్లీ పిండిలా తయారు చేయాఇ. సొరకాయ, క్యారెట్‌ల తరుగు, అల్లం, పచ్చిమిర్చి ముద్ద, పాలకూర, కొంత్తిమీర, ఉప్పు, కారం, పంచదార, బేకింగ్ సోడా, నిమ్మరసం..వీటన్నిటినీ పిండిలో కలిపి, అవెన్ బేక్ చేసి.. తాలింపు వేస్తే ఘుమఘుమలాడే 'హాండవో' తయారైపోతంఉది. వింటనే నోరూరుతోంది? అయితే మీరూ చేసి చూడండి. ◻



# సింధూర హనుమ

ఆధ్యాత్మికం

ఒకనాడు ఆంజనేయస్వామి.. ఆశీర్వాదం కోసం సీతమ్మతల్లి వద్దకు వచ్చాడు. సీతమ్మ పాదాలపై శిరస్సు ఉంచి నమస్కరించి తలపైకెత్తి చూడగా... ఎంతో ప్రకాశవంతమైన సీతమ్మ నుదిటిన కుంకుమను, పాపిడి మొదట్లో సింధూరం ఉండటాన్ని గమనించాడు. దాంతో హనుమ 'పాపిడిలో అలా సింధూరం ఎందుకు పెట్టుకున్నావు తల్లీ?' అని సీతాదేవిని అడిగాడు. అప్పుడు సీతమ్మ 'నా నాథుడు శ్రీరామచంద్రుని క్షేమం కోసం పెట్టుకున్నాను. ఇలా నుదిటిన సింధూరం ధరిస్తే నా ప్రభువుకి రక్షణ కవచంలా ఉంటుంది. ఆయనకు ఏ కష్టం రాకుండా కాపాడుతుంది' అని చెప్పింది. శ్రీరామునికి ప్రియమైన భక్తుడు హనుమ.. రాముని కోసం తన సర్వస్వం ధారపోసేవాడు. 'రామయ్య రక్ష కోసం సీతమ్మ తల్లి పాపిట సింధూరం ధరించింది, మరి నా దేహం అంతా రామమయమే కదా! నేనేమి చేయాలిఖి అనుకుని శరీరమంతా దట్టంగా సింధూరం పూసుకుని శ్రీరాముని వద్దకు వెళ్లి నమస్కరించాడు. హనుమంతుడి తీరు చూసి రామయ్య నవ్వుతూ 'ఇదంతా ఏమిటి హనుమా?' అని అడిగాడు. దానికి తానెందుకు అలా చేసిందీ వివరించాడు హనుమంతుడు. ఆ జవాబుకి ముచ్చటపడిన శ్రీరాముడు.. 'హనుమా! నా రక్షణ కోసం నువ్వు దేహమంతా సింధూరం రాసుకున్నావు కాబట్టి.. నిన్ను సింధూరంతో పూజించిన వారికి నేను రక్షగా నిలిచి ఉంటాను' అని వరమిచ్చాడు.



# నూనె తక్కువా.. రుచి ఎక్కువ

కూరలూ, టిఫిన్ల తయారీలో



**నూనె తక్కువగా వాడాలి.** రుచి మాత్రం అదిరిపోవాలి అనుకుంటున్నారా.. అలాంటప్పుడు ఎలాంటి సంకోచం లేకుండా ఈ సీసాలను వాడుకోవచ్చు. వీటితో స్ప్రేచేస్తే నూనె బిందువులు పడీపడనట్లుగా.. అలా అలా పడతాయి. వంటకాలను నూనెలో ముంచి తీయాల్సి న అవసరమే ఉండదు. ఓ పక్క ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకుంటునే మరోపక్క ఎప్పటిలా రకరకాల రుచులనూ ఆస్వాదించొచ్చు. పైగా వీటిని వాడటం, శుభ్రం చేసుకోవడం కూడా తేలికే. చూడచక్కని ఈ సీసాలు వంటింట్లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమించకుండా ఓ పక్కన ఒదిగిపోతాయి కూడా ◻

# చిన్న విషయాలూ మర్చిపోతున్నారా?



రోజూ మనం కలిసి మాట్లాడే స్నేహితురాలే అయినా ఉన్నట్టుండి ఒక్కోసారి తన పేరు వెంటనే గుర్తు రాదు. నచ్చిన సినిమాని ఎన్నో సార్లు చూస్తుంటాం. అయినా హీరోయిన్ పేరు అడిగితే టక్కుల చెప్పలేకపోతాం. కొన్ని సందర్భాల్లో అయితే ఇంటి తాళం చెవి ఎక్కడ పెట్టామో కూడా గుర్తు రాదు. చాలామందికి ఇలాంటి పరిస్థితి ఏదో ఒక సందర్భంలో ఎదురవుతుంది. ఇలా చిన్న చిన్న విషయాలను సైతం మరచిపోవడానికి వృత్తిపరమైన ఆందోళన, ఒత్తిడి వంటివి కారణమవుతాయంటున్నారు నిపుణులు. ఇలాంటి మతిమరుపును దూరం చేసుకోవాలంటే రోజుఆరీ జీవనశైలిలో కొన్ని అంశాల్ని అలవాటుగా మార్చుకోవాలంటున్నారు.

**పజిల్స్‌తో పదును..** రోజూ పత్రికలు చదవడం చాలామందికి ఉండే అలవాటు. అయితే చాల పత్రికల్లో సుడోకు, పిజిల్స్ పొడుపు కథలు, ఆజిక్‌తో ముడిపడి ఉండే ప్రశ్నలు.. వంటివి కూడా ప్రచురిస్తాం. కానీ ఇవన్నీ పిల్లల కోసమనో లేదంటే అంతగా ఆలోచించేఓపిక లేదనో వాటిని వదిలేస్తుంటారు చాలామంది. కానీ ఈ పజిల్స్ పూర్తి చేస్తున్నప్పుడు మన మెదడు చాలా చురుకుగా పనిచేస్తుంది. ఎక్కడ ఎ పదం నింపామో కూడా గుర్తుపెట్టుకుంటుంది. అందుకే రోజూ ఏదో ఒక సమయంలో వీటిని సాధన చేయడం ద్వారా మతిమరుపును దూరం చేసుకొని జ్ఞాపకశక్తిని పెంచుకో వచ్చంటున్నారు నిపుణులు.



**యోగా...** మతిమరపుకి మరో ప్రధాన కారణం తీవ్రమైన ఒత్తిడి. ఆపీసులో పని భారం అధికంగా ఉన్నా లేదంటే ఏ పనైనా సరిగ్గా పూర్తికాకపోయినా.. ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ పనులు చేయాల్సి వచ్చినా.. మన మెదడుపై ఒత్తిడి పడుతుంది. ఈ క్రమంలో చాలా విషయాల్లో మనకు తెలియకుండానే మతిమరుపు వస్తుంటుంది. దీనికి యోగా చక్కటి పరిష్కారం అంటున్నారు. నిపుణులు. యోగా సాధన చేయడం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. ఫలితంగా మనలో ఒత్తిడి తగ్గిపోతుంది. దీనితో పాటు ధ్యానం కూడా ఒత్తిడిని దూరం చేసి ఏకాగ్రతను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.

**తగినంత నిద్ర.....** నిద్ర మెదడుకు పూర్తి విశ్రాంతినిస్తుంది. అందుకే సరిపడినంత సేపు నిద్రపోకపోతే మెదడు పనితీరు తగ్గిపోతుంది. ఫలితంగా సమయానికి ఏమీ గుర్తురావు. అలాగేమెదడు కూడా ఒత్తిడికి గురవుతుంటుంది. కాబట్టి రోజూ ఏడెనిమిది గంటలు కచ్చితంగా నిద్రపోవాలి. దీనివల్ల ఉదయం లేవగానే మనసుకు ఉల్లాసంగా, శరీరానికి ఉత్సాహంగా అనిపిస్తుంది. మద్ధకం దూరమై మెదడుకూ ప్రశాంతత చేకూరుతుంది. ఇవన్నీ మతిమరుపును దూరం చేసేవే! అంతేకాదు.. ఉదయాన్నే నిద్ర లేచే వారిలోనూ మెదడు చురుగ్గా పనిచేస్తుందని పలు అధ్యయనాల్లోనూ వెల్లడైంది.

**రివర్స్ చేద్దాం...** మీరు చేతికి వాచీ ఎలా పెట్టుకుంటారు? టైం చూడటానికి వీలుగా అంటారా? అయితే ఈసారి అలా కాకుండా వాచీని తిరగేసి పెట్టుకోండి. ఎందుకంటే ఇది మన జ్ఞాపకశక్తిన్ని పెంచుతుందట. తిరగేసి వాచీ పెట్టుకున్నప్పుడు మెదట్లో సమయం తెలుసుకోవడానికి కాస్త ఇబ్బంది పడతాం.కానీ అలవాటయ్యే కొద్దీ సమయం చూడడం సులభమవుతుంది. అంటే ఏదశలో వాచీ పెట్టుకున్నా సమయాన్ని గుర్తించగలిగే సామర్థం మెదడుకు అలవడుతుంది. తద్వారా మెదడు చురుకుదనం పెరుగుతుంది. రోజూ వ్యాయామం చేయడం, కాఫీ, టీలకు దూరంగా ఉండడం, నక్రియేటివిటీని పెంచుకోవడం వంటి అలవాట్ల వల్ల కూడా మెదడు చురుకై మతిమరుపు సమస్య దూరమవుతుందంటున్నారు నిపుణులు. ◻






### డబ్ల్యుటిసి పాయింట్లలో..

# భారత్‌కు తప్పని నిరాశ

## వెస్టిండీస్‌పై గెలిచినా మెరుగుపడని ప్లేస్

**న్యూఢిల్లీ:** తొలి టెస్టులో వెస్టిండీస్ పై ఘన విజయం సాధించినా కూడా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత స్థానం మెరుగుపడలేదు. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తొలి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. వెస్టిండీస్ మూడు రోజులు కూడా మైదానంలో ఉండకుండా చేసింది. దీంతో, శుభ్‌మాన్ గిల్ కెప్టెన్‌గా భారత్ తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసింది. అయితే, ఈ అద్భుతమైన విజయం ఉన్నప్పటికీ, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు ఎటువంటి ఆధిక్యాన్ని పొందలేకపోయింది. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఇది టీమ్ ఇండియా ఆరవ మ్యాచ్. గతంలో, భారత జట్టు ఇంగ్లాండ్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి, రెండింటిలో గెలిచి, అదే సంఖ్యలో ఓడిపోయింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. ఇప్పుడు, వెస్టిండీస్‌ను ఓడించడం ద్వారా, టీమ్ ఇండియా 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో తన మూడవ విజయాన్ని సాధించింది. ఈ విక్టరీతో, భారత




జట్టు విజయ శాతం 46.67 నుంచి 55.56కి పెరిగింది. అయితే, పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. ఇక ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో వెస్టిండీస్ పేలవమైన ప్రదర్శన కనబరిచింది. ఇంకా ఒక్క విజయం కూడా నమోదు చేయలేదు. నాలుగు మ్యాచ్‌లు ఆడి అన్నింటిలోనూ ఓడిపోయింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ఇంతలో, ఇంగ్లాండ్ ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో స్టాండింగ్స్ లో నాల్గవ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ కూడా రెండు మ్యాచ్‌లు ఆడి ఇంకా ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. అయినప్పటికీ ఒక డ్రా కారణంగా ఐదవ స్థానంలో ఉంది. నిజానికి, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా, శ్రీలంక భారత జట్టు కంటే ముందున్నాయి. రెండు జట్లు భారత జట్ట కంటే మెరుగైన విజయ శాతాన్ని కలిగి ఉన్నాయి. వెస్టిండీస్‌ను ఓడించిన తర్వాతకూడా, టీమ్ ఇండియా విజయశాతంలో ఆస్ట్రేలియా, శ్రీలంకను అధిగమించ లేకపోయింది. ఆస్ట్రేలియా ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడి మూడింటినీ గెలుచుకుంది. ఫలితంగా 100 విజయ శాతం వచ్చింది. మరోవైపు, శ్రీలంక రెండు మ్యాచ్‌లలో ఒక విజయం, ఒక డ్రాతో 66.67 విజయ శాతంతో రెండవ స్థానంలో ఉంది.

## అల్ ఐన్ మాస్టర్స్: భారత్‌కే సింగిల్స్, డబుల్స్ టైటిళ్లు

**న్యూఢిల్లీ:** అల్ ఐన్ మాస్టర్స్ 2025, మహిళల సింగిల్స్ మరియు పురుషుల డబుల్స్ టైటిళ్లను భారత్ షట్లర్లు కైవసం చేసుకున్నారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అంసకరుణన్ మరియు ఎంఆర్ అర్జున్ విజయం సాధించడంతో రైజింగ్ స్టార్ శ్రీయాన్షి తొలి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అబుదాబిలో సోమవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 100 ఈవెంట్ అయిన అల్ ఐన్ మాస్టర్స్‌లో భారత షట్లర్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఖలీఫా బిన్ జాయెద్ స్టేడియంలో జరిగిన 49 నిమిషాల హోరాహోరీ పోరులో 18 ఏళ్ల శ్రీయాన్షి వలిశెట్టి 15-21, 22-20, 21-7 తేడాతో స్వదేశీయురాలు తస్నీమ్ మీర్‌ను ఓడించి అద్భుతమైన పునరాగమనం చేసింది. ఇది 20 ఏళ్ల మాజీ జూనియర్ ప్రపంచ నంబర్ 1 పై మూడు మ్యాచ్‌లలో శ్రీయాన్షి సాధించిన తొలి విజయంతో పాటు, తొలి బిఎఫ్‌డబ్ల్యూ సూపర్ 100 టైటిల్‌ను నమోదు చేసింది. ప్రస్తుతం ప్రపంచ 61వ ర్యాంక్‌లో ఉన్న శ్రీయాన్షి తొలి గేమ్‌లో 4-0 ఆధిక్యంతో మ్యాచ్‌ను బలంగా ప్రారంభించింది. తస్నీమ్ 21-15తో ఓపెనర్‌ను కైవసం చేసుకోవడానికి పోరాడింది. కానీ శ్రీయాన్షి రెండవ గేమ్‌ను 22-20తో తృటిలో గెలిచి పోటీని నిర్ణయాత్మక మ్యాచ్‌గా మార్చింది. చివరి గేమ్‌లో వలిశెట్టి శ్రీయాన్షి ఆధిపత్యం చెలాయించింది, 7-7తో టైను 21-7తో ఓడించింది. ఇక పురుషుల డబుల్స్‌లో, భారత జంట హరిహరన్ అంసకరుణన్-ఎంఆర్ అర్జున్ ఇండోనేషియాకు చెందిన ఐదవ సీడ్ రేమండ్ ఇంద్ర-నికోలస్ జోక్విన్‌లను 35 నిమిషాల్లో 21-17, 21-18 తేడాతో ఓడించారు. అలాగే పురుషుల సింగిల్స్‌లో, మాజీ ప్రపంచ నంబర్ 1 కిదాంబి శ్రీకాంత్ ప్రచారం సెమీఫైనల్లో ముగిసింది. మలేషియాకు చెందిన షోలే ఐడిల్ చేతిలో 4-21, 21-11, 19-21 తేడాతో ఓడిపోయాడు.




### అనిసిమోవాకు

# చైనా ఓపెన్ కిరీటం

**న్యూఢిల్లీ:** ఫామ్‌లో ఉన్న అనిసిమోవా చైనా ఓపెన్ కిరీటాన్ని గెలుచుకుంది. బీజింగ్‌లో జరిగిన చైనా ఓపెన్ ఫైనల్లో లిండా నోస్కోవాను ఓడించి, అమండా అనిసిమోవా తన కెరీర్‌లో రెండవ డబ్ల్యూటిఎ 1000 టైటిల్‌ను సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఒడిదుడుకుల నుండి కోలుకుంటూ అనిసిమోవా 6-0, 2-6, 6-2 తేడాతో నోస్కోవాను ఓడించింది. ఫిబ్రవరిలో ఖతార్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవడంతో పాటు, ఆ తర్వాత వింబుల్డన్ మరియు యుఎస్ ఓపెన్‌లలో ఫైనల్ ఫినిషింగ్‌లతో అనిసిమోవా ఈ సీజన్‌లో కూడా తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తోంది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో జాస్మిన్ పావోలినిని ఓడించి, సెమీ ఫైనల్లో తన స్వదేశీయురాలు కోకో గాఫ్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించి టాప్ 10 క్రీడాకారిణులపై వరుసగా విజయాలుసాధించింది. ఫైనల్స్‌లో గాఫ్‌తో జరిగిన మ్యాచ్‌లో అనిసిమోవా ఆపిన చోటు నుంచి పుంజుకుంది, కేవలం 23 పరుగులు మాత్రమే చేసి మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. అక్కడ ఆమె కేవలం 12 పాయింట్లు మాత్రమే కోల్పోయింది. ప్రత్యర్థి తడబడుతుండగా, ఆమె రెండవ సెట్ యొక్క 11 నిమిషాల ప్రారంభ గేమ్‌లో అనిసిమోవా బద్దలు కొట్టి రెండవ సెట్‌ను కైవసం చేసుకుంది. 20 ఏళ్ల చెక్ విజేతగా కనిపించినప్పుడు, అనిసిమోవా ఆరవ గేమ్‌లో బ్రేక్ చేసి 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆమె మరో బ్రేక్‌తో టైటిల్‌ను కైవసం చేసుకుంది, బ్యాక్‌హ్యాండ్‌తో దానిని మూసివేసింది.

### అబియా పారా బ్యాడ్మింటన్‌లో..

# ప్రమోద్‌కు ట్రిపుల్ స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** ఏస్ ఇండియన్ పారా షట్లర్ ప్రమోద్ భగత్ 1వ అబియా పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్-2025లో తన అత్యుత్తమ ఫామ్‌ను ప్రదర్శించి మూడు బంగారు పతకాలను సాధించాడు. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3 టైటిల్‌ను భగత్ గెలుచుకున్నాడు. అబియాలో సోమవారం జరిగిన ఉత్కంఠ ఫైనల్ పోరులో మంటు కుమార్‌ను 21-7, 9-21, 21-9 తేడాతో ఓడించాడు. వ్యూహాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ భగత్ రెండవ గేమ్‌ను కోల్పోయిన తర్వాత బలంగా పుంజుకుని మూడు గేమ్‌లలో విజయం సాధించాడు. ఆ తర్వాత అతను సుకాంత్ కదమ్‌తో కలిసి పురుషుల డబుల్స్‌లో పెరూకు చెందిన గెర్సన్ జైర్ వర్గాస్ లోస్టానౌల్-డయానా రోజాస్ గోలాక్‌లను వరుస సెట్లలో 21-13, 21-17 తేడాతో ఓడించి మరో స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఇక భగత్ మూడవ స్వర్ణం మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌ఎల్3-ఎస్‌యు5 విభాగంలో వచ్చింది. ఆరతి పాటిల్‌తో కలిసి మరో ఉత్తేజకరమైన ఫైనల్ విజయాన్ని సాధించాడు. ఇక భారత్‌కే చెందిన షట్లర్లు వివిధ విభాగాల్లో రాణించారు. పురుషుల సింగిల్స్ డబ్ల్యూహెచ్2లో నూరుల్ హుస్సేన్ ఖాన్ రజతం గెలుచుకోగా, మహిళల సింగిల్స్ ఎస్‌ఎల్3లో ఉమా సర్కార్ రజతం గెలుచుకుంది. మహిళల డబుల్స్ ఎస్‌ఎల్3-ఎస్‌యు5లో ఆరతి పాటిల్ మరియు ఉమా సర్కార్ ద్వయం కాంస్యం సాధించింది.

### ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్..

# నేపాల్‌పై భారత్ అద్భుతమైన విజయం

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ జట్టు అద్భుత ప్రదర్శనతో ప్రారంభించింది. గౌహతిలో తొలి రోజు సోమవారం జరిగిన ఉత్కంఠభరితమైన ఓపెనర్ మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ నేపాల్‌పై ఆధిపత్యం చెలాయించగా, శ్రీలంక జట్టు యుఎఇపై విజయం సాధించింది. రెండవ సీడ్ అయిన భారత్ గ్రూప్ బీ ఓపెనర్‌లో 45-18, 45-17తో సులభంగా విజయం సాధించింది, అయితే శ్రీలంక జట్టు యుఎఇ చేసిన ప్రయత్నాలు




తిప్పికొట్టి 30-45, 45-34, 45-44తో గెలిచింది. 14 సార్లు ఛాంపియన్లుగా నిలిచిన చైనా, మాజీ ఛాంపియన్లు ఇండోనేషియా, దక్షిణ కొరియాలతో సహా అన్ని ఇతర అగ్ర దేశాలు తమ ప్రత్యర్థులను రెండు వరుస సెట్లలో ఓడించి తమ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాయి. మాజీ ప్రపంచ జూనియర్ నంబర్ 1 బాలుర డబుల్స్ జత భార్గవ్ రామ్ అరిగెల, విశ్వ తేజ్ గొబ్బూరు కబీర్ కెసి, సుప్రీమ్ పంటపై 9-3 తేడాతో విజయం సాధించి భారతదేశం తరపున బంతిని ముందుకు తీసుకెళ్లారు.

అలాగే బాలికల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, ఆసియా అండర్19 ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత తన్వి శర్మ వారి వారి సింగిల్స్ మ్యాచ్‌లలో క్లినికల్‌గా రాణించగా, సూర్యాంశ్ రావత్, రౌనక్ చౌహాన్ పెద్ద సవాళ్లను సైతం ఎదుర్కొన్నారు. ఇక చైనా 45-14, 45-10 తేడాతో ఘనాను, కొరియా 45-22, 45-29 తేడాతో హంగేరీని, చైనీస్ తైపీ బ్రెజిల్‌ను 45-24, 45-19 తేడాతో, ఇండోనేషియా 45-27, 45-40 తేడాతో ఫిలిప్పీన్స్‌ను ఓడించాయి.

### ఐపిఒ ద్వారా లలితా జ్యుయెలరీ మార్ట్ రూ.1700 కోట్లు

# సేకరణకు సెబి అనుమతి


**విశాఖపట్నం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** చెన్నైకి చెందిన లలితా జ్యువెలరీ మార్ట్, ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ) ద్వారా రూ.1700 కోట్లు సేకరించేందుకు మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) నుంచి అనుమతి పొందింది. కంపెనీ ఈ యేడాది జూన్ 6న సెబీకి తమ ఐపిఒ పత్రాలను దాఖలు చేసింది. ప్రమోటర్ కిరణ్ కుమార్ ఐపిఒ ద్వారా రూ.1200 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల తాజా జారీ, మరో రూ.500 కోట్ల విలువైన షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉండనున్నాయి. దేశంలో కొత్త దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మూలధన వ్యయానికి నిధులు సమకూర్చేందుకు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం. రూ.1014.50 కోట్ల వరకు తాజా ఇష్యూ ద్వారా రానుంది. లలితా జ్యువెలరీ మార్ట్ 1985లో చెన్నైలోని టి.నగర్ ప్రాంతంలో తన మొదటి స్టోర్‌ను ప్రారంభించింది, ఇది పట్టు మరియు ఆభరణాల రిటైల్ అవుట్‌లెట్‌లకు కేంద్రంగా ఉంది. ప్రధానంగా బంగారు ఆభరణాలను విక్రయిస్తోంది. వెండి వస్తువులు, వజ్రాల ఆభరణాలుకూడా ఉన్నాయి. ఇది దక్షిణ భారత మార్కెట్‌కు సేవలు అందిస్తోంది,బిఐఎస్ హాల్‌మార్క్ చేసిన ఆభరణాలతో 56 స్టోర్‌ల ద్వారా పనిచేస్తుంది, వీటిలో 22 ఆంధ్రప్రదేశ్‌లో, 20 తమిళనాడులో, ఏడు కర్ణాటకలో, ఆరు తెలంగాణలో, ఒకటి పుదుచ్చేరిలో ఉన్నాయి, గత ఏడాది డిసెంబర్ 31నాటికి మొత్తం 6,09,408 చదరపు అడుగుల కార్యాచరణ ప్రాంతంలో విస్తరించి ఉన్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ పేర్కొంది. సిఎజిఆర్ పేర్కొన్న క్రిసిల్ నివేదిక ప్రకారం 2022 నుంచి 2024 ఆర్థిక సంవత్సరం, డిసెంబరు 31, 2024తో ముగిసిన తొమ్మిది నెలల్లో దేశంలోని కీలకమైన వ్యవస్థీకృత ఆభరణాల ఆటగాళ్లలో ఇది స్టోర్‌కు అత్యధిక నిర్వహణ ఆదాయాన్ని కలిగి ఉన్నట్టు సంస్థ పేర్కొంది.వినియోగదారులను ఆకర్షించే విధంగా పలు పథకాలను అమలుచేస్తోంది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి, 420,261 మంది వినియోగదారులు నమోదు చేసుకున్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ వివరించింది. ఇది తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో తిరుముడివక్కం (కంపెనీ ద్వారా నిర్వహిస్తున్న), కాంచీపురంలోని మరైమ్మలై (దాని పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ, అసిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తోంది. రెండు తయారీ సౌకర్యాలను నిర్వహిస్తోంది. డిసెంబర్ నుంచి చెన్నైలోని తిరుముడివక్కంలో దాని తయారీ కేంద్రం కార్యకలాపాలను ప్రారంభించినట్టు వివరించింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి, ఇది 563 చేతివృత్తిదారులను నియమించుకుంది.(కంపెనీ ద్వారా 474 చేతివృత్తిదారులు, అసిత జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 89 చేతివృత్తిదారులను నియమించింది). కంపెనీ దేశంలోని అతిపెద్ద ఆభరణాల దుకాణాల్లో ఒకటి విజయవాడలో నిర్వహిస్తున్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ యాజ మాన్యం పేర్కొంది. ఇది మొత్తం 1,00,000 చదరపు అడుగుల కార్పెట్ విస్తీర్ణంలో విస్తరించి ఉంది.

# చుక్కల్లోకి చేరిన పసిడి

## 10గ్రాములు ధర సగటున రూ.1.23 లక్షలు పైనే

### ఒక్కరోజులోనే రూ.1370 పెరుగుదల

### అదే బాటలో వెండికూడా...



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** అమెరికా షట్‌డౌన్, ప్రపంచ ఆర్థికమార్కెట్లలో అనిశ్చితులు, ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల కుదింపు వంటి అంశాలతో ఇన్వెస్టర్లు మొత్తం బంగారం మార్కెట్ వైపు దృష్టిమరల్చారు. దీనికితోడు ఈక్విటీ మార్కెట్లలో విదేశీ ఇన్వెస్టర్లు కూడా అనిశ్చితి నేపథ్యంలో ఇప్పటివరకూ 1.20 లక్షల కోట్లు విత్‌డ్రాచేసారని వినికిడి. ఒక్క నెలలోనే 60వేలకోట్లకుపైగా విత్‌డ్రాచేసారంటే గోల్డ్‌మార్కెట్ వైపు ఇన్వెస్టర్లు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కరెన్సీ మార్కెట్‌లో కూడా భారత్ రూపాయి భారీగా క్షీణతను ఎదుర్కొంటున్నది. దీనితో గత చరిత్రలో ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు పెరిగాయి. దేశంలో సగటున పదిగ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరలు 1.23 లక్షలరూపాయలుగా పలుకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లలోకూడా బులియన్‌ధరలు ఔన్స్ ఒక్కొంటికి 3949.58 డాలర్లకుపైబడింది. హైదరాబాద్‌లో పదిగ్రాముల 24 క్యారెట్లు రూ.9700 పెరిగి 1,23,420 రూపాయలుగా నడిచింది. 22 క్యారట్ల ధరలు కూడా రూ.1250 పెరిగి రూ.1,10,700గా ఉంటే 18 క్యారెట్ల బంగారంధర కూడా రూ.1030 పెరిగి రూ.90,850గా నడిచింది. చెన్నైలో బంగారం ధరలు చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారెట్లు రూ.1,20,660గా ఉంటే 22 క్యారెట్లుధరలు రూ.1,10,600గాఉంది. ఇక18క్యారెట్లు రూ.91,600గా నమోదయింది. అలాగే ముంబయిలో 10 గ్రాముల 24 క్యారెట్లగోల్డ్ ధరలు రూ.1,20,770గా ఉంది. 22 క్యారెట్లుధరలు 1,10,700గాను, 18 క్యారెట్ల పదిగ్రాముల ధరలు రూ.1030పెరిగి రూ.90,580గా నడిచింది. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంధరలు రూ.1,30,300గా నడిస్తే 22 క్యారెట్లు ధరలు రూ.1,10,700 గా నడిచింది. 18 క్యారెట్లధరలు రూ.90,580గా నమోదయింది. బెంగళూరు మార్కెట్లు పదిగ్రాములు 1,20,820గాను, 22 క్యారెట్లు 1,10,750గాను, 18 క్యారెట్లు 90,630గాను కొనసాగింది. ఆభరణాల వ్యాపారిని ముంబయి తర్వాత అత్యంత బిజీ మార్కెట్ అయిన అహ్మదాబాద్‌లో 24 క్యారెట్లు రూ.1,20,820గాను, 22 క్యారెట్లు రూ.1,10,750గాను, 18 క్యారెట్లు ధరలు రూ.90,630గాను నమోదయింది. వెండిధకరలు కూడా కిలో ఒక్కొంటికి 1.54 లక్షలుగా కొనసాగింది.

దేశరాజధానిలో అయితే 1.57,400గా నడిచింది. వెండి ఒక్కరోజులోనే 7400 పెరిగి పీక్‌స్థాయికి చేరింది. గత వారాంతంలో1.50 లక్షలున్న వెండి సోమవారానికి అకస్మాత్తుగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోకూడా ఔన్స్ ఒక్కొంటికి వెండి 48.75 డాలర్లు పెరిగింది.

### అదానిగ్రూప్ ఎసిసి కంపెనీకి

# ఐటిశాఖ భారీ జరిమానా



**ముంబయి, అక్టోబరు 6:** భారత్ కార్పొరేట్‌రంగంలో అగ్రామి బిలియనీర్ అయిన గౌతమ్ ఆదాని కంపెనీలు ఆదానిగ్రూప్ సిమెంట్ కంపెనీ ఎసిసికి ఆదాయపు పన్ను ఝలక్ ఇచ్చింది. రెండు వేరువేరు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.23.07 కోట్ల జరిమానా వేసింది. ఈ ఉత్తర్వుల కాపీలు కంపెనీకి ఈనెల 1వ తేదీనే అందాయి. అయితే వీటి ప్రభావం కంపెనీ కార్యకలాపాలపై ఉండబోదని, ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తున్నట్లు ఎసిసి వెల్లడించింది. ఆదానిగ్రూప్‌లో విలీనం కంటే ముందుకాలానికి సంబంధించినవని చెప్పింది. 2015-16, 2018-19 సంవత్సరాలకు సంబంధించి ఈ జరిమానాలు ఆదాయపు పన్నుశాఖ విధించింది. 2014-15లో కంపెనీ చేసిన 49.25 కోట్ల ఖర్చు క్లెయిమ్‌ను ఐటిశాఖ ఆమోదించలేదు. ఫలితంగా పన్ను 14.22 కోట్లు జరిమానాగా విధించింది. తప్పుడు ఆదాయ వివరాలు అందించిందని వర్గీకరించింది. రెండోజరిమానా పరంగా 2018-19 అసెస్‌మెంట్ సంవత్సరంలో ఆదాయపు పన్ను 12.79 కోట్ల ఖర్చు క్లెయిమ్‌చేసినా తిరస్కరించింది. ఆదాయం తక్కువ చూపించిందని రూ.8.85 కోట్లు జరిమానా వేసింది. ఈజరిమానా సంబంధిత చెల్లింపుపన్నులో 200శాతం రేటుతో విధించింది. ఈ రెండు ఉత్తర్వులను మేం అప్పీలుచేస్తామని వెల్లడించింది. నిర్ణీత గడువులోపు పన్నుకమిషనర్‌వద్ద అప్పీలు దాఖలుచేస్తామని, జరిమానా డిమాండ్లపై స్టే కోరతామని వెల్లడించింది. ఎసిసి సిమెంట్స్ఆదాని గ్రూప్‌లో ఒకటిగా ఉంది. అంబూజా సిమెంట్స్ ఎసిసిలో 50శాతం కంటే ఎక్కువ వాటాతో ఉంది. స్విస్‌కంపెనీ హోల్సిమ్‌నుంచి అంబూజా సిమెంట్స్‌ను 6.4 బిలియన్ డాలర్లకు కొనుగోలుచేసింది. ఎసిసి ఆదానిగ్రూప్‌లో విలీనానికి ముందే ఈ జరిమానాలు విధించిన అసెస్‌మెంట్‌సంవత్సరాలనం కంపెనీ స్పష్టంచేస్తున్నా ఆదానికి మాత్రం మళ్లీ అప్పీలుకు వెళ్లక తప్పని పరిస్థితి ఎదురయింది.



## టిమ్‌కుక్ తదుపరి యాపిల్ సిఇఒ ఎవరు?

**సియాటెల్, అక్టోబరు 6:** యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ వారసుడిపై టెక్కీ సర్కిళ్లలోజోరుగాచర్చలు సాగుతున్నాయి. వచ్చేనెలలో 65 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న టిమ్‌కుక్ వారసుడిగా ప్రస్తుతం యాపిల్ హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ బాధ్యతలు చూస్తున్న ఉపాధ్యక్షుడు జాన్‌టర్నస్ పేరు వినిపిస్తోంది. యాపిల్‌తో టర్నస్‌కు 24ఏళ్లు అనుబంధం ఉంది. ఆయన వయసు ప్రస్తుతం 50 ఏళ్లు. సిఇఒగా 2011లో టిమ్‌కుక్ ఛార్జితీసుకున్నపుడు కూడా ఆయనకు 50 యేళ్లే. యాపిల్ సంస్థలో కీలకనిర్ణయాలు తీసుకునే అతికొద్దిమంది వ్యక్తుల్లో టర్నస్ ఒకరు. లండన్‌లో ఐఫోన్ 17 ఈవెంట్‌లో ఐఫోన్ ఎయిర్‌ను ఆయనే మార్కెట్‌కు వదిలారు. యాపిల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లందరినీ చూస్తే ఆయనే పిన్నవయస్కుడు.మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌యాపిల్ సివోవో సబిహ్‌ఖాన్‌పేరుతో పాటు రిటైల్‌హెడ్ డీర్డ్రేఓబ్రెయిన్‌లపేర్లుకూడా ఉన్నాయి. కొంతకాలం అడ్‌హాక్ సిఇఒగా నియమించి ఆతర్వాతనే శాశ్వత ప్రతిపాదికన సిఇఒ నియామకంవైపుకూడా చూస్తున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్లకు కార్పొరేట్ ఫలితాల దన్ను!

### సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలజోరు..

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వారం ప్రారంభంలో లాభాల్లో ముగిసాయి. కార్పొరేట్‌త్రైమాసిక ఫలితాలపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ పెట్టారు. నిఫ్టీ 25,070కిపైబడి ట్రేడింగ్ నిలిపివేసింది. ఐటి, హెల్త్‌కేర్, ప్రైవేటు బ్యాంకు స్టాక్స్ భారీగాపెరిగాయి. ఆర్బిఐ గత వారం తన పాలసీ విధానాలను ప్రకటిస్తూ జిడిపి అంచనాలను 6.8శాతంగా ప్రకటించింది. అలాగే ద్రవ్యోల్బణం అంచనాను కూడా 3.1 నుంచి 2.6శాతంగా ఉంటుందని ప్రకటించడంతో సూచీల్లో జోరుపెరిగింది. బిఎస్ఇ సెన్సెక్స్ 582.95 పాయింట్లు పెరిగి 81,790.12 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 183.40 పాయింట్లుపెరిగి 25,077.65 వద్ద స్థిరపడింది. వరుసగా మూడు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు 1.9శాతం పెరిగాయి. ఇన్ఫోసిస్ 1.98, బజాజ్ ఫైనాన్స్ 1.95, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.93శాతం చొప్పున సూచీల్లో పెరిగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.68శాతం లాభపడితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.20శాతం వెనుకబడింది. మార్కెట్లలో బిఎస్ఇ పరంగా 1827 కంపెనీలు లాభపడితే 2453 కంపెనీలు క్షీణించాయి. మొత్తం 173 కంపెనీలు స్థిరంగా కొనసాగినట్లు తేలింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 88.82వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్‌పరంగా 1.57శాతం లాభపడింది. పదిగ్రాములు 1,19,957గా నడిచింది. యుఎస్ పదేళ్ల బాండ్ల రాబడులు 1.04శాతంపెరిగి 4.163 శాతంగా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 1.11 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 65.64 డాలర్లుగాకొనసాగింది. యూరోపియన్ మార్కెట్లలో సూచీలు కొంతమేర లాభాల్లోనే కొనసాగాయి. ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ ఆకస్మిక రాజీనామాపైనా దృష్టిపెట్టాయి.ఆసియా మార్కెట్లు సైతం భారీగాపెరిగాయి జపాన్ కొత్తప్రధానిగా సానై తకైయిచి ఎన్నికవడాన్ని మార్కెట్లు స్వాగతించాయి. ఇక చైనా, దక్షిణకొరియాలు మాత్రం సెలవుల కారణంగామూతపడ్డాయి. ఇక నాస్‌డాక్ కాంపోజిట్ 0.28 శాతం క్షీణించి 22,780.51వద్ద నిలిచింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 238.56 పాయింట్లవద్ద క్షీణించి 46,758.28 వద్ద నిలిచింది. రస్సెల్ 2000 సూచీ కూడా 0.72శాతం పెరిగి 2476.18 వద్ద ముగిసింది. ఇక మార్కెట్లకు పేస్ డిజిటెక్ 217.50వద్దట్రేడ్ అయింది. ఇష్యూధర 2019 కాగా 0.68శాతం క్షీణించింది. సిజిహెచ్ఎస్‌రేట్లను కేంద్రం సవరించడంతో ఆసుపత్రి కంపెనీల షేర్లు భారీగాపెరిగాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.93శాతం, ఉజ్జీవన్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 1.20శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 1.20శాతం పెరిగితే బంధన్‌బ్యాంకు షేర్లు 0.42శాతం క్షీణించాయి. జుబిలియంట్ ఫుడ్‌వర్క్స్ 0.62శాతం క్షీణించింది. క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ 2.50శాతం ర్యాలీతీసింది. అలాగే పూనావాల్లా ఫిన్‌కార్ప్ కూడా 1.47శాతంపెరిగితే జెటిఎల్ ఇండస్ట్రీస్ 1.90శాతం దిగజారింది. ఫోర్స్ మోటార్స్ 2.75శాతం క్షీణించింది. ఇక ఐపిఒలపరంగా మొదటిరోజు వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ తొలిరోజు 34,08,876 షేర్లకు బిడ్లు స్వీకరించింది. టాటాక్యాపిటల్‌కూడా 12,79,92,332 షేర్లకు బిడ్లు స్వీకరించింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.